




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

మంగళవారం | 2 జూలై 2024 | విజయవాడ

సంపుటి 17 | సంచిక 213

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi







అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు, జ్యేష్ఠ మాసం ఏకాదశి ఉ.8.55, భరణి ఉ.6.20, వర్జ్యం సా.5.45 నుంచి 7.16 వరకు
రాహుకాలం మ.3.00 నుంచి 4.30 వరకు దుర్ముహూర్తం ఉ.8.16 నుంచి 9.06 వరకు తిరిగి రా.10.49 నుంచి 11.35 వరకు

- పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమం
- మాటిచ్చినట్లుగానే తొలి నెల నుంచే పింఛన్లు పెంచి పంపిణీ
- 65.31 లక్షల మంది లబ్ధిదారుల కోసం రూ.4408 కోట్లు ఖర్చు
- సంక్షేమం అంటే కేవలం డబ్బులు ఇవ్వడం కాదు...జీవన ప్రమాణాలు పెంచడం
- మళ్లీ 1995 నాటి సీఎంను చూస్తారు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



2 లో

# వాడవాడలా, పింఛన్ పండగ

రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పండుగ వచ్చిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఒకే నెలలో పెన్షన్లకు రూ.4,408 కోట్లు ఖర్చు చేయడం చారిత్రాత్మకమని, ఇంతకంటే శుభదినం మరొకటి లేదని అన్నారు. మంగళగిరి నియోజకవర్గం, పెనుమాకలోని ఎస్టీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే లబ్ధిదారులకు పింఛను అందించారు.



## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

- జూలై మాసాన్ని లాభాలతో ఆరంభించిన సెన్సెక్స్, నిఫ్టీ
- క్లోజింగ్ బెల్ సమయానికి సెన్సెక్స్ ట్రేడింగ్‌లో 443 పాయింట్ల వృద్ధి
- 131 పాయింట్లు లాభపడి 24,141.95 వద్ద స్థిరపడిన నిఫ్టీ

వివరాలు-5లో

## సభలో అగ్నిపథ్‌పై మాటల తూటాలు

- ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మధ్య వాగ్యుద్ధం
- 158 సంస్థల అభిప్రాయాలు తీసుకున్నామన్న రాజ్‌నాథ్
- అగ్నిపథ్‌ను యూజ్ అండ్ త్రో లేబర్ పథకమన్న రాహుల్



6 లో

లోక్‌సభ సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మధ్య మాటల తూటాలు పేలాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన అగ్నిపథ్‌ను యూజ్ అండ్ త్రో లేబర్ పథకంగా రాహుల్ అభివర్ణించారు.

## తెలంగాణ హైకోర్టులో కేసీఆర్‌కు ఎదురుదెబ్బ

- ప్రభుత్వ వాదనలను ఏకీభవించిన న్యాయస్థానం
- కేసీఆర్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్కు ఎదురుదెబ్బ తగిలింది. కేసీఆర్ వేసిన పిటిషన్ను న్యాయస్థానం కొట్టివేసింది. ప్రభుత్వ వాదనలకు న్యాయస్థానం ఏకీభవించింది. విద్యుత్ అవకతవకలపై జ్యుడిషియరీ కమిషన్ విచారణపై కేసీఆర్ సవాల్ చేశారు. నేడు కేసీఆర్ పిటిషన్పై హైకోర్టు తీర్పును వెలువరించింది.



6 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## మీటింగ్ పెట్టండి, నేను వచ్చి కలుస్తా

- రేవంత్ రెడ్డికి చంద్రబాబు లేఖ
- ఇరు రాష్ట్రాల మధ్య దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం బాబు చొరవ

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయాక ఏర్పడ్డ విభజన సమస్యలను పరిష్కరించుకోవడం కోసం లేఖ రాసినట్లు చంద్రబాబు తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రయోజనం కోసం విభజన సమస్యల పరిష్కారం దిశగా సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు.



2 లో

## త్వరలో తెలంగాణ మంత్రివర్గ విస్తరణ



6 లో

తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేతలకు శుభవార్త అందనుంది. త్వరలో తెలంగాణ మంత్రివర్గ విస్తరణ జరుగుతుంది. ఈ విషయాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మరో ఐదారుగురు నేతలకు తెలంగాణ కేబినెట్ లో చోటు దక్కనుందని చెప్పారు.

- తెలంగాణ కేబినెట్‌లో ప్రస్తుతం ఆరు ఖాళీలు
- మరో ఐదుగురికి చోటు
- హోమ్ మంత్రిగా సీతక్క
- కాంగ్రెస్ పెద్దలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

అంతా ఇంతే!




కరెక్టే కదా... కాలం కలిసిరాకపోతే అంతే సార్

## రికార్డు స్థాయిలో పింఛన్ల పంపిణీ

- కూటమి ప్రభుత్వ విజయం
- 12గంటల వ్యవధిలో రూ.4,170 కోట్లు పింఛన్ల పంపిణీ
- ఉదయం 6గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ 95 శాతం పింఛన్ల అందజేత
- సమాచార శాఖ మంత్రి పార్థసారథి



2 లో

ఆంధ్రప్రదేశ్ లో 12గంటల వ్యవధిలో రూ.4,170కోట్లు పెన్షన్ల రూపంలో పంపిణీ చేసి ఎన్డీయే ప్రభుత్వం రికార్డు నెలకొల్పిందని సమాచార శాఖ మంత్రి పార్థసారథి అన్నారు. సోమవారం ఉదయం 6గంటల నుంచి రాత్ర 8గంటల వరకూ 95శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్లు వెల్లడించారు. గతంలో ఎన్నడూ ఇలా ఎవరూ చేయలేదని, ఇది చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయం అని మంత్రి చెప్పుకొచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో 2.65లక్షల మంది వాలంటీర్లు ఉన్నా ఈ స్థాయిలో ఎప్పుడూ ఇవ్వలేదని గుర్తు చేశారు.

## మాది సాధింపుల ప్రభుత్వం కాదు... సాధించే ప్రభుత్వం

- 100 శాతం గ్రామాలకు రక్షిత మంచి నీరు అందించిన రాష్ట్రం చేయడమే మా ముందున్న లక్ష్యం
- గత పాలకులు మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకుండా కేంద్ర నిధులు వదిలేశారు
- రుషికొండ రాజప్రాసాదం డబ్బులతో ఓ జిల్లాను అభివృద్ధి చేయొచ్చు
- పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

'రాష్ట్రాభివృద్ధి... ప్రజా సంక్షేమం కోసం నేను బలమైన సంకల్పంతో ఎన్నికలకు వచ్చాను. ప్రజలంతా జనసేనను వంద శాతం విశ్వసించారు. వందకు వంద స్ట్రయిక్ రేటు ఇవ్వాలని కోరితే, ప్రజలంతా నిండు మనసుతో ఆశీర్వదించారు. ఇప్పుడు పాలనలోనూ అదే బలమైన సంకల్పాన్ని చేసుకుంటున్నాను. 100 శాతం గ్రామాలకు పూర్తిస్థాయి రక్షిత మంచినీటి పథకం అమలైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తయారు చేయాలి.



2 లో



## మహిళల మీద అత్యాచారాలు చేసే వాళ్లకు అదే చివరి రోజు

మంగళగిరి : మహిళల మీద అత్యాచారాలు చేసే వాళ్లకు అదే చివరి రోజు అవుతుంది అని వార్నింగ్ ఇచ్చారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. మంగళగిరి నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. పెనుమాకలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకాన్ని ప్రారంభించారు.. స్వయంగా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పెన్షన్ అందించారు సీఎం.. ఇక, ఈ సందర్భంగా ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. వివిధ అంశాలను ప్రస్తావించారు. ఆడబిడ్డలకు రక్షణగా ఉంటాం.. మహిళల మీద అత్యాచారాలు చేసేవాళ్లకు అదే చివరి రోజు అవుతుంది అంటూ హెచ్చరించారు. ఇప్పటి వరకు మర్యాదగా చెప్పాను.. గంజాయి మత్తులో వికృత వేషాలు వేస్తే ఎవరిని వదిలిపెట్టను అని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఇక, పోలవరం పూర్తిఅయితే రాష్ట్రంలో ప్రతి ఎకరానికి నీళ్లు ఇచ్చేవాళ్ళం.. అమరావతి పూర్తి అయ్యి ఉంటే ప్రతి ఒక్కరికీ ఉపాధి దొరికేది అన్నారు చంద్రబాబు.. కానీ, గత ప్రభుత్వ పాలన మొత్తం తప్పులు, అప్పులు గానే సాగిందన్నారు.. ఎంత అప్పు ఉందో తెలియడం లేదు.. అయితే, సంపద సృష్టించే బాధ్యత నాది.. పేదరికం లేని సమాజం కోసం ప్రయత్నిస్తున్నా.. ఇచ్చిన హామీని 26 రోజుల్లో అమలు చేసిన ప్రభుత్వం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అని స్పష్టం చేశారు.

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అని చెప్పిన ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ టిడిపి .. ఆ దిశగా పనిచేస్తా అన్నారు. మరోవైపు.. సీఎం వస్తున్నాడంటూ హడావిడి వద్దు.. పరదాలు కట్టొద్దు అని సూచించారు.. పరదాలు కడితే, కట్టిన అధికారికి సస్పెన్షన్ తప్పదు అని హెచ్చరించారు.. షాక్ ట్రీట్ మెంట్ ఇవ్వడానికి నేను సిద్ధం గా ఉన్నా.. రాబోయేది చంద్రబాబు 4.0 పాలన 95 సీబీఎన్‌ని చూస్తారు అని తెలిపారు సీఎం చంద్రబాబు.

# వాడవాడలా పింఛన్ పండగ

● పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమం ● మాటిచ్చినట్లుగానే తొలి నెల నుంచే పింఛన్లు పెంచి పంపిణీ ● 65.31 లక్షల మంది లబ్దిదారుల కోసం రూ.4408 కోట్లు ఖర్చు ● ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకుగా ఉంటా....మీ జీవితాలు మారుస్తా ● సంక్షేమం అంటే కేవలం డబ్బులు ఇవ్వడం కాదు...జీవన ప్రమాణాలు పెంచడం ● మళ్లీ 1995 నాటి సీఎంను చూస్తారు...అధికారులు కూడా కొత్త పాలనకు అలవాటు పడాలి ● చిత్తుచిత్తుగా ఓడినా వైసీపీ ఇంకా తన ఫేక్ ప్రచారాలనే నమ్ముకుంది ● ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



మంగళగిరి/పెనుమాక :- రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పండుగ వచ్చిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఒకే నెలలో పెన్షన్లకు రూ.4,408 కోట్లు ఖర్చు చేయడం చారిత్రాత్మకమని, ఇంతకంటే శుభదినం మరొకటి లేదని అన్నారు. మంగళగిరి నియోజకవర్గం, పెనుమాకలోని ఎస్టీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే లబ్ధిదారులకు పింఛను అందించారు. లబ్ధిదారుడు బాణావత్ పాములు నాయక్ కుటుంబానికి మొదటగా పెన్షన్ అందించారు. నాయక్ కూతురు ఇస్లావతి బాయికి వితంతు పెన్షన్, పాములు నాయక్ కు వృద్ధాప్య పెన్షన్, భార్య సీతా బాయికి రాజధాని పరిధిలో భూమిలేని వారికి ఇచ్చే వ్యవసాయ కూలీ పెన్షన్ ను అందించారు. అనంతరం నాయక్ కుటుంబ సభ్యులతో కాసేపు సీఎం ముచ్చటించారు. నాయక్ ఇల్లు లేదని సీఎంతో చెప్పగా తక్షణమే ఇల్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపి...ఇంటి నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని వెంటనే అధికారులను ఆదేశించారు. ఎస్టీ వాడలోనే తిరిగి స్థానికుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మసీదు సెంటరులో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులు, ప్రజలతో సీఎం చంద్రబాబు ముచ్చటించారు.

**ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయ నిర్ణేతలు**

“మీ అందరి దయ, ఆశీస్సులతో 4వ సారి సీఎంగా ప్రమాణస్వీకారం చేశాను. టీడీపీని ఆదరించిన గ్రామంలో పెన్షన్ కార్యక్రమాన్ని ప్రారంభించాం. మంగళగిరిలో గత ఎన్నికల్లో లోకేష్ ఓటమి చెందారు...అయినా పట్టు వదలకుండా మళ్లీ ఇదే నియోజకవర్గంలో పట్టు సాధించి మీ అభిమానంతో ఎమ్మెల్యేగా గెలిచారు. గాజువాక, భీమిలి తర్వాత భారీ మెజారిటీ వచ్చిన నియోజకవర్గం మంగళగిరి. మిమ్మల్ని గౌరవించే బాధ్యత మాపై ఉంది. నేను 10 ఎన్నికలు చూశాను...ఎప్పుడూ చూడని విజయం మాకు దక్కింది. గత ఐదేళ్లలో ఇలా సంతోషంగా కూర్చొని మాట్లాడుకుంది ఒక్క రోజు కూడా లేదు. పోలీసులు ఎప్పుడు గోడ దూకి వస్తారో తెలీదు. భయంకర వాతావరణంలో ప్రజలు, నాయకులు బతికారు. ప్రజాస్వామ్యంలో న్యాయ నిర్ణేతలు ప్రజలే. ఐదేళ్లు అణచివేతకు గురయ్యారు...అలాంటి వేల మంది నన్ను కలవడానికి వస్తున్నారు. నాకు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారు. ప్రజలకు మాపై చాలా ఆశలు ఉన్నాయి. కానీ అన్నీ రాత్రికి రాత్రే జరిగిపోవు. రాష్ట్రానికి ఎంత అప్పు ఉందో అర్థం కావడం లేదు. పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టాలంటే భయపడుతున్నారు. ఐదేళ్ల వికృత చేష్టలతో రాష్ట్ర బ్రాండ్ దెబ్బతీశారు. గత సీఎం ఎక్కడికి వెళ్లినా పరదాలు కట్టుకుని వెళ్లారు. మురికి కాల్వ కూడా కనబడకుండా తెరలు కట్టారు...సమస్యలు దాస్తేదాగవు.' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**ప్రజలకు మేం సేవకులుగానే ఉంటాం**

“ఎన్నికల సమయంలో వాలంటీర్లతో పెన్షన్ పంపిణీ చేయొద్దని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. సచివాలయ సిబ్బందితో పెన్షన్లు పంచాలని చెపితే నాటి ప్రభుత్వం కుదరదని చెప్పింది. పంపిణీ చేయించడం చేతకాకపోతే ఇంటికి వెళ్లాలని చెప్పాను. వృద్ధులను సచివాలయాల చుట్టూ తిప్పి 33 మంది ప్రాణాలు తీశారు. ఇంటింటికీ పెన్షన్ ఇవ్వాలని మేము పోరాడినా వినలేదు. అందుకే ఇప్పుడు 1.20 లక్షల మంది సచివాలయ సిబ్బందితో పెన్షన్లు అందిస్తున్నాం. గత పాలకులు నోరిప్పితే అబద్ధాలు చెప్తున్నారు. ఐదేళ్ల పాటు అబద్ధాలు చెప్పి బతికారు. నేను, పవన్ ఎన్నికల ముందు జట్టు కట్టడానికి కారణం ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని. తర్వాత బీజేపీతో కలిసి రాష్ట్ర ప్రయోజనాలు ఆశించాం. ప్రజలు గెలవాలి రాష్ట్రం నిలవాలన్న ఆలోచనతో ముందుకు వెళ్లాం. నా చరిత్రలో ఎన్నో ఎన్నికలు చూశాను కానీ...ఇంతటి ఫలితాలు ఎప్పుడూ రాలేదు. మేము సేవకులుగా ఉంటాం తప్ప పెత్తందారులుగా ఉండేవాళ్లం కాదు. మీరు మాకు ఇచ్చింది అధికారం కాదు....బాధ్యత.' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**పెన్షన్ల ఆద్యులు ఎన్టీఆర్**

“దేశంలోనే మొదటి సారి పెన్షన్ ను ప్రారంభించింది ఎన్టీఆర్. రూ.35లతో ప్రారంభించారు...తర్వాత దాన్ని నేను రూ.75లు చేశాను. 2014 వరకు రూ.200 మాత్రమే ఉండేది...అధికారంలోకి రాగానే రూ.1000కి పెంచి, తర్వాత రూ.2000 చేశాను. ఇప్పుడు రూ.3 వేలు ఉన్నదాన్ని రూ.4 వేలకు పెంచాను. రూ.4 వేల పెన్షన్ లో రూ.2,875లను ఒక్క తెలుగుదేశం పార్టీనే పెంచింది. పేదలకు ఇచ్చే పెన్షన్ లో టీడీపీ హాయంలో పెంచిందే ఎక్కువ అని చెప్పడానికి గర్వపడుతున్నా. పెనుమాకలో 2,595 మంది వివిధ రకాల పెన్షన్ తీసుకుంటున్నారు. వీరికి ఒక నెల పెన్షన్ కు గతంలో రూ.1.06 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ నెల పెన్షన్ కు రూ.1.20 కోట్లకు పైగా ఖర్చు అవుతుంది. గుంటూరు జిల్లా మొత్తం 2,61,588 మందికి పెన్షన్లు ఇస్తున్నాం. వీరికి నెలకు ఇంతక ముందు వరకూ రూ.81 కోట్లు ఖర్చు అవుతుంది..కానీ ఈ నెలలో రూ.111 కోట్లకు పైగా ఖర్చు అవుతుంది. రాష్ట్రంలో 28 వర్గాల వారికి 65.31 లక్షల మందికి పెన్షన్లను అందిస్తున్నాం. పెన్షన్లకు ఇది వరకు నెలకు రూ.1,938 కోట్లు ఖర్చు చేస్తే...ఇప్పుడు దానికి అదనంగా రూ.819 కోట్లు ఖర్చు పెడుతున్నాం. ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయిల కలిపి రూ.1650 కోట్లు అదనంగా చెల్లించాం. ఈ ఒక్క నెలలోనే పేదలకు పెన్షన్ల కింద ఇస్తున్నది రూ.4,408 కోట్లు. ఇంతకంటే శుభదినం మరొకటి లేదు.” అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**పేదలను ఆదుకోవడమే మా ప్రభుత్వ ధ్యేయం**

“బానావత్ రాములు నాయక్ ఇంటికి వెళ్లి వృద్ధాప్య పెన్షన్ కింద రూ.4 వేలు అందించా. ఆయన భార్య సీతాబాయికి సీఆర్డీయే పరిధిలో భూమిలేని వారికి అందించే జాబితా కింద రూ.5 వేలు పెన్షన్ అందించాం. ఆయన కూతురు ఐలావత్ సాయిబాయికి వితంతు పెన్షన్ కింద రూ.4 వేలు అందించాం. వీరికి మూడు నెలల బకాయిలతో కలిపి అందించాం. బీదవారైన రాములు నాయక్ కుటుంబం పూరింట్లో ఉంటోంది. కౌలుకు భూమి సాగు చేస్తే రూ.8 లక్షల నష్టపోయారు. వారి పరిస్థితి చూడగానే చాలా బాధేసింది. ప్రభుత్వం తరపున ఇల్లు కట్టిస్తానని మాటిచ్చాను. ఇలాంటి వారు రాష్ట్రంలో చాలా మంది ఉన్నారు. పేదలను ఆదుకోవడమే మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇకపై ఏడాదికి రూ.33,100 కోట్లు పెన్షన్ లబ్ధిదారులకు ఖర్చు చేయబోతున్నాం. రాబోయే ఐదేళ్లలో రూ.1,65,500 కోట్లు పెన్షన్ల కింద పేదలకు ఖర్చు పెట్టబోతున్నాం. పేదలను ఆదుకునేందుకు ఒక మంచి కార్యక్రమాన్ని నిర్వహించడం భగవంతుడు నాకు ఇచ్చిన గొప్ప అవకాశంగా భావిస్తున్నా.” అని సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు.

**ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకుగా ఉంటా**

“పరిపాలనలో మేము కష్టపడైనా సరే సంపద సృష్టించి ఆదాయం పెంచుతాం. పెరిగిన ఆదాయాన్ని పేదలకు ఖర్చు చేస్తాం. దీని ద్వారా పేదరికం లేని సమాజాన్ని తీసుకొస్తాం. ఒక హామీ ఇస్తే అమలు చేయాలంటే సుమారు ఐదారు నెలలు పడుతుంది. కానీ ప్రభుత్వం ఏర్పడిన 26 రోజుల్లోనే ఇచ్చిన హామీలు అమలు చేసి బకాయిలతో సహా అందించాం. దివ్యాంగులకు గత ప్రభుత్వం పెన్షన్ పెంచకుండా రూ.3 వేల వద్దే నిలిపేసింది. అందుకే వారికి ఇప్పుడు రూ.6 వేలకు పెంచాం. పూర్తిగా నడవలేని స్థితిలో ఉండే వారికి రూ.5 వేల నుండి రూ.15 వేలకు పెంచాం. కిడ్నీ, గుండె సమస్య, తలసేమియాతో బాధపడేవారికి రూ.10 వేలు అందిస్తున్నాం. సంక్షేమ పథకాలు అందించామని గొప్పలు చెప్పుకోవడం కాదు..ప్రజల జీవితాల్లో వెలుగులు తీసుకురావాలి. జీవన ప్రమాణాలు పెంచడానికి మొదటి అడుగు వేశాం. సమాజమే దేవాలయం...ప్రజలే దేవుళ్లు అని చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన స్ఫూర్తితో పేదల జీవితాలు మార్చడంపై శ్రద్ధ పెట్టాం. ఆర్థిక అసమానతలు తగ్గించే వ్యవస్థకు రూపకల్పన చేస్తాం. ప్రభుత్వం ఆర్థికంగా దివాలా తీసింది...ఎంత అప్పులున్నాయో తెలియడం లేదు. అయినా పేదలను ఆదుకునేందుకు ముందడుగు వేశాం. రూ.4 వేల పెన్షన్ వచ్చే వారికి యేడాదికి రూ.48 వేలు వస్తుంది. రూ.6 వేలు వచ్చే వారికి రూ.72 వేలు వస్తుంది. మీకు ఎకరా మాగాని ఉంటే కౌలు రూ.15 వేలు, మెట్ట భూమికి ఎకరాకు రూ.5 వేలు కౌలు ఉంటుంది. కానీ మూడు ఎకరాల మాగానికి వచ్చే కౌలుకు సమానంగా మన ప్రభుత్వం పెన్షన్ సొమ్మును ఇస్తోంది. 10 ఎకరాల మెట్ట భూమికి వచ్చే కౌలుకు సమానంగా మన ప్రభుత్వం పెన్షన్ సొమ్మును అందిస్తోంది. అందుకే వారికి రూ.5 వేల నుండి రూ.15 వేలకు పెంచడం మా ప్రభుత్వానికి ఉన్న మానవత్వానిరి నిదర్శనం. ప్రతి కుటుంబానికి పెద్దకొడుకుగా ఉంటా...సంక్షేమంలో ఇది మొదటి అడుగు మాత్రమే.” అని సీఎం చంద్రబాబు అన్నారు.

**సంక్షేమాన్నిచ్చే ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి**

“ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఒకే రోజు 5 హామీలపై సంతకాలు చేశాను. డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి సంతకం పెట్టాను. రెండో సంతకం ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దుపై పెట్టాను. ఈ యాక్ట్ అమల్లోకి వస్తే మీ భూమి మీకు కాకుండా పోయేది. అందుకే రద్దు చేశాం. మూడవ సంతకం పెన్షన్ల అమలుపై చేశాను. నాలుగో సంతకం అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై పెట్టాను రూ.5లకే కడుపునిండా అన్నం తినే రోజులు మళ్లీ రాబోతున్నాయి. త్వరలో 183 అన్న క్యాంటీన్లను పెట్టబోతున్నాం..మిగతా చోట్ల కూడా వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తాం. ఐదో సంతకం స్కిల్ సెన్సస్...ఉద్యోగాలు ఉన్నా నైపుణ్యం లేక యువతకు ఉద్యోగాలు రావడం లేదు.

నైపుణ్య కేంద్రాలు పెట్టి ఎవరికి ఏ స్కిల్స్ అవసరమో నేర్పిస్తాం. మా ప్రభుత్వానికి మరింత శక్తినిస్తే మరింత సంక్షేమం అందిస్తుంది. మంచి ప్రభుత్వం ఉంటే అందరికీ అండగా ఉండి వెసులుబాటును కల్పిస్తుంది.

# మీటింగ్ పెట్టండి, నేనే మీ దగ్గరికే వచ్చి కలుస్తా

● రేవంత్ రెడ్డికి చంద్రబాబు లేఖ ● ఇరు రాష్ట్రాల మధ్య దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం బాబు చొరవ



అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయాక ఏర్పడ్డ విభజన సమస్యలను పరిష్కరించుకోవడం కోసం లేఖ రాసినట్లు చంద్రబాబు తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రయోజనం కోసం విభజన సమస్యల పరిష్కారం దిశగా సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. తద్వారా విభజన సమస్యలపై చర్చించుకుందామని.. పొరుగు రాష్ట్రాలుగా పరస్పర సహకారాలు అందించుకుందామని చంద్రబాబు తెలిపారు. తనదైన ముద్ర వేస్తూ పరిపాలన సాగిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు. మీ చిత్తశుద్ధి, నాయకత్వ పటిమ తెలంగాణ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయి. తెలుగు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా ఉన్న మనం రెండు రాష్ట్రాల సమగ్ర, సుస్థిర అభివృద్ధి కోసం పరస్పరం సహకారం అందించుకోవాలి. ఇప్పటికే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయి 10 ఏళ్లు గడిచాయి. పునర్విభజన చట్టం ప్రకారం ఇంకా ఎన్నో సమస్యలు పరిష్కారం కావాల్సి ఉండగా అవన్నీ ఇంకా పెండింగ్‌లోనే ఉండిపోయాయి. వాటి కారణంగా మన రెండు రాష్ట్రాల్లో సంక్షేమం, ఇతర అంశాలకు అడ్డంకిగా మారుతోంది. వీటన్నింటిని మనం కూర్చొని పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. అందుకోసం జూలై 6న శనివారం మధ్యాహ్నం మీ ప్రాంతంలో సమావేశం ఏర్పాటు చేసుకొందామని నేను ప్రతిపాదిస్తున్నాను. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న కీలకమైన సమస్యలు ఇలా ముఖాముఖి సమావేశంలో కూర్చొని చర్చించుకుంటేనే పరిష్కారం అవుతాయి. ఇరు రాష్ట్రాలకు లబ్ధికలిగే విధంగా పరస్పరం సహకరించుకోవాలి. మన భేటీ సత్ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నాను అని చంద్రబాబు లేఖలో రాశారు.

# అయిదేళ్లలో పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ బస్సులు

● త్వరలోనే 1400 కొత్త బస్సులు రాబోతున్నాయ్ ● కార్పొరేషన్ ఆస్తులను సద్వినియోగం చేసి ఆర్టీసీని లాభదాయకంగా మారుస్తాం ● విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడిన మంత్రి రాంపస్రాద్ రెడ్డి



అమరావతి: కేంద్రం సహాయంతో అయిదేళ్లలో ఆర్టీసీ లో పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశ పెడతామని..త్వరలోనే 1400కొత్త బస్సులు రాబోతున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాం ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ ని కాపాడుకునే బాధ్యత ప్రభుత్వానిదని ఆయన పేర్కొన్నారు. విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రి ఆదివారం విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. కార్పొరేషన్ ఆస్తులను సద్వినియోగం చేసి ఆర్టీసీని లాభదాయకంగా మారుస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో మాదిరిగా లాభ దాయకంగా లేదని ఆర్టీసీని పక్కన బెట్టే చేతకాని ప్రభుత్వం తమది కాదన్నారు. లాభదాయకంగా లేదని బస్సులు రద్దు చేసే పరిస్థితులు ఉండవోద్దన్నారు. కార్మికులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మహిళలకు ఫ్రీ బస్సు సర్వీసులు ప్రవేశ పెట్టేనాటికి పూర్తి స్థాయిలో బస్సులు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.

రాష్ట్రంలోని మహిళలకు త్వరలోనే తీపికబురు చెబుతామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి రాంపస్రాదరెడ్డి చెప్పారు. విశాఖపట్టణం నుంచే ఈ ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేస్తున్నామన్నారు. గత వైకాపా ప్రభుత్వం ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేయలేదని, తాము ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అవసరం మేరకు బస్సుల సంఖ్య పెంచుతామని, ఎలక్ట్రికల్ సర్వీసులు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారు. జగన్ హయాంలో రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలను తరిమేశారని, కొత్త వాటిని ప్రోత్సహించలేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఒప్పందాలు చేసుకున్న పరిశ్రమలను ఇప్పుడు స్థాపించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు

# ఏపీ పునర్నిర్మాణానికి కేంద్రం చేయూత ఇవ్వాలి

## టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు కృష్ణదేవరాయలు




ఢిల్లీ: ఏపీ పునర్నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చేయూత ఇవ్వాలని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు కృష్ణదేవరాయలు తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానం సందర్భంగా లోక్ సభలో మాట్లాడారు. ఏపీ ప్రజలు 90శాతం సీట్లు,56 శాతం ఓట్లతో ఎన్డీఏ కూటమిని గెలిపించారని చెప్పారు. ఏపీ ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. పోలవరం,అమరావతి నిర్మాణం వేగంగా పూర్తి చేయడానికి నిధులు ఇవ్వాలని కోరారు. ఏపీకి రావాల్సిన రెవిన్యూ గ్రాంట్స్ విడుదల చేయాలని అన్నారు.

విభజన చట్టంలో ఇచ్చిన విద్యాసంస్థల నిర్మాణం వేగంగా చేయాలన్నారు.

వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పూర్తి చేస్తే రాష్టానికి పెట్టుబడులు వస్తాయని లావు కృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

## 4న హస్తినకు సిఎం చంద్రబాబు



అమరావతి,,,, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారి ఢిల్లీకి వెళ్లడానికి టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సిద్ధమవుతున్నారు. జూలై 4న ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్లడానికి అన్ని ఏర్పాటు చేసుకుంటు న్నారు. ఈ పర్యటనలో ఆయన పలువురు నేతలతో భేటీ కానున్నారు. ఇప్పటికే వారి అపాయింట్‌మెంట్లు కూడా తీసుకున్నారని సమాచారం. వారిలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో కీలకంగా భేటీ కానున్నారని టీడీపీ వర్గాలు చెప్పాయి. ఈ భేటీలో పలు ముఖ్య అంశాలను చంద్రబాబు లేవనెత్తనున్నట్లు తెలుస్తోంది. కేంద్రం ఆర్థిక మంత్రితో చేయనున్న చర్చలో త్వరలో ప్రవేశ పెట్టే కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చేసే కేటాయింపులు, నిధులు, పథకాలపై చంద్రబాబు ముఖ్యంగా చర్చించనున్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం తీసుకున్న అప్పులపై చర్చించి వాటి నుంచి తేరుకోవడానికి అమరావతి, పోలవరం నిర్మాణానికి పూర్తి స్థాయి సహకారం అందించాలని కోరాలని కూడా చంద్రబాబు యోచిస్తున్నట్లు సమాచారం. ఈ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ సీఎంగా తొలిసారి ప్రధాని మోదీని కూడా చంద్రబాబు కలవనున్నారు.

**బడ్జెట్ కసరత్తుల్లో కేంద్రం**

ఇప్పటికే బడ్జెట్ ప్రవేశ్ పెట్టడానికి సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో బడ్జెట్‌ను సిద్ధం చేయడంలో కేంద్రం ఆర్థిక వర్గాలు తలమున్కలవుతోంది. ఇందుకోసం శాఖల వారీగా సమీక్షలు, వివిధ రంగాల నివుణుల ద్వారా బడ్జెట్ కేటాయింపు అంశాలపై చర్యలు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్రాలకు చేయాల్సిన కేటాయింపులు, ఇవ్వాల్సిన నిధులు, ప్రాజెక్టులకు ఇవ్వాల్సిన నిధులు వంటి ఇతర అంశాలపై కూడా కేంద్ర ఆర్థిక శాఖ కసరత్తులు చేస్తోంది. ఇప్పటికే ఈ చర్చలు ఒక కొలిక్కి వస్తున్నట్లు తెలుస్తోంది.

# రికార్డుస్థాయి పెన్షన్ల పంపిణీ

## సమాచార శాఖ మంత్రి పార్థసారథి




అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో 12గంటల వ్యవధిలో రూ.4,170కోట్లు పెన్షన్ల రూపంలో పంపిణీ చేసి ఎన్డీయే ప్రభుత్వం రికార్డు నెలకొల్పిందని సమాచార శాఖ మంత్రి పార్థసారథి అన్నారు. సోమవారం ఉదయం 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ 95శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్లు వెల్లడించారు. గతంలో ఎన్నడూ ఇలా ఎవరూ చేయలేదని, ఇది చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయం అని మంత్రి చెప్పుకొచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో 2.65లక్షల మంది వాలంటీర్లు ఉన్నా ఈ స్థాయిలో ఎప్పుడూ ఇవ్వలేదని గుర్తు చేశారు. 1.30లక్షల మంది సచివాలయ సిబ్బందితో ఈ రికార్డు సాధించడం ఆనందంగా ఉందని మంత్రి పార్థసారథి సంతోషం వ్యక్తం చేశారు. గత రెండు నెలలపాటు వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పెన్షన్ పంపిణీ ఆపేసిందని, వాలంటీర్లు లేకుండా పంపిణీ సాధ్యం కాదంటూ అడ్డగోలు నిబంధనలు పెట్టారని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. గత ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే కొంతమంది వృద్ధులు చనిపోయారని దుయ్యబట్టారు. చంద్రబాబు చిత్తశుద్ధి, ఉద్యోగుల కష్టానికి నేడు సాధించిన రికార్డే నిదర్శనమని మంత్రి చెప్పుకొచ్చారు. సమర్థవంతమైన నాయకత్వం వల్లే ఈ ఘనత సాధించామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడకి వెళ్లినా పింఛనుదారులు ఆనందంతో పండగ చేసుకున్నారని మంత్రి చెప్పారు.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎన్నికల హామీలో భాగంగా రూ.4వేలు పెన్షన్, బకాయి రూ.3వేలు కలిపి మొత్తం ఏడు వేలు ఇచ్చారని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. 28కేటగిరీల్లో వేల కోట్ల రూపాయలు ఒక్కరోజులో పంపిణీ చేశామని, గత ప్రభుత్వం ఐదేళ్లకు రూ.వెయ్యి పెంచితే.. చంద్రబాబు 17రోజుల్ పాలనలో రూ.4వేలకు పెంచారన్నారు. గతంలోనూ రూ.200నుంచి రూ.2000లకు పెన్షన్ పెంచిన ఘనత చంద్రబాబుదే అని చెప్పుకొచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్నివిధాలా దివాళా తీయించిందని, వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని పార్థసారథి ధ్వజమెత్తారు.

## ఏపీ టెట్ 2024 నోటిఫికేషన్ వచ్చేసింది




అమరావతి : ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నోటిఫికేషన్ సోమవారం (జులై 1) రాత్రి విడుదలైంది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రకటించారు. కూటమి సర్కార్ ముందుగా చెప్పినట్లు గానే మెగా డీఎస్సీకి ముందే టెట్ నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ విధానంలో జరగనున్న ఈ పరీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలను జులై 2వ తేదీన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని, అభ్యర్థులు అందులో పూర్తి సమాచారం తెలుసుకోవచ్చని సూచించారు.జులై 2న అధికారిక వెబ్‌సైట్లో పూర్తి నోటిఫికేషన్ అందుబాటులో ఉంచనున్నారు. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత జులై 3 నుంచి జులై 16 వరకు ఆన్‌లైన్‌లో అప్లికేషన్ ఫీజు చెల్లించడానికి జులై 4 నుంచి 17 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. టెట్ పరీక్షలను ఆగస్టులో నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. టెట్ సిలబస్‌ను కూడా విద్యాశాఖ విడుదల చేసింది. మరోవైపు, ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌కు వచ్చే వారం ప్రత్యేక ప్రకటన విడుదల చేయనున్నారు. మొత్తం 16,347 పోస్టులతో కొత్తగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడనుంది. డీఎస్సీలో టెట్‌కు 20శాతం వెయిటేజీ ఉంటుందన్న విషయం తెలిసిందే.

## లడాక్ మృతులకు సీఎం చంద్రబాబు నివాళి



అమరావతి: లడాఖ్ టీ-72 యుద్ధ ట్యాంక్ కొట్టుకుపోయిన ఘటనలో పలువురు సైనికులు వీర మరణం పొందారు. వారిలో ఆంధ్రప్రదేశ్కు చెందిన ముత్తుముల రామకృష్ణారెడ్డి, సాదరబోయిన నాగరాజు, సుభాన్ ఖాన్ అనే ముగ్గురు సైనికులు ఉన్నారు. సైనికుల మృతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. సైనికుల మృతి తనను కలచివేసిందని వివరించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విధి నిర్వహణలో సైనికులు ప్రాణాలు కోల్పోయారని.. దేశం కోసం రక్తం చిందించారని వివరించారు. సైనికుల మృతిపై ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆ కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

## ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్ ఇంటర్ ఫలితాలు విడుదల



అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో జూన్‌లో ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వహించిన పదో తరగతి, ఇంటర్ () పబ్లిక్ పరీక్షల ఫలితాలను మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఎస్ఎస్సీ పరీక్షలు 15,058 మంది రాయగా.. 9,531 మంది (63.30శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు మంత్రి తెలిపారు. అలాగే, ఇంటర్ పరీక్షలకు 27,279 విద్యార్థులు హాజరు కాగా.. 18,842 మంది (69.07 శాతం) ఉత్తీర్ణులైనట్లు మంత్రి వెల్లడించారు. ఫలితాలను ప్రభుత్వ పరకీక్ష వెబ్‌సైట్‌లో సూసి తెలుసుకోవచ్చని సూచించారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర చరిత్రలో నేడు రికార్డు స్థాయిలో పింఛన్ల పంపిణీ



**అధికారులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు**

అమరావతి :- ఏపీ ప్రభుత్వం పింఛన్ల పంపిణీలో రికార్డు సృష్టించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క రోజులోనే 95 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేసి సరికొత్త రికార్డును సెట్ చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి నెలలోనే ఒకేరోజులో 95 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేయడంపై అధికార యంత్రాంగాన్ని, ఇంటింటికీ పింఛను పంపిణీలో నేరుగా పాల్గొన్న గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఒక్క రోజులో ఈ స్థాయిలో పింఛన్ల పంపిణీ జరగలేదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. సమర్థ నాయకత్వం ఉంటే ఉద్యోగులు ఎంత అద్భుతంగా పనిచేయగలరు అనేది పింఛన్ల పంపిణీతో మరోసారి రుజువు అయ్యిందని సిఎం అన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ సిఎం అభినందనలు తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు తీర్చడంలో ప్రభుత్వ ఉద్యోగుల సహకారం ప్రభుత్వానికి ఎంతో అవసరం అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

### మాది సాధింపుల ప్రభుత్వం కాదు...

# ప్రజల ఆకాంక్షలు సాధించే ప్రభుత్వం

**● 100 శాతం గ్రామాలకు రక్షిత మంచి నీరు అందించిన రాష్ట్రం చేయడమే మా ముందున్న లక్ష్యం ● గత పాలకులు మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకుండా కేంద్ర నిధులు వదిలేశారు ● రుషికొండ రాజప్రాసాదం డబ్బులతో ఓ జిల్లాను అభివృద్ధి చేయొచ్చు ● కాకినాడ మాఫియా స్వరూపం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీలతో బయటపడుతోంది ● పంచాయతీరాజ్ శాఖలో అప్పులు చూసి... జీతం వద్దని చెప్పేశాను ● ప్రభుత్వ సిబ్బందితో సక్రమంగా పింఛన్ల పంపిణీ చేసి చూపించాం ● నాశనం అయిన వ్యవస్థలను బలోపేతం చేయడంపైనే దృష్టి ● పిఠాపురంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



సూర్య ప్రధాన ప్రతినిధి, అమరావతి : 'రాష్ట్రాభివృద్ధి... ప్రజా సంక్షేమం కోసం నేను బలమైన సంకల్పంతో ఎన్నికలకు వచ్చాను. ప్రజలంతా జనసేనను వంద శాతం విశ్వసించారు. వందకు వంద స్ట్రయిక్ రేటు ఇవ్వాలని కోరితే, ప్రజలంతా నిండు మనసుతో ఆశీర్వదించారు. ఇప్పుడు పాలనలోనూ అదే బలమైన సంకల్పాన్ని చేసుకుంటున్నాను. 100 శాతం గ్రామాలకు పూర్తిస్థాయి రక్షిత మంచినీటి పథకం అమలైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తయారు చేయాలి. ప్రతి గ్రామం గొంతు తడవాలి.. ప్రతి ఇంటికి లోటు లేకుండా నీరు అందాలి. కాలుష్యపు నీరు లేకుండా ప్రజలందరి ఆరోగ్యానికి భరోసా ఇవ్వాలి అన్నదే లక్ష్యమ'ని ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ గారు అన్నారు. మొన్నటి వరకు ఎన్నికల సమయంలో విమర్శలు, ప్రతివిమర్శలు అయిపోయాయి. ఇప్పుడు పూర్తిగా పాలనపారమైన సవాళ్లను అధిగమించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం వ్యవస్థలను పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేసిందనీ, వాటిని గాడిలోపెట్టేందుకు పూర్తి స్థాయిలో పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. సోమవారం పిఠాపురం నియోజకవర్గం, గొల్లప్రోలులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో శ్రీ పవన్ కళ్యాణ్ గారు పాల్గొన్నారు. రూ.3 వేల పింఛనును రూ.4 వేలు చేశారు. ఏప్రిల్ నుంచి అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ మేరకు గత మూడు నెలలకు సంబధించిన రూ.3 వేలు కలిపి మొత్తంగా రూ.7 వేలు పింఛను ఇచ్చారు. పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలుకి చెందిన దివ్యాంగురాలు శ్రీమతి మేడిశెట్టి నాగమణి కి మొదటి పింఛను అందించారు. అనంతరం పింఛనుదారులతో స్వయంగా మాట్లాడి వారి సాదకబాధకాలు తెలుసుకున్నారు. అనంతరం శ్రీపవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "నన్ను నిండు మనసుతో ఆశీర్వదించి గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు వేవేల ధన్యవాదాలు. గెలవగానే పెద్ద ఊరేగింపు నిర్వహించాలని చాలామంది చెప్పారు. అయితే నియోజకవర్గానికి ఏదైనా మేలు కలిగించే విషయంతోనే వారి ముందుకు వచ్చి కృతజ్ఞత చెప్పుకోవాలనే తలంపుతో ఈ రోజు పింఛన్ల పంపిణీ కోసం నియోజకవర్గానికి వచ్చాను. నాకు సభలు, ఊరేగింపులు ముఖ్యం కాదు. నియోజకవర్గ ప్రజలంతా ఆనందంగా ఉండే పనులు చేసి, వారి మన్ననలు పొందడమే ముఖ్యం. ప్రతి నిమిషం రాష్ట్ర శ్రేయస్సు కోసం, క్షేమం కోసం పని చేస్తాను. రక్షిత మంచినీరు, ఉపాధి అవకాశాలు, సాగునీటి కాలువల పూడిక తీతలు వంటివి చేసి ప్రజలకు దగ్గర కావాలనేది నా ఆకాంక్ష.

**పంచాయతీరాజ్ వ్యవస్థను నాశనం చేశారు**

కీలకమైన పంచాయతీరాజ్ శాఖను తీసుకొని ఆ శాఖలో జరిగిన ముఖ్య విషయాలను అధికారులను అడిగి తెలుసుకుంటుంటే గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలు బయటపడుతున్నాయి. పంచాయతీరాజ్ నిధులు ఏమయ్యాయో, ఎలా దారి మళ్లించారో కూడా అంతుపట్టడం లేదు. లోతుల్లోకి వెళ్లి సమీక్షిస్తుంటే అధికారులు చెబుతున్న విషయాలు విస్తుగొలిపేలా ఉంటున్నాయి. చిన్నచిన్న మరమ్మతులకు, నిర్మాణాలకు వారు పెట్టిన ఖర్చులు దారుణంగా ఉన్నాయి. పంచాయతీరాజ్ లో చక్కగా పని చేసే అధికారులున్నాయి. వారిని సరైన రీతిలో ఉపయోగించుకోవడంలోనే తప్పులు జరిగాయి. వీటిని సరిదిద్దాలి. పంచాయతీరాజ్ లో పునరుత్తేజం నింపాలి. సమగ్రంగా వ్యవస్థకు జీవం పోయాలి.

**నా ఆఫీసుకి కొత్త ఫర్నిచర్ వద్దు... అవసరమైతే నేనే కొనుగోలు చేసుకొంటా**

సమీక్షల్లో భాగంగా ఒక్కో శాఖ ఆర్థిక స్థితిని పరిశీలిస్తుంటే అప్పులు పేరుకుపోయి ఉన్నాయి. పంచాయతీరాజ్ లో జరిగిన నిధుల దుర్వినియోగం, మళ్లింపు.. ఆ ఫలితంగా నిధుల లేమిని వాస్తవంగా చూసిన తర్వాత నాకు జీతం వద్దని అధికారులతో చెప్పాను. తొలుత జీతం తీసుకొని పని చేస్తాను అని చెప్పాను. అయితే అప్పులతో మునిగిపోయిన శాఖ బాధ్యతలు చూస్తూ నేను జీతం తీసుకోవడం భావ్యం కాదు అనుకున్నాను. నా క్యాంపు కార్యాలయానికి సైతం అధికారులు చిన్నచిన్న మరమ్మతులు అవసరం అవుతాయనిచెప్పినా, వద్దు అన్నాను. అప్పులు చేసి మరమ్మతులు చేయాల్సిన అవసరం లేదని చెప్పాను. కార్యాలయానికి కొత్త ఫర్నీచర్ కూడా పెట్టొద్దని చెప్పాను. నాకు ఏదైనా అవసరం అయితే నేనే ఫర్నిచర్ కొనుగోలు చేసి తెచ్చుకుంటాను. ప్రభుత్వం నుంచి మాత్రం ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదని చెప్పాను. హంగులు, ఆర్భాటాలు కాకుండా నాశనం అయిన వ్యవస్థలను తిరిగి సరిదిద్దాలనే సంకల్పంతోనే పని మొదలుపెట్టాను. దాని కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తాను. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గురించి లోతుగా తెలుసుకుంటున్నాను. తర్వాత దాన్ని ఎలా సరిదిద్దాలనే విషయాలపై ఓ ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తాను. దేశంలోనే అత్యుత్తమంగా రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ ఉండాలనేది నా ప్రయత్నం.

**పొల్యూషన్ ఆడిట్ లెక్కలు తీస్తున్నాము**

రాజకీయాల్లోకి డబ్బు కోసమో, పదవి కోసమో నేను రాలేదు. ప్రజల కోసం పని చేయాలనే దృఢమైన సంకల్పంతో వచ్చాను. ప్రజలు ఆశీర్వదించి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారు. నాకు రాజకీయాల్లో డబ్బు అవసరం లేదు. నా సొంత డబ్బులను ఖర్చుపెట్టుకొనే రాజకీయాలు చేశాను.. ప్రజలకు సాయం అందించాను. ఇప్పుడు కీలకమైన శాఖలు చూస్తూ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వేళ ఒకటే చెబుతున్నాను. నా వైపు నుంచి అవినీతికి తావుండదు. దీనికి తగినట్లుగా అధికారులు పని చేయాలి. కీలకమైన పర్యావరణ శాఖను తీసుకున్నాం. దీనికి తగినట్లుగానే రాష్ట్రంలోని ఏ పరిశ్రమల నుంచి ఎంత మేర కాలుష్యం విడుదల అవుతుందనే ఆడిట్ లెక్కలు తీయిస్తున్నాం. పరిశ్రమల నిర్వాహకులే కాలుష్య నియంత్రణ చర్యలు అవలంబించేలా చేయాలి. కాలుష్యం తగ్గించేందుకు ఉన్న అవకాశాలు, కాలుష్యరహిత పరిశ్రమలను ప్రోత్సహించేలా పని చేస్తాం.

**రుషికొండ తవ్వేసి రాజమహల్ కట్టారు**

అప్పుల్లో ఉన్న రాష్ట్రంలో రూ.600 కోట్లు ఖర్చుపెట్టి రుషికొండను తవ్వేసి మరీ రాజమహల్ కట్టారు. ఇప్పుడు అది ఎందుకు పనికిరాకుండా అయింది. ఖర్చుపెట్టిన డబ్బంతా బూడిదలో పోసిన పన్నీరే అయింది. గత ప్రభుత్వంలోని పెద్దలు చెబుతున్నట్లు విదేశీ అతిథుల కోసం కట్టామని చెబుతున్నారు. వారి కోసం ఇంత ఖర్చు చేయాల్సిన అవసరం ఏమిటి..? వైసీపీ ప్రభుత్వంలో విశాఖలో కట్టిన రాజప్రసాదం డబ్బుతో ఓ జిల్లా సమగ్ర అభివృద్ధి సాధ్యమయ్యేది. ఓ జిల్లాకు పెట్టాల్సిన డబ్బు ఓ కోటకు పెట్టారు. ఇలాంటివి రాష్ట్రంలో ఎన్నో జరిగాయి. వాటిని తవ్వి బయటకు తీస్తుంటే విస్తుపోవడం మొదట మా వంతు అవుతుంటే... తర్వాత ప్రజల వంతు అన్నట్లు ఉంది. గత ప్రభుత్వంలో జరిగిన విచ్చలవిడి అక్రమాలకు తెరపడాలి. ప్రజలకు అవసరం అయ్యే మార్పులు అన్ని వ్యవస్థల్లో రావాలి. కేంద్ర జల్ జీవన్ మిషన్ పథకం నిధులు కావల్సినన్ని ఉన్నాయి. ప్రతి ఇంటికీ తాగునీరు ఇవ్వాలనే ఆశయంతో జల్ జీవన్ మిషన్ పథకం ఉంటే, దాన్ని గత రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోలేకపోయింది. గోదావరి పక్కనే ఉన్నా తాగునీరు సరిగా లేని చాలా గ్రామాలున్నాయి. కొల్లేరు సరస్సు చెంతనే ఉన్నా మంచి నీరు దొరకని కైకలూరు వంటి ప్రాంతాలున్నాయి. కేంద్ర పథకాన్ని ఉపయోగించుకొని దాహార్తి తీర్చాల్సిన ప్రభుత్వం ఆ నిధులను తెచ్చుకోవడంలో వెనుకబడింది. కేంద్ర పథకాలకు రాష్ట్రం కూడా తగినంత మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వాలనే నిబంధన ఉంటుంది. ఒక్కో పథకానికి ఒక్కోలా ఆ గ్రాంటు ఉంటుంది. దాన్ని గత ప్రభుత్వం ఇవ్వక వేల కోట్ల రూపాయల నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. రూ.200 కోట్లు, రూ.400 కోట్లు ఇస్తే, వేయి కోట్లు వచ్చే అవకాశం ఉన్నా దాన్ని గత ప్రభుత్వం పట్టించుకోక కేంద్ర నిధులన్నీ ప్రజలకు అందకుండాపోయాయి. వివిధ కేంద్ర పథకాలకు రావల్సిన నిధులను గత ప్రభుత్వం చాలా వరకు తీసుకోలేకపోయింది.

**జవాబుదారీ పాలన అందిస్తాం**

పాలన చేతికొచ్చింది అద్భుతాలు జరిగిపోతాయి అని చెప్పలేను కానీ.. ప్రభుత్వంలో ఏ జరుగుతుందో సామాన్యుడికి అర్థం అయ్యేలా పాలన ఉంటుంది. పూర్తిగా గాడి తప్పిన వ్యవస్థలకు జీవం పోయాలి. పాలనలో జరుగుతున్న వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తాం. వారికి జవాబుదారీ పాలన అందిస్తాం. మంచినీరు, పారిశుద్ధ్యం లేని గ్రామాలను తీర్చిదిద్దడానికి మొదటి ప్రాధాన్యం ఇస్తాను. దీనికోసం పిఠాపురంలోనే మొదటి మోడల్ గ్రామాన్ని తీర్చిదిద్దుతాం. భారతదేశంలోనే మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని నిలపాలనేదే నా కోరిక. దీనికి పూర్తిస్థాయిలో పనిచేస్తాను. పరిశ్రమలు, ఉపాధి కల్పన కోసం ఎన్.ఆర్.ఐలతోనూ మాట్లాడుతున్నాను. నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి ఫోకస్ తో పని చేస్తాను.

**తప్పు చేసిన వారికి శిక్ష పడాలి**

నేను, శ్రీ చంద్రబాబు గారు మాట్లాడుకుంటున్నపుడు రాష్ట్రంలో మొదట వ్యవస్థలను బలోపేతం చేయాలని సమష్టిగా అనుకున్నాం. ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్ గారు కాకినాడలో వరుస తనిఖీలు చేస్తున్నపుడు బయటపడుతున్న అక్రమ రేషన్ బియ్యం వైసీపీ మాఫియా ఎంత బలంగా ఉందో చాటిచెబుతోంది. నేను ఎన్నికలప్పుడు కాకినాడ మాఫియా గురించి చెప్పాను. ఇప్పుడు తనిఖీల్లో భాగంగా వేల మెట్రిక్ టన్నుల అక్రమ రేషన్ బియ్యం బయటపడుతుంటే ప్రజలు కళ్లారా చూస్తున్నారు. రేషన్ బియ్యం కోసం ప్రభుత్వం రూ.39లు రాయితీ భరిస్తోంది. ఆ సొమ్ము ప్రజలది. దాన్ని మాఫియా కొల్లగొడుతోంది. ప్రజాధనం ఎంత కొల్లగొట్టిందో శ్రీ మనోహర్ గారి పరిశీలనలో బహిర్గతం అవడం విస్తుగొలిపింది. ఇక కడపలో బైరెటీస్ గనులన్నీ గుల్ల చేసేశారు. అసలు కనివినీ ఎరుగని స్థాయిలో విధ్వంసం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులకు బాధ్యులకు శిక్ష పడాలి. అధికారులు కూడా అర్థం చేసుకోవాలి. మాది సాధింపుల ప్రభుత్వం కాదు. ప్రజల ఆకాంక్షలు సాధించే ప్రభుత్వం మాది. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను ప్రజలకు తెలియజెప్పాలి. ఆ బాధ్యత కూటమి ప్రభుత్వం మీద ఉంది.

**ప్రతీ రూపాయికీ సమాధానం చెప్పాలి**

నేను సినిమాల్లో వచ్చిన రెమ్యునరేషన్ అకౌంట్లను ఎప్పుడూ క్షుణ్నంగా చూడలేదు. పన్ను ఎంత కట్టాలి..? ఎక్కడ సంతకం పెట్టాలి అని అడిగి ముగించేవాడిని. పాలనలోకి వచ్చాక ప్రజా ఖజానా నుంచి ఎంత మేర ప్రజాధనం వినియోగం అయింది.. పక్కదారి పట్టించారు... దుర్వినియోగం అనే అన్ని అంశాలను అధికారులు చెబుతుంటే గంటలకు గంటలు వాటిని పరిశీలిస్తున్నాను. వింటున్నాను. నాకున్న సందేహాలను మళ్లీ తీర్చాలని అధికారులను అడుగుతున్నాను. అధికారులు కూడా నన్ను వేరుగా అనుకోవద్దు. కచ్చితంగా ప్రజలకు చెందిన ప్రతి రూపాయికి సరైన సమాధానం చెప్పాలనే కాంక్షతోనే నేను ప్రతి విషయాన్ని తెలుసుకుంటున్నాను. రోడ్లు వేయాలని చూస్తే నిధులేవీ లేకుండా మొత్తం ఊడ్చేశారు. దీనిపై ప్రజలకు నిజానిజాలు తెలియజేసేందుకు ప్రయత్నిస్తున్నాం. కూటమికి ఓటు వేసిన ప్రతి ఒక్కరూ గర్వించేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్నదే మా లక్ష్యం. నేను రెండు తరాల భవిష్యత్తు కోసం పనిచేస్తాను. రాష్ట్ర అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు వెళతాను. రేపటి తరాలకు భరోసానిచ్చేలా బాటలు వేస్తాను" అన్నారు. ఈ సమావేశంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే శ్రీ పంతం నానాజీ, కాకినాడ జిల్లా కలెక్టరు శ్రీ షణ్మోహన్ సగిలి, జిల్లా ఎస్పీ శ్రీ సతీష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే శ్రీ ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ, పిఠాపురం నియోజక వర్గం జనసేన సమన్వయకర్త శ్రీమర్రెడ్డి శ్రీనివాసరావు, పిఠాపురం బీజేపీ ఇంఛార్జి శ్రీ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిలో ఉండే అర్హత జగన్‌కు లేదు

ప్రజా రాజధాని అమరావతి లోని తాడేపల్లి ప్యాలెస్ లో ఉండే అర్హత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి లేదని, వెంటనే ఖాళీ చేసి వెళ్ళిపోవాలని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్య వ్యాఖ్యానించారు. మూడు రోజుల క్రితం బెంగుళూరు బంగ్లా కు వెళ్ళిన వైఎస్ జగన్ తిరిగి తాడేపల్లి ప్యాలెస్ కు వస్తున్నారనే వార్తల నేపథ్యంలో బాలకోటయ్య ఈ ప్రకటన చేశారు. మూడు రాజధానుల మూర?పు కుంపటిని నెత్తి కెత్తుకుని తిరిగే జగన్ కు అమరావతిలో ఉండే నైతిక అర్హత ఎక్కడిది? అన్నారు.ఇప్పటికీ మూడు రాజధానులే మా విధానం అంటూ మాజీమంత్రి బొత్స సత్యనారాయణ చేసిన ప్రకటన నవ్వి పోదురు గాక నా కేటి సిగ్గు అన్నట్లుగా ఉందన్నారు. 151 స్థానాలతో పాలన చేసిన పార్టీకి రెండు పంగనామాలు పెట్టినట్లు 11 సీట్లు ఇచ్చి, ప్రతి పక్ష హోదా లాగేసినా వైకాపా నాయకుల్లో ఎలాంటి మార్పు లేదన్నారు. ఖరీదు కలిగిన బంగ్లాలు, ప్యాలెస్ లు నిర్మించుకొని ఐదేళ్ళ పాలనలో నయా నియంతలా సర్వ భోగాలు జగన్ అనుభవించారని, రాష్ట్రంలోని మూడు ప్రాంతాల ప్రజలతో, అభివృద్ధితో ఆటలాడారని చెప్పారు. తలపై ఉన్న మూడు రాజధానుల శని భారాన్ని దించుకోనంత వరకు వైకాపాకు కూటమి పాలనపై మాట్లాడే అర్హత లేదన్నారు. కేవలం పెంచిన వెయ్యి రూపాయలు ఇవ్వటం చేతకాక, పెంచుకుంటూ పోతాను అంటూ రూ. 250 చొప్పున ఐదేళ్ళు సాగదీశారని, దీనివల్ల దాదాపు రూ.32,000 ఒక్కో లబ్ది దారుడు నష్ట పోయిన్నట్లు చెప్పారు. చంద్రబాబు రూ.4,000 పింఛన్లు తోపాటు గడిచిన మూడు నెలలకు మరో మూడు వేలు కలిపి ఏడు వేలు చొప్పున మొత్తం 65 లక్షల 18 వేల 496 మంది లబ్ధిదారులకు రూ.4,408 కోట్లు ఇస్తున్నట్లు తెలిపారు.

# ప్రారంభమైన స్టాప్ డయేరియా క్యాంపెయిన్

**● విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి ● వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపైనా అవగాహన కల్పించాలి ● డయేరియాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి ● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన**



సూర్య, ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జులై 1 సోమవారం నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టి డయేరియాను సమర్థవంతంగా అడ్డుకోవడంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ సృజన.. అధికారులతో కలిసి స్టాప్ డయేరియా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అతిసార వ్యాధి అంటే ఏమి? దీన్ని ఎలా నివారించాలి? ఓఆర్ఎస్, జింక్ ఉపయోగాలు తదితరాలపై అవగాహన కల్పించాలన్నారు. అతిసార వ్యాధి నుంచి చిన్నారులకు రక్షించేందుకు క్షేత్రస్థాయిలో ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమం ద్వారా ముఖ్యంగా అయిదేళ్లలోపు చిన్నారులపై దృష్టిసారించాలని.. ముందుగానే ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించి.. అవసరమైనప్పుడు ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఏ విధంగా తయారు చేయాలో, ఉపయోగించాలో వివరించాలని సూచించారు. డయేరియా కారణంగా మరణాలు సంభవించకుండా విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని.. ముఖ్యంగా చేతులను సరైన విధంగా శుభ్రపరచుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు అందించే తాగునీరు కలుషితం కాకుండా అప్రమత్తతతో పకడ్బందీ కార్యాచరణను అమలుచేయాలన్నారు. శుభ్రమైన, సురక్షితమైన తాగునీటిని మాత్రమే ఉపయోగించేలా చూడాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఎక్కడా నీరు నిలిచే పరిస్థితి లేకుండా చూడటంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థలు సరైన విధంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమాల నిర్వహణలో వైద్య ఆరోగ్యం, ఐసీడీఎస్, గ్రామీణ నీటిసరఫరా తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని.. ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ డా. జి.సృజన సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, డీఎంహెచ్వో డా. ఎం.సుహాసిని, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డా. బీసీకే నాయక్, డీఐవో డా. అమృత, డీఎల్ఏటీవో డా. జె.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదాపై మీ వైఖరి ఏంటో చెప్పాలి



సూర్య, ప్రత్యేక ప్రతినిధి : ఏపీకి హోదాపై ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం నోరు విప్పడం లేదు, ఆయన వైఖరి స్పష్టం చేయాలని పీసీసీ రాష్ట్ర చీఫ్ షర్మిలా డిమాండ్ చేశారు. బీహార్ కు ప్రత్యేక హోదా ఇవ్వాలని నితీష్ తీర్మానం చేసి మోడీ ముందట డిమాండ్ పెట్టిన నేపథ్యంలో సీఎం కూడా తన అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేయాలని సోమవారం డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడి సర్కార్ లో కింగ్ మేకర్ గా ఉన్న మీరు హోదాపై ఎందుకు మౌనం వహిస్తున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధాని లేని రాష్ట్రంగా బీహార్ కంటే వెనకబడి ఉన్నామని మీకు తెలియదా అని ప్రశ్నించారు. 15 ఏళ్లు హోదా కావాలని అడిగిన రోజులు మీకు గుర్తులేదా ? రాష్ట్ర అభివృద్ధిలో ఏపీ 20 ఏళ్లు వెనకబడిందని చెప్పింది మీరే కదా ? అని ప్రశ్నించారు. హోదా ఇవ్వకుంటే మద్దతు ఉపసంహరణ అని ఎందుకు అడగడం లేదు ? మోసం చేసిన మోడీతో హోదాపై సంతకం ఎందుకు పెట్టించలేరని అని ప్రశ్నలు సంధించారు.రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రం దగ్గర హోదా డిమాండ్ పెట్టాలని చంద్రబాబు గారిని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని ఆమె తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీలు కాదు...రాష్ట్ర అభివృద్ధికి హోదా ఒక్కటే మార్గమని అని ఆమె గుర్తు చేశారు.

## డాక్టర్స్ డే శుభాకాంక్షలు



సూర్య, ప్రధాన ప్రతినిది : పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరికీ డాక్టర్స్ డే సందర్భంగా డిప్యూటి సీఎం ముఖ్యమంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలని ప్రకటించారు. ప్రాణాంతక కరోనా మహమ్మారి మానవాళిపై విరుచుకుపడ్డప్పుడు డాక్టర్లు చేసిన సేవలు విస్మరించలేనివి. మన దేశంలో దాదాపు 1600 మంది వైద్యులు కరోనా బారినపడి ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని అందరం గుర్తుంచుకోవాలన్నారు. డాక్టర్లు తమ దగ్గరకు వచ్చిన రోగులపట్ల ప్రత్యేక శ్రద్ధను, సంరక్షణను చూపించాలి. అదే విధంగా రోగులు సైతం వైద్యులపట్ల బలమైన విశ్వాసాన్ని కలిగి ఉండాలి. అటు వైద్యులు, ఇటు రోగులు పరస్పరం గౌరవపూర్వకమైన భావనను పెంపొందించుకోవాలి. దురదృష్టవశాత్తూ ఇటీవలి కాలంలో వైద్యులపైనా, ఆసుపత్రులపైనా దాడులు చోటు చేసుకొంటున్నాయి. ఇటువంటి అవాంఛనీయమైన ఘటనల నుంచి రక్షణ అవసరమని వైద్య నిపుణులు విన్నవించారు. వైద్యులకు రక్షణ కల్పించాల్సిన అంశాన్ని, వైద్య వృత్తిలో ఉన్నవారికి రక్షణ ఇస్తున్న చట్టం అమలు విషయాన్ని రాష్ట్ర కేబినెట్ ముందుకు తీసుకువెళ్తానని వివరించారు.

## వైసీపీ నాయకులపై విచారణ



సూర్య, ప్రధాన ప్రతినిధి : తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్పై రెండున్నరేళ్ల కిందట జరిగిన దాడిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.ప్రత్యేక అధికారుల బృందం పార్టీ కార్యాలయానికి వచ్చి విచారణ ముమ్మరం చేసింది. దాడి చేసిన వారితో పాటు చేయించిన వారి పైనా పోలీసులు దృష్టి పెట్టారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్పై దాడి ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. 2021 అక్టోబర్ 19న ఎన్టీఆర్ భవన్ పై వైఎస్సార్సీపీ మూకలు దాడి చేశాయి. ఆ పార్టీ నేతలు దేవినేని అవినాష్, లేళ్ల అప్పిరెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డి అనుచరులు దాడి చేశారు. పోలీసులు రెండున్నరేళ్ల తర్వాత పార్టీ కార్యాలయానికి వచ్చి విచారణ చేపట్టారు. ప్రత్యేక అధికారుల బృందం పార్టీ కార్యాలయానికి వచ్చి విచారణ ముమ్మరం చేసింది. పోలీసులు దాడికి పాల్పడిన వారి దృశ్యాలు అన్నీ సీసీ కెమెరాల్లో చూసి నిందితుల్ని గుర్తిస్తున్నారు. దాడి చేసిన వారితో పాటు చేయించిన వారి పైనా పోలీసులు దృష్టి పెట్టారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం(ఎన్టీఆర్ భవన్) పై 2021 అక్టోబరు 19న వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ప్రధాన అనుచరుడు, వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, విజయవాడ తూర్పు ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్ అనుచరులు దాడి చేశారు. ఈ దాడిలో పలువురు టీడీపీ కార్యకర్తలు గాయపడ్డారు. దాడి జరిగి రెండున్నరేళ్లయినా ఈ కేసులో పోలీసులు ఒక్కరినీ అరెస్టు చేయలేదు. సీసీటీవీ ఫుటేజీలున్నా నిందితుల్ని ఇప్పటివరకు గుర్తించలేకపోయారు. టీడీపీ ఆఫీస్తో పాటు ఆ పార్టీ నాయకుడు కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఇంటిపైనా అల్లరిమూకలు దాడి చేశాయి. మరో వైపు రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల టీడీపీ కార్యాలయాలపై దాడులు, ఆ పార్టీ నాయకుల ఇళ్ల ముందు ధర్నాలతో రాష్ట్రం అట్టుడికింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ కార్యాలయాలపై ప్రణాళిక ప్రకారం జరిగిన దాడులు తీవ్ర విస్మయానికి గురిచేశాయి. వైఎస్సార్సీపీ నేతలు, పోలీసులు కుమ్మక్కై ఈ అరాచకానికి తెగబడ్డారని టీడీపీ నేతల ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. దాడులపై రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు టీడీపీ అధినేత చంద్రబాబు ఫోన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. రాజకీయ పార్టీల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు సహజమని, కానీ దాడులు తగవని పేర్కొన్నారు.

## గన్నవరం వచ్చిన సైనికుల మృతదేహాలు

సూర్య,ప్రధాన ప్రతినిధి : లఢఖ్ వద్ద నది దాటే ప్రయత్నంలో మృతి చెందిన ఐదుగురు సైనికుల్లో ఆంధ్రప్రదేశ్కు చెందిన వారు ముగ్గురు మృతదేహాలు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నాయి. ఆర్మీ సైనికులు గౌరవ వందనం సమర్పించారు. వాస్తవాధీన రేఖ సమీపంలో టి-72 యుద్ధ ట్యాంకులో వెళుతున్నప్పుడు లేప్క 148 కి.మీ. దూరంలో శనివారం మంచు కరిగి శ్యోక్ నదికి వరదలు వచ్చి ట్యాంకు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. కాల్వపల్లె గ్రామానికి చెందిన జూనియర్ కమిషన్డ్ అధికారి (జేసీవో) ముత్తుముల రామకృష్ణారెడ్డి మృతిచెందారు.

**రుపీక్ ఫిన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్**

45/బి, శుభం కాంప్లెక్స్, 1ఎ మెయిన్, జే పీ నగర్ మూడవ ఫేజ్, బెంగళూరు – 560078

**బంగారం వేలం పాట నోటీసు**

రుణగ్రహీతలకు మరియు ప్రజలకు తెలియజేస్తున్న విషయం ఏమనగా ఈ కింద పేర్కొన్న రుణాలకు పూచీకత్తుగా పెట్టిన బంగారాన్ని వేలం వేస్తున్నాం. బకాయిలు తిరిగి చెల్లించటంలో రుణగ్రహీతలు విఫలమైన కారణంగా బంగారాన్ని వేలం వేస్తున్నాం. ఆన్‌లైన్ పోర్టల్ **https://gold.samil.in** ద్వారా **13/07/2024**న వేలం జరుగుతుంది. ఒకవేళ తాకట్టు పెట్టిన ఆభరణాల యొక్క ఏదైనా లేదా అన్ని వస్తువులకు సంబంధించి పైన పేర్కొన్న తేదీలో ఏ కారణం చేతనైనా ఇ-వేలం కార్యరూపం దాల్చకపోతే, రుపీక్ తదుపరి నోటీసు లేకుండా తదుపరి ఏదైనా తేదీ/లలో వస్తువుల ఇ-వేలం/ప్రైవేట్ విక్రయాన్ని నిర్వహిస్తుంది

**రుణాల జాబితా (LOS ID)**

**12003973, 12010857, 12011076**

మరిన్ని విషయాల కోసం ఈ నెంబర్‌ను సంప్రదించండి - **1800 419 8000**

Sd/- అధీకృత అధికారి — రుపీక్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్

# సంపాదకీయం

editpage@suryaa.com

అనేక సైన్స్ సంబంధ కాల్పనిక కథలు, సినిమాలు, నవలలు, టివీ సీరియల్స్‌ను మనం బహు ఉత్సుకతతో చూస్తూనే ఉన్నాం. అంతరిక్షంలో మానవుడితో సంబంధం లేని గ్రహాంతర వాసులకు చెందిన 'ఫ్లైయింగ్ సాసర్స్ లేదా డిస్క్'లను చూశామని చెప్పుకునే వ్యక్తుల గూర్చి మనం విన్నాం, చదివాం. ఇలాంటి 'గుర్తించబడని ఎగిరే వస్తువులు లేదా అన్‌ఐడెంటిఫైడ్ ఫ్లైయింగ్ ఆబ్జెక్ట్స్, యుయఫ్‌ఓ' ఉనికి, ఆధారాల, ఆకారాల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి ఏటా 02 జూలై రోజున 'వరల్డ్ అన్‌ఐడెంటిఫైడ్ ఫ్లైయింగ్ ఆబ్జెక్ట్స్ (యుయఫ్‌ఓ) డే'గా నిర్వహించుట జరుగుతుంది. భూమికి, మానవాళికి తెలియని గ్రహాంతర వాసులు ప్రయోగించిన అంతరిక్ష నౌకల ఉనికి గూర్చిన చర్చలు పలు మార్లు వింటున్నాం,

## గుర్తించబడని ఎగిరే వస్తువులపై ఆసక్తి

చర్చించుకుంటున్నాం. యుయఫ్‌ఓల గూర్చి నిర్వివాదమైన సాక్ష్యాలు ఉన్నాయని ప్రజల్లో అవగాహన కల్పించడం కూడా జరగాల్సి ఉంది. అమెరికాలో 24 జూన్ 1947న 'కెన్నెత్ ఆర్నాల్డ్' ఏయిర్ క్రాఫ్ట్‌లో గగన వీధుల్లో తిరుగుతున్నపుడు తొలిసారి 'యుయఫ్‌ఓ'లను చూశానని తెలియజేయడం జరిగింది. 1977 వరకు ప్రపంచవ్యాప్తంగా 15 మిలియన్ల జనులు యుయఫ్‌ఓలను చూసి ఉన్నారని కెన్నెత్ తెలియజేశారు. న్యూ మెక్సికో సమీపాన 02 జూలై 1947న 'రూజ్వెల్ యుయఫ్‌ఓ ఫ్లైయింగ్ డిస్క్ క్రాష్' జరిగిందని చరిత్ర చెబుతున్నది. ఇలాంటి ఫ్లైయింగ్ డిస్క్‌లను గ్రహాంతర వాసులు ప్రయోగించి ఉండవచ్చనే భావనను ప్రచారం చేసే వారు కూడా ఉన్నారు. ఏప్రిల్ 2020లో అమెరికన్ రక్షణశాఖ విడుదల చేసిన మానవ నిర్మితం కాని, భూమి ప్రమేయం లేని అంతరిక్షంలో ఎగిరే వస్తువుల గూర్చిన వీడియోల్లో కొన్ని ఆసక్తికర విషయాలు బయట పడ్డాయి. ఇలాంటి ఉత్సుకతను రేకెత్తించే ఫ్లైయింగ్ సాసర్స్ పట్ల పూర్తి అవగాహన కల్పించే ఉద్దేశంతో "ప్రపంచ యుయఫ్‌ఓ దినం" జరుపుకుంటూ సమావేశాలు, టెలిస్కోప్‌తో అంతరిక్ష దర్శనం, సైన్స్ ఫిక్షన్ సినిమాలు, డాక్యుమెంటరీలు చూడడం, చర్చించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. గ్రహాంతర యుయఫ్‌ఓల గూర్చిన చర్చలు వ్యోమగాముల దృష్టిని ఆకర్షించుట కూడా జరుగుతున్నది. ఇతర గ్రహాల్లో నివసిస్తున్న గ్రహాంతర వాసులు యూఎఫ్‌ఓలను ప్రయోగించి ఉండవచ్చని కొందరు శాస్త్రజ్ఞులు కూడా అభిప్రాయ పడుతున్నారు. యుయఫ్‌ఓల ఉనికిని ఖచ్చితమైన ఆధారాలతో రుజువు చేసిన వారు ఇప్పటికీ లేక పోవడం ఆశ్చర్యకరమే. అవి ఉన్నాయనేది ఒక భావన మాత్రమే అనే వారు కూడా ఉన్నారు. "ఏలియన్", "ఈటి", "మెన్ ఇన్ బ్లాక్", "ది థింగ్" లాంటి సినిమాలను చూస్తే యుయఫ్‌ఓల గుర్చిన కొంత సమాచారం దొరుకుతుంది. ఇలాంటి గ్రహాంతర ఎగిరే వస్తువులు లేదా ఫ్లైయింగ్ సాసర్స్ పట్ల ప్రజల్లో సాధికార అవగాహన కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాలు, శాస్త్రజ్ఞులు, మేధావుల మీదనే ఉందని గుర్తుంచుకోవాలి. ఈ డిజిటల్ ఏఐ శాస్త్రసాంకేతిక యుగంలో యుయఫ్‌ఓల ఉనికి రుజువు కావాలని, గుడ్డిగా నమ్మడం అనర్థదాయకమని కూడా తెలుసుకుందాం.

## వీళ్ళు సన్యాసులుకాదు,సన్నాసులు

స్వామీజీలకు రాజకీయాలెందుకు ? అందుకే వీరిని దొంగస్వాములు అనేది .నిన్న కర్ణాటకలో కొంతమంది స్వామీజీలు ముఖ్యమంత్రి సిద్దరామయ్య సమక్షంలొ ఒక కులంవారిని ముఖ్యమంత్రిగా చెయ్యాలి , ఉపముఖ్యమంత్రిపదవి కూడా ఇవ్వాలి , మాకులంలో వారికి ఎక్కువగా మంత్రిపదవులుకూడా ఇవ్వాలి అనిచెప్పటం , దానిని శ్రీశైల జగద్గురు పండితారాధ్య స్వామీజీ వంతపాడటం స్వామీజీల , పీఠాధిపతుల బరితెకింపునకు నిదర్శనం.కామక్రోధమద మాత్సర్యాలను వదిలామనిచెప్పుకునేవారికి కులాలతో పనేమిటి ?రాజకీయాలతో పనేమిటి ? ఎవరుముఖ్యమంత్రి అయితే వీరికెందుకు ? అందుకే వీళ్లను దొంగస్వాములు అనేది .మనరాష్ట్రంలో కూడా గతంలో జగన్ ముఖ్యమంత్రి అయినపుడు , స్వరూపనంద వచ్చి మాఆశ్రమం చుట్టుప్రక్కల చెట్లు , చేమలు , కాకులు పిచుకలు , గద్దలు , ఈశుభసమయం కోసం ఎదురుచూసాము అనిచెప్పి , విశాఖదగ్గర 200 కోట్లవిలువచేసే భూమిని అప్పనంగాకాజేసాడు. అందుకె అపుడు స్వరూపనంద జగన్ కు భజనచేశాడు. ఇపుడు చంద్రబాబుకు భజనమొదలెట్టాడు.ఊసరవెల్లిలా రంగులుమార్చే ఇలాంటివారిని దరిదాపులకు కుడా రానివ్వవద్దు. ఈస్వరూపానంద కెసిఆర్ చేత మరలానీవే ముఖ్యమంత్రిఅవతావు అనిచెప్పి రాజశ్యామలయగం , ఆయాగం ఈయాగం అనిచెప్పుకొని , కోట్లాది రూపాయలువిలువచేసే రెండుఎకరాల భూమిని , కోకాపేట దగ్గర ఎకరా రూపాయకి కొట్టేసాడు.స్వరూపనంద అటుజగన్ , ఇటు కెసిఆర్ ఇద్దరు ముఖ్యమంత్రులు అవుతారని చెప్పాడు .ఇద్దరు ఓడిపోయారు. కెసిఆర్ దాదాపు 1200 కోట్లుఖర్చుపెట్టి చిన్నజియ్యరును పిలిపించి యాదాద్రి కట్టాడు . చినజియ్యరు మంత్రము పనిచేయలేదు. కెసిఆర్ ఓడిపొయాడు.అసలు స్వామీజీలకు వందలాదిఎకరాల భూములుఎందుకు ? వేలకోట్లరూపాయలు ఎందుకూ ? ఏసీ కారులు ఎందుకూ ? రాజమహాళ్లను తలపించె ఆశ్రమాలుఎందుకు ? స్వామీజీలు ఆకలివేస్తే బిక్షాటన చెయ్యాలి. కటికనేలమీద పడుకోవాలి. ఎంతదూరమైనా నడిచివెళ్లాలి.సముద్రయానం అసలుచెయ్యరాదు.ఏ ఎండకు ఆగొడుగు పట్టే , ఊసరవెల్లిలా రంగులుమార్చే ఈదొంగ బాబాలను , స్వామీజీలను , పీఠాధిపతులను రాజకీయనాయకులు దరిదాపులకుకూడా రానివ్వకూడదు దూరంగాఉంచాలి.

**నార్నెవెంకటసుబ్బయ్య.**
**9290617819**

**పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :**
**suryaeditpage@gmail.com**

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# దోచిపెట్టే మీ కాలం చెల్లింది..

● మీ తప్పులను సరిదిద్ది సంక్షేమ పథకాలను అర్హులకు ఇవ్వాలా? ● సంక్షేమం మాటున ఇన్నాళ్లు పెద్దలుకు అందించిందెవరు ● పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ కేవలం రూ.28 వేల కోట్లు మాత్రమే ● రూ.2 లక్షల వరకు రైతు రుణాలను మాఫీ చేయాలన్నది కాంగ్రెస్ లక్ష్యం ● ఎమ్మెల్యేలకు కూడా రైతు బంధును ఇవ్వాలని చెపుతారా? కేటీఆర్ సార్



**జంగిటి వెంకటేష్**
**9052889696**

మీరు చేసిన తప్పే మీ తరువాత వచ్చిన ప్రభుత్వమూ చేయాలా?...మీ తప్పులను సరిదిద్ది సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలా?...కేటీఆర్ సమాధానం ఏమిటి?. పేదలను ఆర్ధికంగా ఆదుకోవడానికే సంక్షేమ పథకాలు తప్ప పెద్దలకు దోచిపెట్టడానికి కాదు. పదేళ్లపాటు మంత్రిగా కొనసాగిన కేటీఆర్ కు ఈ విషయం కూడా తెల్వదని కాదు... తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఇమేజ్ ను తగ్గించాలనే తపన అని చెప్పొచ్చు. అర్హులైన రైతులకు రూ.2 లక్షల రైతు రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు అవసరమని ప్రభుత్వం గుర్తించింది. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ కేవలం రూ.28 వేల కోట్లు మాత్రమే అదీ విడతల వారీగా. కానీ అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రుణమాఫీని ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని నిర్ణయించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండో టర్మ్ 2018 డిసెంబర్ 11 వరకు కటాఫ్ డేట్ పెట్టి రుణమాఫీ చేసింది. ఆ మరుసటి రోజు 2018 డిసెంబర్12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు ఐదేండ్లలో రైతులు తీసుకున్న రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. గత భారాస సర్కారు రోడ్లు, కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములు, ధనికులకు రైతు బంధు..రుణమాఫీ వర్తింప చేసినట్లు ఆరోపణలు రావడంతోనే అసలైన అర్హులకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులతో ఓ సబ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ జూలై15 నాటికి నివేదిక ఇస్తుంది. కానీ అప్పుడే ఏదో జరిగిపోయిందని ...అర్హులకు రుణమాఫీ ఎగ్గొట్టేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని.. సీఎం అంటే కటింగ్ మాస్టరా?.. అంటున్న కేటీఆర్ ఓసారి ఈ వివరాలను పరిశీలించండి. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు పంపిణీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. సాగులో లేని వేలాది ఎకరాలకు రైతుబంధు ఇచ్చినట్టుగా తేలింది. పడావుపడ్డ భూములు, రాళ్లురప్పలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు కూడా రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందించారు. సాగులో లేని భూములకు గత ఐదేండ్లలో ఏకంగా రూ.22,606 కోట్లు అందినట్టు ప్రభుత్వ పరిశీలనలో తేలింది. రైతుబంధు పథకం 2018 వానాకాలం సీజన్ నుంచి ప్రారంభమైంది. మొదట్లో సీజన్కు ఎకరాకు రూ.4 వేల చొప్పున అందజేశారు. అట్లా ఏడాదికి ఎకరానికి రూ.8 వేల చొప్పున ఇచ్చారు. ఆ తర్వాత 2019%-%20 నుంచి సీజన్కు రూ.5 వేల చొప్పున, ఏడాదికి రూ.10 వేలు అందజేశారు. రైతుబంధు ప్రారంభం నుంచి గత వానాకాలం సీజన్ వరకు మొత్తం రూ.72,816 కోట్లు రైతులకు అందజేశారు. అయితే ఇందులో సాగైన భూములకు అందింది రూ.50,210 కోట్లు మాత్రమేనని, మిగతా రూ.22,606 కోట్లు సాగులో లేని భూములకే అందిందని ప్రభుత్వం గుర్తించింది. ప్రతిఏటా సాగైన భూముల లెక్కలతో రైతుబంధు పంపిణీ లెక్కలను పోల్చి చూడగా ఈ బాగోతం బయటపడ్డది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో వానాకాలం, యాసంగి సీజన్లలో కలిపి 1.34 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. కానీ ఆ ఏడాది రైతుబంధు మాత్రం సీజన్ కు 1.31 కోట్ల ఎకరాల చొప్పున రెండు సీజన్లకు కలిపి 2.62 కోట్ల ఎకరాలకు రూ.10,486 కోట్లు చెల్లించారు. ఇందులో సాగైన భూములకు అందింది రూ.5,360 కోట్లు మాత్రమే కాగా, మిగతా రూ.5,126 కోట్లు సాగు చేయని భూములకు అందాయి. 2022%-%23 ఆర్థిక సంవత్సరంలో వానాకాలం, యాసంగి సీజన్లలో కలిపి 2.08 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. కానీ ఆ ఏడాది రైతుబంధు సీజన్కు 1.48 కోట్ల ఎకరాల చొప్పున రెండు సీజన్లకు కలిపి 2.97 కోట్ల ఎకరాలకు రూ.14,744 కోట్లు చెల్లించారు. ఇందులో సాగైన భూములకు అందింది రూ.10,400 కోట్లు మాత్రమే కాగా, మిగతా రూ.4,344 కోట్లు సాగు చేయని భూములకు అందాయి. ఇలా 2023-24 వానాకాలం సీజన్ నాటికి మొత్తంగా రూ.22,606 కోట్లు సాగులో లేని భూములకే ఇచ్చినట్టు ప్రభుత్వం గుర్తించింది.మీ హయాంలో మీ పార్టీ నుండి గెలిచిన ఎమ్మెల్యేలు రైతు బంధును ప్రభుత్వానికి తిరిగి ఇచ్చిన విషయం తెలిసిందే కదా?... మరి ఆర్థికంగా ఎదిగిన ఎమ్మెల్యేలు... బడా రాజకీయ నాయకులు... ప్రభుత్వ ఉన్నత ఉద్యోగులు.. బడా వ్యాపారులు.. భూస్వాములకు రైతుబంధు...రైతు రుణమాఫీ పథకాలను వర్తింపజేయడం వల్ల పేద రైతులకు ఇటువంటి సంక్షేమ పథకాలను అందించడంలో ప్రభుత్వంపై ఆర్థికభారం పడుతుంది. సంపన్నులను పక్కనపెట్టి నిజమైన పేద రైతులకు రుణమాఫీని అమలు చేయాలని ఆలోచిస్తే... దానికి కటింగ్ మాస్టర్ అని విమర్శలు గుప్పిస్తున్నకేటీఆర్ సంపన్న వర్గాలు.. భూస్వాములకూ రుణమాఫీ..రైతుబంధును వర్తింపజేయాలేమో ఒకసారి రైతులను అడిగి తెలుసుకోవాలి. ఆ పేద రైతులు ఏం చెప్తారో దానికి కట్టుబడి ఉండాలి.

# విద్యా వికాసమే లక్ష్యంగా ప్రక్షాళన వైపు అడుగులు

● ఏపీలో మానవ వనరుల అభివృద్ధి శాఖ వేగవంతం ● సమూల మార్పులు తీసుకు రావడానికి శ్రీకారం ● పరిశ్రమల అవసరాలకు ఉపయోగపడేలా కరికులమ్ అప్‌గ్రేడ్ ● గత పాలనలో పార్టీ కార్యాలయాలుగా మారి ● విశ్వ విద్యాలయాలు పాఠాలు చెప్పడం మాని ● కార్యకర్తలుగా పనిచేసిన వీసీలు, రిజిస్ట్రార్‌లు



**నీరుకొండ ప్రసాద్**
**9849625610**

అసమర్ధుడు ఆదర్శాలు వల్లె వేస్తే,కార్యసాధకుడు పటిష్ట వ్యూహంతో ముందుకు వెళతారు. విద్యా వికాసమే లక్ష్యంగా విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చెయ్యబోతున్నారు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్. జగన్ రెడ్డి జమానా లో అన్ని విధాలుగా భ్రష్టు పట్టిన ఉన్నత విద్యను పూర్తి స్థాయిలో ప్రక్షాళించాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్ష.భావితరానికి భవిష్యత్ కల్పిస్తూ వీలైనంత వేగంగా ఉన్నత విద్యా వ్యవస్థను తీర్చి దిద్ది విద్యా వికాసానికి బాటలు వేసి ఉన్నత విద్య మళ్ళీ వెలుగు లీనే విదంగా చర్యలు చేపట్ట బోతున్నారు లోకేష్. అబ్బురంగా చెప్పడం కాదు.నిబ్బరమైన నిజం. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకు రావడానికి శ్రీకారం చుట్టారు. స్టాన్ ఫోర్డ్ లో చదువుకున్న లోకేశ్ కు విద్యావ్యవస్థలో ప్రమాణాలు పెంచి గ్రామీణ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే అవకాశం రావడం అభినందనీయం. యువగళం పాదయాత్రలో కేజీ నుండి పీజీ వరకు విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు లోకేష్. గతంలో పంచాయితీ శాఖా మంత్రిగా ఎల్ ఈ డీ బల్బులు ఏర్పాటు,సిమెంట్ రోడ్లు నిర్మాణంతో గ్రామాల రూపు రేఖలు మార్చారు.ఐటి మంత్రిగా రాష్ట్రంలో ఐటి కంపెనీలు ఏర్పాటు కృషి చేశారు. ఐటి అభివృద్ధి పై దృష్టి పెట్టడంతో ఆంధ్రప్రదేశ్ సాంకేతిక శోభతో అలరారింది.ఇప్పుడు ఐటి ,విద్యా శాఖా మంత్రిగా విద్యా వ్యవస్థ సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు.రాష్ట్రం లో విద్యా రంగానికి మహర్దశ పట్ట నుంది. ఉన్నత విద్యాశాఖ అధికారులతో సమీక్షించి ఉన్నత విద్యా వ్యవస్థను ఏడాదిలోపు పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామని. కళాశాలలు, యూనివర్సిటీల్లో చేపట్టాల్సిన మార్పులు, ప్రమాణాల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై ఉన్నత విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల అవసరాలకు ఉపయోగపడేలా కరికులమ్‌ను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఇంజనీరింగ్ నాలుగేళ్లు చదివినా రాని ఉద్యోగం, అమీర్‌పేట్‌లో నాలుగు నెలల శిక్షణతో ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఇకపై ఇతరత్రా శిక్షణలు అవసరం లేకుండా కేవలం చదువుతోనే ఉద్యోగాలు వచ్చేలా కాలేజీల్లో తగిన శిక్షణ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీతో పనిచేసి విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని అధికారులను కోరారు. ఉన్నత విద్యలో మార్పులు తెచ్చి, యూనివర్సిటీల ర్యాంకింగ్స్ పెంచాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని,కళాశాలల్లోనే శిక్షణ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని, ఈజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉంచాలని, ఉన్నత విద్యకు సంబంధించిన ఆస్తుల విభజనపై నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. యూనివర్సిటీల ర్యాంకింగ్‌లు పడిపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. న్యాయపరమైన వివాదాలను పరిష్కరించి రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. టీచర్లకు భోధనేతర పనులు,అనవసరమైన యాఫ్ ల భారాన్ని తగ్గించి పూర్తి స్థాయిలో భోధన పైనే దృష్టి పెట్టేలా చర్యలు తీసుకొనున్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేసి విద్యా ప్రమాణాలు పెంచి యువత భవిష్యత్ బాటలు వేయాలని మంత్రి నారా లోకేశ్ ఆకాంక్ష. విశ్వ విద్యాలయాలను వైసీపీ కార్యాలయాలుగా మార్చి భావితరాల ప్రగతికి పునాదిరాళ్ళు కావాల్సిన ఉన్నత విద్యా వ్యవస్థలను తన భజన పరులకు కట్టబెట్టింది జగన్ ప్రభుత్వం.వైసీపీ కార్యకర్తలను ఉపకులపతులుగా నియమించి ఉన్నత విద్యకు వురి తాడు బిగించారు. యూనివర్సిటీల్లో రాజకీయ జోక్యం పెరిగింది. విశ్వ విద్యాలయాల్లో విద్యా ప్రమాణాలను దిగజార్చి న ఫలితంగా ఎక్కువగా నష్టపోయింది పేద,మధ్య తరగతి వర్గాల విద్యార్థులే.జగన్ రెడ్డి ఏలుబడిలో అన్ని రంగాలు సర్వనాశనం అయినట్లే జగన్ భజన బృందం అయిన వైస్ ఛాన్స్ లర్ల పుణ్యమా అని ఆయన అయిదేళ్ళ ఏపీ విశ్వ విద్యాలయాల్లో చదువులు చట్టు బండలు అయ్యాయి.వర్శిటీల్లో జగన్ రెడ్డి భజన పెరిగి విద్యా ప్రమాణాలు దిగజారి ప్రవేశాలు తగ్గి పోయ్యాయి.ఏపీ ఉన్నత విద్యను చదవ లేమంటూ అనేక మంది విద్యార్దులు అప్పులుచేసి పరాయి ప్రాంతాలకు వెళ్ళి పోయ్యారు.కానీ వాస్తవాలు ఇంత దారుణంగా వుంటే విద్యారంగంలో సమూల సంస్కరణలు తెచ్చాము అని సిగ్గు లేకుండా స్వోత్కర్షలు వినిపించారు జగన్ రెడ్డి మూటా. తెలుగుదేశం హయాంలో ఆంధ్రప్రదేశ్ నాణ్యమైన విద్య అందించడంలో 3 వ స్థానంలోఉండగా జగన్ హయాంలో 19 వ స్థానానికి దిగజారడం అంటే రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పరిస్థితి ఎంత దిగజారిపోయిందో అర్థం అవుతుంది. జగన్ ప్రభుత్వ అనాలోచిత,అసంబద్ధ చర్యలు మూలంగా విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయింది.ప్రభుత్వ పాఠశాలల్లో పేదపిల్లలకు ఆంగ్ల భాషా నైపుణ్యాలు పెంచి ప్రపంచాన్ని ఏలే స్థాయికి చేరుస్తామని టోఫెల్ పరీక్షలకు వారిని సిద్ధం చేస్తామంటూ ప్రాథమిక విద్యావ్యవస్థ మెరుగుదలకు ఘన సంకల్పాలు ప్రకటించి గత ఐదేళ్లు విద్యా వ్యవస్థతో ఫుట్ బాల్ ఆడారు జగన్ రెడ్డి.నిరంకుశ ప్రయోగాలతో రాష్ట్ర విద్యా రంగాన్ని కుళ్ళపొడిచిన ఘనత జగన్ రెడ్డి దే. మంచి నాలెడ్జ్ వున్న టీచర్లను నియమించకుండా కంప్యూటర్లు,వాటిలో రికార్డు చేసిన పాఠాలు బోధిస్తే ఫలితం శూన్యం అని యూనెస్కో హెచ్చరించింది. విద్యకు రూ 70 వేల కోట్లు ఖర్చు చేశామంటున్న జగన్ ప్రభుత్వం అంత ప్రజాధనాన్నే కాదు అంతకు మించి ఒక తరం విద్యార్థుల భవిష్యత్ ను బలి పీఠం పైకి నెట్టింది.భావి పౌరుల బంగారు భవిష్యత్ కు పటిష్ట పునాదిపడేది ప్రాథమిక పాఠశాలల్లోనే. కానీ 70 లక్షల మంది పిల్లల పాఠశాల విద్య నాణ్యమైన చదువుల మాగాణం కావాల్సి ఉండగా జగన్ రెడ్డి అసంబద్ధ,అనాలోచిత వెర్రి ప్రయోగాలతో మొత్తం పడకేసే దుస్థితికి చేరింది. ప్రభుత్వ బడుల్లో నాలుగు,అయిదు తరగతుల పిల్లలు 65 శాతం వరకు తప్పులు లేకుండా చదవ లేరు అని,ఆరు -ఎనిమిది తరగతుల పిల్లలు దాదాపు 42 శాతం నీళ్లు నమిలారని పాఠశాల విద్యా శాఖ సర్వేలో వెల్లడించిన పరిస్థితుల్లో ప్రాథమిక చదువును జగన్ ప్రభుత్వం ఎంతగా భ్రష్టు పట్టించిందో అర్థం అవుతుంది. ప్రాథమిక పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతులను దూరంగా ఉన్న హైస్కూళ్లలో విలీనం చేసిన నిర్ణయంతో విద్యార్థులు లేక ప్రాథమిక పాఠశాలలు దయనీయస్థితికి చేరాయి. ప్రభుత్వం తీసుకున్న బడుల విలీనం ప్రభావంతో గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు వెలవెలబోతున్నాయి. వైసీపీ ప్రభుత్వ నిర్ణయంతో గ్రామాల్లోని చిన్నారులు ప్రాథమిక విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందంటూ విద్యావంతులు, ఉపాధ్యాయ సంఘాలు, మేధావులు మొత్తుకున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని విద్యా రంగ నిపుణులు అన్నారు . వేలాది రూపాయల వేతనాలతో పనిచేసే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నప్పటికీ, వైసీపీ ప్రభుత్వం అమలుచేసిన అస్తవ్యస్త విధానాలతో వేల రూపాయలు ఖర్చు పెట్టి మరీ విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పంపించి వేస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది..

రాష్ట్రంలో జగన్ పాలనలో 4,709 పాఠశాలలు మూతపడినట్లు సమాచారం .సంస్కరణల మూలంగా 2,045 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు మూత పడ్డాయి. 2019-20 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో మొత్తం 63,463 పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో కేంద్ర ప్రభుత్వ పాఠశాలలు 61, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు 4,287, స్థానిక సంస్థలు జెడ్‌పి, ఎంపిపి, మున్సిపల్ ఆధ్వర్యంలో నడిచేవి 40,708, ఎయిడెడ్ విద్యాసంస్థలు 2,234, ప్రైవేట్ పాఠశాలలు 16,173 ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరానికి 58,754 పాఠశాలలు మాత్రమే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పాఠశాలలు సంఖ్య 58 కి , రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 3,902కు, స్థానిక సంస్థల సంఖ్య 40,495, ఎయిడెడ్ 787, ప్రైవేట్ 13,509కు పడిపోయాయి.రాష్ట్రంలో మొత్తంగా నాలుగున్నరేళ్లలో 4,709 పాఠశాలలు మూతపడ్డాయి.రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో భారీ సంస్కరణలు తీసుకొచ్చింది.ఈ ప్రభావం పాఠశాలల మూతకు దారి తీసింది. రాష్ట్ర వ్యాప్తంగా 4,234 పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో గత విద్యాసంవత్సరం ప్రభుత్వం విలీనం చేసింది. తరగతులను తరలించడంతో మిగిలిన 1, 2 తరగతుల పిల్లల సంఖ్య తగ్గిపోయింది. కేవలం రెండు తరగతులే అక్కడ ఉండటం, పిల్లల సంఖ్య తక్కువగా ఉండటం, ఉపాధ్యాయుడు ఒక్కడే బోధించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించారు జిఓ 117తో ఉపాధ్యాయులను తగ్గించి పిల్లలను బడికి దూరం చేసింది. దీంతో చేరేవారు లేక 500 వరకు మూతపడ్డా.ప్రభుత్వం జారీ చేసిన 117 జారీ చేసినప్రాథమిక పాఠశాలల భవనాలు అలంకార ప్రాయం అయ్యాయి . మరో వైపు 3,4,5,తరగతుల విలీనంతో ఉన్నత పాఠశాలల్లో తరగతి గదుల కొరత ఏర్పడింది. ఈ నిర్ణయంతో పూర్తిగా ప్రాథమిక పాఠశాలలు ఉనికి కోల్పోయ్యాయి. విద్యా శాఖని ఉద్ధరిస్తున్నట్లు గొప్పలు ెప్పడమే తప్ప పిల్లల అవసరాలను జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు.ప్రభుత్వ బడుల్లో ఆణిముత్యాలు మెండుగా వుండే విద్యా విధానాన్ని తీసుకొచ్చింది మీ మేన మామ ప్రభుత్వం అంటూ బులిపించిన జగన్ రెడ్డి ఊరి బడులకు తాళాలు వేసి పేదపిల్లల చదువులను చట్టు బండలు చేసారు.విద్యారంగాన్ని సమూలంగా మారుస్తామని హామీ ఇచ్చి 6.41 లక్షల మంది పేద పిల్లలు ప్రయివేటు బడులకు వెళ్లే పరిస్థితి తెచ్చారు. గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 1,73,416 మంది విద్యార్థులు మధ్యలో చదువు మానేశారు..విద్యా రంగం నిర్వహణలో ప్రభుత్వ విధానం పరమ అధ్వాన్నంగా ఉంది..ఆంధ్రప్రదేశ్ లో సెకండరీ విద్యలో డ్రాపవుట్స్ రేటు 16.7 శాతంగా కేంద్రం వెల్లడించింది.ఐదేళ్లలో ఒక్క డిఎస్‌సి నిర్వహించలేదు. విద్యా వ్యవస్థను పూర్తిగా జగన్ ప్రభుత్వం భ్రష్టు పట్టించింది. విద్యార్థుల హాజరు మొదలు మరుగు దొడ్ల ఫోటోలు ఆఫ్ లోడ్ చెయ్యడం వరకు ఎన్నో యాఫ్ ల నిర్వహణ భాధ్యత గురువులకు కట్టబెట్టి వారిని లఘువులు గా మార్చారు.దశాబ్దాలుగా విద్యాదానంలో తరిస్తున్న ఎయిడెడ్ పాటశాలల విలువైన భూములు పై కన్నేసి వాటిని వెంటాడి వేదించి పునాది చదువులను నిర్వీర్యం చేసింది జగన్ ప్రభుత్వం. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దే చర్యలు చేపట్టింది.

# కెసిఆర్‌కు షాక్‌ల మీద షాక్‌లు

● అధికారం కోల్పోయి పార్లమెంట్ ఎన్నికలో 0 స్థానానికి పరిమితమై ● పార్టీ మారుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ● అడ్డుకట్ట వేసిన పట్టించుకోని నేతలు ● ఇక కోర్టులలో వ్యతిరేక తీర్పులు ● హైకోర్టులో కేసీఆర్కు భారీ షాక్ ● రిట్ పిటిషన్ను కొట్టేసిన న్యాయస్థానం ● జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్కు గ్రీన్ సిగ్నల్ ● ఢిల్లీ హైకోర్టులో ఎమ్మెల్సీ కవితకు చుక్కెదురు ● కవితకు బెయిల్ నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు ● సీబీఐ, ఈడీ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం



**విద్య వెంకట్ తెలంగాణ బ్యూరో**
**939161818**

అధికారం ఉన్నప్పుడు రాచరిక పాలన, నియంతృత్వం, అహంకారం, అవినీతి కార్యక్రమాలే అక్రమం కాదు సక్రమం అంటూ పాలన కొనసాగింది. చివరకు మాజీ సీఎం కేసీఆర్ కు పూలు అమ్ముకున్న చోటే కట్టెలు అమ్ముకునే పరిస్థితి వచ్చిందని మేధావి వర్గాలు చర్చ జరుగుతోంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తెలంగాణ రాష్ట్ర సమిత స్థాపించిన

కెసిఆర్ 2001 నుండి 2014 వరకు ఉమ్మడి రాష్ట్ర రాజకీయాలను సైతం తన వైపే తిప్పుకునే విధంగా కేంద్ర బిందువుగా మారారు. 60 ఏళ్ల కోట్లాట, మూడు తరాల ఉద్యమం, చివరకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆ తర్వాత రెండు సార్లు టిఆర్ఎస్ అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రిగా అధినేత కేసిఆర్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ప్రభుత్వానికి అవసరమున్న ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ఫక్తు రాజకీయ పార్టీ అంటూ కెసిఆర్ టిడిపి, కాంగ్రెస్, సిపిఐ పార్టీల నుండి గెలుపొందిన ఎమ్మెల్యేలను టిఆర్ఎస్ లో చేర్చుకుని రాజకీయ ఆటకు తెర లేపారు. దీంతో కెసిఆర్ కు మించిన నాయకుడే లేదన్న విధంగా ఇతర రాజకీయ పార్టీలను ప్రతిపక్ష హెూదా సైతం లేకుండా చేయడంతో ప్రశ్నించే వారే కనుమరుగయ్యారు. చివరకు ధర్నా చౌక్ ను సైతం ఎత్తేసి ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం ప్రారంభించారు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ కు ఎదురేలేదన్న విధంగా పరిపాలన కొనసాగింది. కెసిఆర్ ప్రభుత్వ హయంలో పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. అందులో ప్రధానంగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాని ఎస్టిమేషన్ వేల కోట్ల నుండి లక్ష కోట్లకు పైగా ఎగబాకింది. అయితే రాజకీయ పార్టీలు మేధావులు మాట్లాడినప్పటికీ పట్టించుకోకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే గత సంవత్సరం మధ్యలో మేడిగడ్డ బ్యారేజీ కుంగి కెసిఆర్ ప్రభుత్వం విమర్శల పాలైంది. అయితే అసెంబ్లీ ఎన్నికలు సైతం మేడిగడ్డ కుంగింది కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి మయమైందని ప్రధానంగా కాంగ్రెస్ బిజెపిలో ఎన్నికల్లో విమర్శనాస్త్రాలు సంధించారు. మరోవైపు కెసిఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఢిల్లీ లిక్కర్ స్కాం ఆరోపణలు ఎదుర్కొని ఈడి అరెస్టు చేసి బీహార్ జైలుకు పంపింది. మరోవైపు రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గత ప్రభుత్వ హయంలో చేపట్టిన ప్రాజెక్టుల గురించి విచారణ కమిషన్లు ఏర్పాటు చేసింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. అయితే విద్యుత్ కొనుగోలు విషయంలో గత ప్రభుత్వం ఉన్న రేటు కంటే ఎక్కువ ధర తక్కువ కొనుగోలు చేసిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఏర్పాటు చేసింది. విద్యుత్తు కొనుగోలు, యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ల నిర్మాణాలు అక్రమాలు జరిగాయని ప్రభుత్వం ఆరోపణ విచారణకు జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ ఏర్పాటు కమిషన్ ఏర్పాటును తప్పుబడుతూ హైకోర్టులో కేసీఆర్ రిట్ కమిషన్ తన పని కొనసాగించవచ్చని న్యాయస్థానం స్పష్టీకరణ చేసింది.

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్కు హైకోర్టులో చుక్కెదురైంది. జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్ను రద్దు చేయాలంటూ కేసీఆర్ పెట్టుకున్న రిట్ పిటిషన్ను న్యాయస్థానం కొట్టివేసింది. గత ప్రభుత్వ హయాంలో చత్తీస్గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల ఏర్పాటులో అక్రమాలు జరిగాయంటూ వాటిని నిగ్గు తేల్చేందుకు రేవంత్రెడ్డి ప్రభుత్వం హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ నర్సింహారెడ్డి నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ను ఏర్పాటు చేసింది. విచారణ చేపట్టిన కమిషన్ తమ ఎదుట విచారణకు హాజరు కావాలని కేసీఆర్ను ఆదేశించింది. అయితే, ఆ సమయంలో తాను ఎన్నికల ప్రచారంలో ఉన్నానని, మరోమారు వస్తానని కమిషన్కు లేఖ రాశారు. ఆ తర్వాత విచారణకు హాజరు కాకపోగా, విచారణ కమిషన్ తీరును తప్పుబడుతూ బహిరంగ లేఖ రాశారు. ఆ తర్వాత అసలు కమిషన్ ఏర్పాటే చెల్లుబాటు కాదని, దానిని రద్దు చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. కమిషన్ దురుద్దేశపూర్వకంగా, ఏకపక్షంగా విచారిస్తోందని, విచారణ పూర్తికాకుండానే మీడియా సమావేశం ఏర్పాటు చేసి కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని చెప్పిందని ఆరోపించారు.

కేసీఆర్ పిటిషన్పై శుక్రవారం హైకోర్టులో వాడివేడి వాదనలు జరిగాయి. కేసీఆర్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆదిత్య సోంధి వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్రెడ్డి వాదనలు వినిపించారు. వాదనల అనంతరం తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం తాజాగా తీర్పును వెలువరించింది. పిటిషనర్ తరపు న్యాయవాదుల వాదనతో విభేదించిన న్యాయస్థానం కేసీఆర్ పిటిషన్ను కొట్టివేసింది. జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ తన విచారణను కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. మరోవైపు మూడు నెలలకు పైగా తీహార్ జైల్లో కవిత ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. కోర్టు ఆమెకు బెయిల్ను నిరాకరించింది. ఈడీ, సీబీఐ... రెండు కేసుల్లోనూ ఆమె బెయిల్ పిటిషన్లను హైకోర్టు తిరస్కరించింది. మద్యం పాలసీ కేసులో మొదట ఈడీ, ఆ తర్వాత సీబీఐ అరెస్ట్ చేసింది. ఈ రెండు కేసుల్లోనూ కవిత బెయిల్ కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. కానీ ఆమెకు నిరాశ ఎదురైంది.

దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు కవితకు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. మూడు నెలలకు పైగా ఆమె తీహార్ జైల్లో ఉంటున్నారు. ఈ క్రమంలో సీబీఐ, ఈడీ కేసుల్లో కవిత రౌస్ అవెన్యూ కోర్టులో బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. అక్కడ బెయిల్ రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఇక ఇప్పుడు బెయిల్ కోసం కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో భారత రాష్ట్ర సమితికి సంబంధించిన ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు వరుస పెట్టి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. వారి చేరికను నిలువరించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ పార్టీ మారే నేతలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సైతం భారత రాష్ట్ర సమితి అభ్యర్థులు ఒక్క పార్లమెంట్ స్థానం కూడా గెలుపొందకపోవడంతో ఆ పార్టీకి మరింత ఇబ్బందికరంగా తయారైంది. టిఆర్ఎస్ కు కాస్త బీఆర్ఎస్ అని ప్రకటించి దేశ రాజకీయాల్లో చక్రం తిప్పుతామని ప్రకటించిన కేసీఆర్ ఆశలు అడిగే ఆశలై రాష్ట్రంలో ఉన్న అధికారాన్ని కోల్పోయి అయోమయంలో పడింది. అంతేగాక విచారణల పేరుతో కేసులు ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది. కేసులు తప్పించుకునేందుకు కోర్టులకు వెళ్లిన ఎదురుగాలు వీస్తూ గతమెతో ఘన కీర్తి నేడు అపకీర్తి అన్న విధంగా తయారయింది కేసీఆర్ పరిస్థితి. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తులో మరిన్ని కేసులు ఎదుర్కొంటారో? అనే పరిస్థితి నెలకొంది.

## ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురు

- బెయిల్ పిటిషన్లు తిరస్కరణ
- మరికొన్నాళ్లు తీహార్ జైల్లోనే ఉండనున్న కవిత

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. రెగ్యులర్ బెయిల్ పిటిషన్ను న్యాయస్థానం కొట్టేసింది. రెండు వేర్వేరు పిటిషన్లు వేయగా.. రెండింటినీ ధర్మాసనం తిరస్కరించింది. సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలంటూ కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. లిక్కర్ పాలసీ కేసులో మార్చి 15న ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం ఈడీ కస్టడీకి కోర్టు అనుమతిచ్చింది. అటు తర్వాత న్యాయస్థానం ముందు హాజరుపరచగా జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో తీహార్ జైలుకు తరలించారు. అప్పటి నుంచి ఆమె జైల్లోనే ఉంటున్నారు.తాజాగా వేసుకున్న రెండు పిటిషన్లు తిరస్కరణకు గురవ్వడంతో ఆమె తీహార్ జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కవితను నిరాధార ఆరోపణలతో అరెస్టు చేశారని, ఒక పార్టీకి కీలక నేతగా ఉన్నా ఆమెకు ఎలాంటి అవకాశాలు కల్పించకుండా ఉంచారంటూ ఆరోపిస్తూ ఆమె తరఫు న్యాయవాదులు కోర్టులో వాదించారు. ఈడీ, సీబీఐ తరఫున వాదనలు వినిపిస్తూ.. ఢిల్లీ మద్యం కేసులో కవిత కీలక పాత్రధారి, సూత్రధారి అని కోర్టుకు తెలిపారు.

ప్రస్తుతం మద్యం కేసు కీలక దశలో కొనసాగుతున్న తరుణంలో ఆమెకు బెయిల్ మంజూరు చేస్తే సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశం ఉందని వాదించారు.

అందువల్ల ఎట్టిపరిస్థితుల్లో ఆమెకు బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు. సీబీఐ, ఈడీ వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న కోర్టు కవిత పిటిషన్లను తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.



# సభలో అగ్నిపథ్‌పై మాటల తూటాలు

- ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ మధ్య వాగ్యుద్ధం
- 158 సంస్థల అభిప్రాయాలు తీసుకున్నామన్న రాజ్‌నాథ్
- అగ్నిపథ్‌ను 'యూజ్ అండ్ త్రో లేబర్' పథకమన్న రాహుల్



ఢిల్లీ: లోక్సభ సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రక్షణశాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ మధ్య మాటల తూటాలు పేలాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన అగ్నిపథ్ను 'యూజ్ అండ్ త్రో లేబర్' పథకంగా రాహుల్ అభివర్ణించారు. దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన రాజ్నాథ్ సింగ్.. ప్రతిపక్షనేత ప్రజల్లో లేనిపోని అపోహలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. మందుపాతర పేలి ఒక అగ్నివీర్ ప్రాణాలు కోల్పోతే అతడిని అమరవీరుడిగా పరిగణించరు. నేను అమరుడన్నా, కేంద్ర ప్రభుత్వం కానీ, ప్రధాని మోదీ కానీ ఆ పేరుతో పిలవరు. కేవలం అగ్నివీర్గానే గుర్తిస్తారు. అతడి కుటుంబానికి పింఛన్ రాదు. ఎలాంటి నష్టపరిహారం కూడా ఇవ్వరు. కేంద్రం దృష్టిలో అగ్నివీరులంతా ఉపయోగించుకొని వదిలేసే ఓ లేబర్ లాంటివారు" అంటూ ఘాటుగా విమర్శించారు. ఈ పథకాన్ని తీసుకొస్తున్నప్పుడే దేశంలోని పలు ప్రాంతాల్లో హింసాత్మక నిరసనలు జరిగినట్లు ఈ సందర్భంగా రాహుల్ సభకు వివరించారు. " మీరు సైనికులను విభజిస్తున్నారు. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోతే ఒకరిని అమరుడు అంటున్నారు. మరొకరిని అగ్నివీరుడు అంటున్నారు. ఒకరికి పింఛను వస్తుంది. మరొకరికి రాదు. అగ్నివీరుడు జవాన్గా పిలిపించుకోలేడు. మీరన్నట్లుగా దేశభక్తుడిగానే మిగిలిపోతాడు" అంటూ అగ్నివీర్, జవాన్ల మధ్య తేడాలను వివరిస్తూ అధికార పక్షంపై మండిపడ్డారు. రాహుల్ మాట్లాడుతున్న సమయంలో.. ప్రధాని మోదీ, హోం శాఖ మంత్రి అమిత్షా మధ్య కూర్చున్న రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ వెంటనే లేచి నిలబడి అభ్యంతరం వ్యక్తం చేశారు. తప్పుడు ప్రకటనలు చేస్తూ.. రాహుల్ గాంధీ సభను దప్పుదోవపట్టిస్తున్నారని అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నివీర్ కుటుంబానికి రూ. కోటి ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు చెప్పారు.

ఓవైపు రాజ్నాథ్ మాట్లాడుతుండగానే.. 'నేను తప్పు మాట్లాడలేదు.. నేను తప్పు మాట్లాడలేదు' అంటూ రాహుల్ నిరసన వ్యక్తం చేశారు. అయితే, రాహుల్.. పరిహారం, పింఛన్పై అభ్యంతరం వ్యక్తం చేయగా.. రాజ్నాథ్ మాత్రం కేవలం పరిహారంపై మాత్రమే సమాధానమిచ్చారు. అగ్నివీర్ పథకం తీసుకొచ్చే ముందు చాలా ఆలోచించామని, పలువురు నిష్ణాతులు, 158కి పైగా సంస్థల నుంచి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాతే దీన్ని అమల్లోకి తీసుకొచ్చామని రాజ్నాథ్ వివరించారు. ఈ పథకంలో ఉన్న నిబంధనల ప్రకారం.. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నివీర్ కుటుంబ సభ్యులు పింఛన్ పొందేందుకు అర్హులు కాదు. అయితే, ఈ సందర్భాల్లో వారి కుటుంబాలకు రెగ్యులర్ జవాన్ల మాదిరిగానే పింఛన్ వెసులుబాటు కల్పించాలని ఫిబ్రవరిలో పార్లమెంటరీ ప్యానెల్ ప్రతిపాదించింది. దీనిపై ఇంకా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. యువతను దేశ రక్షణలో భాస్వాములను చేయడమే లక్ష్యంగా 2022లో కేంద్రం అగ్నిపథ్ పథకాన్ని తీసుకొచ్చింది. ఆర్మీ, నేవీ, వైమానిక విభాగాల్లో నాలుగు ఏళ్ల సర్వీసు కోసం 17.5 ఏళ్ల నుంచి 21 ఏళ్ల లోపు యువకులను దీని కోసం ఎంపిక చేస్తారు. వీరిని అగ్నివీర్లుగా పిలుస్తారు. వీరిలో 25 శాతం మంది సేవలను 15 ఏళ్లకు మించి వాడుకోవచ్చు. మిగతా వారిని ఆర్థిక ప్యాకేజీ ఇచ్చి సర్వీసు నుంచి రిటైర్మెంట్ ఇస్తారు. అయితే, 25 ఏళ్ల వయస్సులో అగ్నివీర్లను కేంద్రం నిరుద్యోగులుగా మారుస్తోందని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. అంతేకాకుండా స్వల్పకాలిక రిక్రూట్మెంట్ల వల్ల దళాల్లో ఐక్యత కొరవడుతుందని కాంగ్రెస్ వాదిస్తోంది. రెగ్యులర్ సైనికులతో కలిసి పని చేస్తున్నప్పటికీ... వాళ్లతో పోలిస్తే జీతభత్యాలు, పింఛన్ విషయంలో తేడాలు ఉండటం కూడా వారిని ప్రభావితం చేస్తుందని చెబుతోంది. అయితే, నాలుగేళ్ల సర్వీసు ముగింపు సమయంలో అగ్నివీర్లకు మంచి ఆర్థిక ప్యాకేజీ ఇస్తున్నామని, ఆ మొత్తంలో జీవితంలో వారు నిలదొక్కుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని కేంద్రం అంటోంది.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై
# ప్రభుత్వం కీలక నిర్ణయం

- ఇతర రాష్ట్రాలకు అధికారులను పంపించి అధ్యయనం
- ప్రభుత్వానికి త్వరగా ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం
- పరుగులు తీస్తున్న హౌజింగ్ శాఖ అధికారులు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ఇతర రాష్ట్రాలకు అధికారులను పంపించి అధ్యయనం చేయించాలని అధికారులను ఆదేశించారు. సర్వే నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి త్వరగా ఇవ్వాలని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క హౌజింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇండ్లు నిర్మించి ఇవ్వడానికి ఈ ఏడు ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్ల చొప్పున బడ్జెట్లో నిధులు కేటాయించిందన్నారు. ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల అమలులో భాగమే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమన్నారు. సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి హౌజింగ్, రెవెన్యూ, ఐ అండ్ పిఆర్ శాఖల అధికారులతో బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్షించారు. ఇతర రాష్ట్రాల్లో పేదలకు అక్కడి ప్రభుత్వాలు నిర్మిస్తున్న ఇండ్ల నమూనాలు, లబ్ధిదారుల ఎంపిక విధానం గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేయాలని సూచించారు. కాలుష్యం లేని గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించే నేపథ్యంలోనే ఇందిరమ్మ ఇండ్లకు సోలార్ విద్యుత్ ఏర్పాటు తప్పనిసరి అని ప్రభుత్వం భావిస్తుందన్నారు. ఇండ్ల నిర్మాణ సమయంలో కచ్చితంగా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. రాష్ట్ర రాజధాని హైదరబాద్ మహానగరం శర వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అవుటర్, రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ ఇండ్ల నిర్మాణంపై హౌజింగ్ శాఖ దృష్టి సారించాలన్నారు. మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయాల్సిన బాధ్యత హౌజింగ్ శాఖపై ఉందని గుర్తు చేశారు. ఎస్ ఆర్ నగర్, బర్కత్పుర, కూకట్పల్లి, ఈసిఐఎల్ లాంటి ప్రాంతాల్లో హౌజింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఎల్ఐజి, ఎంఐజి, హెచ్ఐజి పేరిట ఇండ్ల నిర్మాణాలు చేయడం వల్ల ఎంతో మంది మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరిన విషయాన్ని ఈ సందర్భంగా అధికారులకు వివరించారు. అవుటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యన హౌజింగ్ బోర్డు ఇండ్ల ఏర్పాటుకు రెవెన్యూ శాఖ నుంచి భూమిని సేకరించుకోవాలని సూచించారు.

# 'మోదీజీ నవ్వెరెందుకో'..

- లోక్‌సభలో రాహుల్ గాంధీ కేంద్రంపై ఘాటు విమర్శలు
- నోట్ల రద్దు, జీఎస్టీని ఎందుకు తీసుకొచ్చారో మీకు తెలుసా?



ఢిల్లీ: లోక్సభ సమావేశాలు సోమవారం వాడీవేడిగా సాగాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ కేంద్రంపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన చేసిన కొన్ని మతపరమైన వ్యాఖ్యలను అధికార పక్షం తీవ్రంగా తప్పుబట్టింది. ఇక, రాహుల్ ప్రసంగంలో కొన్ని ఆసక్తికర సంభాషణలు చోటుచేసుకున్నాయి. మోదీజీ ఎప్పుడూ సీరియస్గా ఎందుకు ఉంటారని ఆయన అడగ్గా.. ప్రధాని దీనికి గట్టి కౌంటర్ ఇచ్చారు. అసలేం జరిగిందంటే.. "సభాపక్ష నేత అయిన ప్రధాని మోదీ విపక్షంతో ఎప్పుడూ సరదాగా మాట్లాడిన సందర్భాల్లేవ్. కనీసం మేం ఎదురుపడినప్పుడు ఆయన ముఖంలో చిరునవ్వు కూడా కన్పించదు. మోదీజీ ) ఎందుకు ఎప్పుడు సీరియస్గా ఉంటారు?" అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. దీనికి సభలో ఉన్న ప్రధాని వెంటనే బదులిస్తూ.. "ప్రతిపక్ష నేతను సీరియస్గా తీసుకోవాలని ప్రజాస్వామ్యం, రాజ్యాంగం నాకు నేర్పించాయి" అని అన్నారు. దీంతో అధికార పక్షం సభ్యులంతా నవ్వులు చిందించారు.

**రాసిపెట్టుకోండి: రాహుల్ ఛాలెంజ్ :** ఇక, లోక్సభ వేదికగా ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ బహిరంగ సవాల్ విసిరారు. "నేను గుజరాత్ వెళ్లి టెక్స్టైల్ పరిశ్రమ యజమానులతో మాట్లాడా. నోట్ల రద్దు, జీఎస్టీని ఎందుకు తీసుకొచ్చారో తెలుసా? అని వారిని అడిగా. అది కేవలం బిలియనీర్ల కోసమే అని వారు చెప్పారు.

ప్రధాని కేవలం సంపన్నుల కోసమే పనిచేస్తున్నారు. భాజపాకు నేను చెప్పేది ఒక్కటే..! రాసిపెట్టుకోండి వచ్చే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి వారిని ఓడిస్తుంది" అని అన్నారు.

**అయోధ్య సందేశమిచ్చింది..** ఈ సందర్భంగా అయోధ్య ఆలయం ఉన్న యూపీలోని ఫైజాబాద్ స్థానంలో భాజపా ఓటమిపై స్పందిస్తూ రాహుల్ విమర్శలు గుప్పించారు. "శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్య మీకు సరైన సందేశమిచ్చింది. ప్రజల భూములు లాక్కొని గుడికట్టిన మీకు తగిన సమాధానం చెప్పారు. ఆలయ ప్రారంభోత్సవం సమయంలో దేశవ్యాప్తంగా సంపన్నులను ఆహ్వానించిన మీరు అయోధ్య ప్రజలను మాత్రం పిలవలేదు" అంటూ దుయ్యబట్టారు.

# తెలంగాణ హైకోర్టులో కేసీఆర్‌కు ఎదురుదెబ్బ

- ప్రభుత్వ వాదనలను ఏకీభవించిన న్యాయస్థానం
- కేసీఆర్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు




తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్కు ఎదురుదెబ్బ తగిలింది. కేసీఆర్ వేసిన పిటిషన్ను న్యాయస్థానం కొట్టివేసింది. ప్రభుత్వ వాదనలకు న్యాయస్థానం ఏకీభవించింది. విద్యుత్ అవకతవకలపై జ్యుడిషియరీ కమిషన్ విచారణపై కేసీఆర్ సవాల్ చేశారు. నేడు కేసీఆర్ పిటిషన్పై హైకోర్టు తీర్పును వెలువరించింది. విద్యుత్ కొనుగోలు అవకతవకలపై జ్యుడిషియరీ కమిషన్ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిషన్ విచారణను కేసీఆర్ సవాల్ చేశారు. ఇరువైపుల వాదనలూ విన్న న్యాయస్థానం ప్రభుత్వ వాదనలను సమర్థిస్తూ కేసీఆర్ పిటిషన్ను కొట్టేసింది. హైకోర్టులో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్పై మూడు రోజుల ముందే వాదనలు ముగిశాయి.

అయితే ఆ రోజున హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. అసలు కేసీఆర్ పిటిషన్కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసింది. ఈ ఏడాది మార్చి 14న జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్గఢ్-తెలంగాణ మధ్య విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ సంఘాన్ని నియమించింది. కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని ఇవాళ హైకోర్టు కొట్టివేసింది.

# త్వరలో తెలంగాణ మంత్రివర్గ విస్తరణ

- మరో ఐదుగురికి చోటు
- హోమ్ మంత్రిగా సీతక్క



హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేతలకు శుభవార్త అందనుంది. త్వరలో తెలంగాణ మంత్రివర్గ విస్తరణ జరుగుతుంది. ఈ విషయాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మరో ఐదారుగురు నేతలకు తెలంగాణ కేబినెట్ లో చోటు దక్కనుందని చెప్పారు. శాఖల్లో మార్పులు, చేర్పులు ఉంటాయన్న మంత్రి దామోదర.. మంత్రి సీతక్కకు హోం శాఖ దక్కే అవకాశం ఉందన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, దానం నాగేందర్ లకు సైతం రేవంత్ రెడ్డి కేబినెట్లో చోటు దక్కవచ్చు అన్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్ విస్తరణ లేదన్నట్లుగా మాట్లాడారు. కేబినెట్ విస్తరణపై ఆయనకు ఆసక్తి లేదని సైతం పార్టీలో వినిపించింది. అయితే పలువురు సీనియర్లు మాత్రం మంత్రివర్గంలో చోటు కోసం ఢిల్లీ పర్యటనలు చేసి కాంగ్రెస్ పెద్దలను సైతం కలిశారు. కాగా, తెలంగాణ కేబినెట్ లో ప్రస్తుతం ఆరు ఖాళీలు ఉన్నాయి. రాష్ట్రంలో పన్నెండు మంది మంత్రులు మాత్రమే ఉండగా.. కీలక మంత్రిత్వ శాఖలన్నీ సీఎం రేవంత్ రెడ్డి దగ్గరే ఉన్నాయి.

**ఇటీవల ఢిల్లీలో రేవంత్ రెడ్డి పర్యటన :** టీపీసీసీ చీఫ్గా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేరును కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేసినట్లు సమచారం. బీసీ నేత కావడం, ఎన్ఎస్యూఐ, రేవంత్ రెడ్డికి సన్నిహితుడు కావడం మహేశ్వర్ రెడ్డికి కలిసొచ్చే అంశాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా పార్టీ ఎంపీల ప్రమాణ స్వీకారం కార్యక్రమంతో పాటు కాంగ్రెస్ పెద్దలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో భేటీ అయ్యి తెలంగాణ పీసీసీ చీఫ్ ఎంపికతో పాటు రాష్ట్ర మంత్రివర్గం విస్తరణపై చర్చలు జరిపారు. మరోవైపు రాష్ట్రానికి రావాల్సిన నిధులు, కంటోన్మెంట్ ఏరియాలో కేంద్రం నుంచి అనుమతులు, ఔటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డుకు సంబంధించి పలు విషయాలపై కేంద్ర మంత్రులతో రేవంత్ రెడ్డి వరుస భేటీలలో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పనులలో, ప్రాజెక్టులలో పూర్తిగా సహకారం ఉంటుందని, అయితే కేంద్రం నుంచి నిధుల కావాలని, కొన్ని అభివృద్ధి పనులకు అనుమతులు సైతం కోరారు.

# కేటీఆర్.. కింకర్తవ్యం

- తెలంగాణలో ఆపరేషన్ ఆకర్ష్‌ను వేగవంతం చేసిన కాంగ్రెస్
- ఆరుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ హస్తం గూటికి చేరిన వైనం
- మరికొంత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారుతారని ప్రచారం
- పార్టీ శ్రేణులకు భరోసా కల్పిస్తున్న కేటీఆర్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ను వేగవంతం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాజ్యసభ సభ్యుడు, కేసీఆర్కు కుడి భుజంలా వ్యవహరించిన కేకే (కంచర్ల కేశవరావు)తోపాటు భద్రాచలం, ఖైరతాబాద్, జగిత్యాల, బాన్సువాడ, స్టేషన్ ఘనపూర్, చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్, సంజయ్ కుమార్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కడియం శ్రీహరి, కాలే యాదయ్య కాంగ్రెస్ లోకి జంప్ చేశారు. దీంతో అప్రమత్తమైన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్.. పార్టీ ఎమ్మెల్యేలను తన ఫామ్ హౌస్ కు పిలిపించుకుని వారికి నచ్చచెబుతున్నారు. అయినా ఫలితం ఉండటం లేదు. కే సీఆర్ తన ఫామ్ హౌస్ లో ఎమ్మెల్యేలతో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆ మరుసటి రోజే కాంగ్రెస్ లోకి జంప్ చేశారు. కేవలం ఈ ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే కాదని మరికొందరు కూడా పార్టీ మారతారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వ లక్షణాలపై నీలినీడలు అలముకున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో గతంలో బీఆర్ఎస్ కు పెద్దగా మద్దతు ఉండేది కాదు. అలాంటి దాన్ని చాలెంజింగ్ గా తీసుకుని జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పాగా వేసేలా కేటీఆర్ బాగానే కష్టపడ్డారు. అందుకు కేటీఆర్కు మంచి ప్రశంసలే దక్కాయి. గతేడాది డిసెంబర్ లో జరిగిన తెలంగాణ ఎన్ని కల్లోనూ రాష్ట్రమంతా బీఆర్ఎస్ కు గట్టి దెబ్బ పడ్డా జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం ఆ పార్టీ దుమ్ములేపింది. మొత్తం 15 స్థానాలు గెలుచుకుని విజయనాదం చేసింది. కాంగ్రెస్ ఒకే ఒక్క స్థానానికి పరిమితమైంది.

అలాంటి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ కు తెరతీయడంతో జీహెచ్ ఎంసీ పరిధిలో ఎమ్మెల్యేలు జారుకుంటున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ లో చేరిపోయారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతితో కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. హైదరాబాద్కు సమీపంలోని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కూడా కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దీంతో పార్టీని వదిలిపోతున్న వారిని పోకుండా చేయడంతో కల్వకుంట్ల తారక రామారావు విఫలమవుతున్నారనే టాక్ నడుస్తోంది. సక్సెస్ లు వచ్చినప్పుడు ప్రశంసలు అందుకున్నా ఒక నాయకుడి సమర్థ నాయకత్వ లక్షణాలు సంక్షోభంలోనే బయటపడతాయి. కఠిన పరిస్థితుల్లో, సంక్షోభ పరిస్థితుల్లో పార్టీని ఎలా ముందుకు నడిపించారనేదే కీలకం. అయితే కేటీఆర్ ఈ విషయంలో విఫలమయ్యారని అంటున్నారు. తమ చేజారిపోతున్న ఎమ్మెల్యేలను కాపాడుకోవడంలో, వారిని పార్టీ మారకుండా నచ్చచెప్పడంలో కేటీఆర్ విఫలమయ్యారని చెబుతున్నారు. పెరుగుతున్న వయసు, వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా కేసీఆర్ అంతకుముందులా క్రియాశీలకంగా లేరు. కేటీఆరే పార్టీని నడిపించాల్సి ఉంది. కానీ ఎప్పుడు ఏ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్ లో చేరతారో తెలియని పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు. ఈ పరిస్థితి కేటీఆర్ నాయకత్వ లక్షణాలకు గట్టి పరీక్షేనని టాక్ నడుస్తోంది. మరి కేటీఆర్ ఆన్ డ్యూటీలో సక్సెస్ అవుతారా? లేదా? వేచిచూడాల్సిందే.

# అదంతా తప్పుడు ప్రచారం

- పార్టీ మారే ప్రసక్తే లేదు
- సబితా ఇంద్రారెడ్డి



తెలంగాణ బ్యూరోప్రతినిధి : ఎట్టిపరిస్థితుల్లోనూ బీఆర్ఎస్ పార్టీ మారే ప్రసక్తే లేదని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ%ొ% తాను పార్టీ మారుతున్నట్లు టీవీలు, న్యూస్పేపర్లు, సామాజిక మాధ్యమాల్లో కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు ప్రచారం చేయవద్దని ప్రసారమాధ్యమాలకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ సారథ్యంలో గతంలో ఎలా పనిచేశామో.. ఇప్పుడు కూడా పార్టీ కోసం అలాగే పనిచేస్తామని చెప్పారు. కేసీఆర్ పార్టీలో నాకు సముచితమైన గౌరవం కల్పించారని గుర్తు చేశారు. పార్టీ మారాల్సిన అవసరం తనకు లేదన్నారు. ఇటీవల కొందరు పార్టీలో అనేక పదవులు అనుభవించి కాంగ్రెస్లో చేరారని విమర్శించారు. అలాంటి వారికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. తాను మాత్రం బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని, కేసీఆర్ నాయకత్వంలోనే పని చేస్తానని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తేల్చి చెప్పారు.

# పీసీసీ అధ్యక్ష పదవిని బీసీకి కేటాయించండి

- డిప్యూటీ సీఎంగా బీసీకి అవకాశమివ్వండి
- మంత్రివర్గ విస్తరణలో బీసీలకు పెద్దపీట వేయండి
- కాంగ్రెస్ అధిష్టానాన్ని, తెలంగాణ ముఖ్యమంత్రిని కోరిన బీసీ రాజ్యాధికార సమితి
- రాహుల్ గాంధీ కార్యాలయానికి దాసు సురేశ్ లేఖ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణలో సామాజిక న్యాయం సాక్షాత్కారం అవ్వాలంటే పీసీసీ అధ్యక్షుడిగా బీసీకే అవకాశమివ్వాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు..ఇదే తరుణంలో డిప్యూటీ సీఎంగా బీసీకి అవకాశమివ్వడంతో బాటు త్వరలో చేపట్టబోయే తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో బీసీలకు పెద్దపీట వేయాలని రాహుల్ గాంధీ కార్యాలయానికి రాసిన ప్రత్యేక లేఖలో దాసు సురేశ్ కోరారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఓసీకి ముఖ్యమంత్రి పదవి, ఎస్సీకి ఉప ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టి సామాజిక న్యాయ దిశగా పయనిస్తున్న నేపథ్యంలో బీసీలకు పీసీసీ అధ్యక్ష పదవి అనివార్యమవుతున్నదని తద్వారనే సామాజిక న్యాయ విధానం తెలంగాణలో సాక్షాత్కారమవుతుందని తెలిపారు.ఔత్సాహిక బీసీ పారిశ్రామికవేత్తలకు ,వ్యాపారవేత్తలకు ఉన్నతవర్గాలతో సమానంగా ప్రభుత్వ టెండర్ లు , కాంట్రాక్టులు, అవకాశాలలో ప్రాధాన్యత కల్పించాలని దాసు సురేశ్ ప్రభుత్వాన్ని కోరారు..బీసీ కార్పొరేషన్లు ఫెడరేషన్లకు పాలకవర్గాలను ఏర్పాటు చేయడంతో పాటు 10 ఏళ్లుగా చితికిపోయిన చేతివృత్తుల సహకార సంఘాలకు ఎన్నికలను త్వరితగతిన నిర్వహించాలనే విషయాన్ని కాంగ్రెస్ అధిష్టానినికి నివేదించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో లేఖను సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద పాత్రికేయ మిత్రుల సమక్షంలో విడుదల చేసారు. తెలంగాణలో రాజకీయంగా బీసీలు గత పదేళ్లుగా తీవ్రంగా అణగదొక్కబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.

రాజకీయ, ఆర్థిక అవకాశాలన్నీ నేటికీ ఒకే అగ్రవర్ణానికి పరిమితమవుతున్నాయన్నారు. బీజేపీ పార్టీకి లోక్ సభలో సీట్లు గణనీయంగా తగ్గడానికి బీసీలు , దళితులు , నిరుద్యోగ యువతనే నన్న వాస్తవాన్ని సహితం తమ ఆత్మవిమర్శలో అంగీకరించిన విషయాన్ని కాంగ్రెస్ అధిష్టానం గుర్తెరగాలన్నారు. తెలంగాణలో, దేశంలో భవిష్యత్తు రాజకీయాలు బీసీల చుట్టే తిరగనున్నాయనీ , బీసీల ఎదుగుదలను విస్మరిస్తే జాతీయ పార్టీలకు మనుగడ కష్టమేనని పేర్కొన్నారు .సామాజిక, హిస్సేధారీ న్యాయానికి బీసీల సాధికారతే మూలస్తంభం అనీ , బీసీల రాజకీయ పునరుజ్జీవనం కోసం కాంగ్రెస్ పార్టీ బీసీల అవకాశాలను ఇనుమడింపజేసే దిశగా ముందడుగు వెయ్యాలన్నారు. ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం అసెంబ్లీ ఎన్నికలలో బీసీలకు కేటాయించాల్సిన సీట్లు రాకున్నా తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ పాలన నుండి విముక్తికై అధికార మార్పు కోసం బీసీలు కాంగ్రెస్ కు అండగా నిలిచామన్నారు . పార్లమెంటు సీట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం జరిగినా ఇంకా ఓపికతోనే మా వర్గాలకు అవకాశాలను ఇనుమడింపజేసుకోవడం కోసమే పీసీసీ అధ్యక్ష పదవిని అడుగుతున్నామనీ తమ ఆవేదనను కాంగ్రెస్ అధిష్టానం అర్థం చేసుకోవాలని కోరారు.

30 ఏళ్లుగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలకు నిబద్ధుడై అధిష్టానానికి,ముఖ్యమంత్రికి విధేయుడుగా ఉన్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్ష పదవికి అన్ని విధాలా అర్హుడనీ, తన అభ్యర్థిత్వాన్ని అధిష్టానం పరిగణన లోకి తీసుకొని తెలంగాణలో బీసీల నాయకత్వపు ఎదుగుదలకు ఊతమవ్వాలని దాసు సురేశ్ లేఖలో కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ముఠా కొండస్వామి, హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు బండారి పద్మ, ప్రధాన కార్యదర్శి గోషిక స్వప్న ,రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటరమణ,రాష్ట్ర అధికార ప్రతినిధి తాళ్ల భాగ్యలక్ష్మి,రాష్ట్ర కార్యదర్శి రాజలికా విజయ కుమారి, నగర కార్యదర్శి ముకపలి లక్ష్మి,ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ రవీందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసు బలరాం , భారత మురళీదర్, శ్రీనిబాబు గౌడ్, నాగరాజ్, ఫకురుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్స్ డే

## డాక్టర్లకు ఘన సన్మానం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: డాక్టర్స్ డే పురస్కరించుకొని కే పీ హెచ్ బీ కాలనీ ఐదువ పేజీలో లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ( లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ - మెగా సిటీ యువభారత్ ) వారి ఆధ్వర్యంలో డాక్టర్స్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా లయన్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, ప్రత్యేక అతిథిగా లయన్ డి. కోటేశ్వరరావు వైద్య వృత్తిలో ఎన్నో సేవలు అందించిన ఎం.మల్లేశ్వర రావు, డాక్టర్ పి. రఘుపతి, డాక్టర్ హెచ్. సూర్య ప్రకాష్, డాక్టర్ వెంకటేష్, ఎం. తేజశ్రీ లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్ ఎం.అనిల్ కుమార్, లయన్ అనిల్ కుమార్ రెడ్డి, లయన్ ఎస్. చెన్నారెడ్డి లతోపాటు జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వచ్చే ఏడాది నాటికి డేటా సెంటర్ల విస్తరణ

● ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు

తెలంగాణ బ్యూరోప్రతినిధిః మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ల విస్తరణ పనులు వచ్చే ఏడాది నాటికి పూర్తి చేసి కార్యకలాపాలను పెంచాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సంస్థ ప్రతినిధులను కోరారు. విస్తరణ పూర్తయితే అత్యాధునిక డేటా సెక్యూరిటీ, క్లౌడ్ సొల్యూషన్స్ రంగాల్లో హైదరాబాద్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వెల్లడించారు. డేటా సెంటర్లకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారం, మౌలిక వసతులపై సచివాలయంలో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో ఆయన సోమవారం నాడు సమీక్షా సమావేశం నిర్వహించారు. డేటా సెంటర్ కోసం మేకగూడలో సేకరించిన 22 ఎకరాలకు సంబంధించి స్థానిక పంచాయతీతో కొన్ని సమస్యలున్నట్టు మైక్రోసాఫ్ట్ అధికారులు మంత్రి దృష్టికి తేగా సాయంత్రంలోగా పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంకను ఆదేశించారు. విద్యుత్తు సబ్ స్టేషన్ల సామర్థ్యం పెంపు, వరద నీటి కాలువల నిర్మాణం లాంటి పనులు గడువులోగా పూర్తి చేస్తామని శ్రీధర్ బాబు తెలిపారు. సంస్థ సేకరించిన భూముల వినియోగ మార్పిడి పనులు వేగంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మైక్రోసాఫ్ట్ సంస్థ రంగారెడ్డి జిల్లా మేకగూడలో 22 ఎకరాలు, షాద్ నగర్ లో 41 ఎకరాలు, చందన్ వల్లెలో 52 ఎకరాలు కొనుగోలు చేసింది.

డేటా సెంటర్ల పనులు 70 శాతం పూర్తయ్యాయని సంస్థ ప్రతినిధులు శ్రీధర్ బాబుకు వివరించారు. ప్రభుత్వం తరపు నుంచి పెండింగ్ పనుల పర్యవేక్షణ కోసం ఒక అధికారిని నియమిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మైక్రోసాఫ్ట్ తన కార్యకలాపాలను గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో మైక్రోసాఫ్ట్ ఏషియా ఆపరేషన్స్ హెడ్ ఇయాన్ కాలన్, భూ అభివృద్ధి విభాగం హెడ్ ఉత్తమ్ గుప్తా, ఇండియా కమ్యూనిటీ హెడ్ శ్రీచందన తదితరులు పాల్గొన్నారు.



## కేసీఆర్ నాయకత్వంలో
# మళ్లీ విజృంభిస్తాం

● ఎన్నికల సమయంలో నోటికొచ్చిన హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు ● రుణమాఫీ లేదు.. నాలుగు వేలు పెన్షన్లు లేవు ● ఆడబిడ్డలందరికీ నెలకు రూ. 2500, క్వింటాల్‌కు రూ. 500 బోనస్, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ● మైనార్టీలకు 20 వేల కోట్లు ఖర్చు చేస్తానని 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన రేవంత్ ● ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు ● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ బ్యూరోప్రతినిధిః కేటీఆర్ కీలక వ్యాఖ్యలు తెలంగాణ రాష్ట్రంలో తప్పకుండా తిరిగి కేసీఆర్ నాయకత్వంలో విజృంభిస్తాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నోటికొచ్చిన హామీలు, మాటలు చెప్పారు. రుణమాఫీ లేదు. నాలుగు వేలు పెన్షన్లు లేవు. ఆడబిడ్డలందరికీ నెలకు రూ. 2500, క్వింటాల్కు రూ. 500 బోనస్, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, మైనార్టీలకు 20 వేల కోట్లు ఖర్చు చేస్తానని 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిండు. కానీ ఒక్క హామీ కూడా నెరవేరలేదు అని కేటీఆర్ గుర్తు చేశారు. గాలికి గడ్డపారలు కొట్టుకుపోవు. నిజమైన గులాబీ దండు ఎక్కడికి పోదు.. తప్పకుండా తిరిగి కేసీఆర్ నాయకత్వంలో విజృంభిస్తాం. తాత్కాలికంగా రెండు ఎదురుదెబ్బలు తగిలాయి. రెండుసార్లు ఎవరి పొత్తు, మద్దతు అవసరం లేదకుండా 2014లో 63, 2018లో 88, 2023లో కూడా మూడో వంతు సీట్లు అంటే 39 స్థానాలు గెలిచాం. 14 సీట్లలో కేవలం స్వల్ప తేడాతో ఓడిపోయాం అని కేటీఆర్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు మోదీ మీదనే ఎన్నికలు జరిగాయి. దీంతో సమాజం నిట్టనిలువునా చీలిపోయింది. మోదీని వద్దనుకున్న వారు ఇండియా కూటమికి, కావాలనుకున్న వారికి ఎన్డీఏకు ఓటేశారు. ఏ కూటమిలోలేని వారికి కొంత ఇబ్బంది కలిగింది. కేరళలో సీపీఎం ఉంది. ఏ కూటమిలో లేదు.. స్వతంత్రంగా మనలాగా పోటీ చేసింది.. 20లో ఒకటి గెలిచింది. ఏపీలో జగన్ , తెలంగాణలో మనం ఓడిపోయాం. ఒడిశాలో నవీన్ పట్నాయక్ సీఎంగా ఉండి కొట్లాడితే ఒక సీటు వచ్చింది. యూపీలో బీఎస్పీకి ఒక్క సీటు కూడా రాలేదు. పంజాబ్లో అకాలీదళ్కు ఒక్క సీటు కూడా రాలేదు. ఈ దేశంలో ఎన్నో బలమైన పార్టీలు.. బీజేడీ, అకాలీదళ్, బీఎస్పీ, సీపీఎం, వైఎస్సార్సీపీతో పాటు మనకు ఎదురుదెబ్బ తగిలింది అని కేటీఆర్ పేర్కొన్నారు

**కవితక్క కూడా వస్తది.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గల్లీ గల్లీ తిరుగుతాం**

కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైంది. రైతుభరోసా, రుణమాఫీ, పెన్షన్లు, కరెంట్ రాదని అర్థమైంది. ఎరువులు విత్తులు లేవు. పట్టణాభివృద్ధి ఆగిపోయింది. కానీ నాయకులు డైలాగులు కొడుతున్నారు. అభివృద్ధి కోసం అంటున్నారు.. మరి అభివృద్ధి ఎక్కడ జరుగుతుంది. పెట్టుబడులు ఆగిపోయాయి. కాంగ్రెస్ రాజకీయాలను విద్యార్థులు, ప్రజలు, రైతులు గమనిస్తున్నారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లా ఎగిరేది గులాబీ జెండానే. మనం భయపడొద్దు. కేసీఆర్ అండగా ఉన్నారు. మన పనులు ప్రజల కళ్ల ముందున్నాయి. చరిత్రను చెరిపేస్తే చెరిగిపోదు. జగిత్యాలను జిల్లా చేసింది కేసీఆర్. ఒక్కడు పోయిండు అని భయపడొద్దు. ఎంగిలి మెతుకుల కోసం కొందరు పోతే పోనీ భయపడొద్దు.. ప్రజలే తీర్పు చెబుతారు అని కేటీఆర్ చెప్పారు. మీకు మేమందరం అండగా ఉంటాం. మీ సమస్యలపై మండలిలో ఎల్ రమణ, అసెంబ్లీలో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గళం విప్పుతారు. జగిత్యాలలో సంజయ్ మనషులకు ఒక్కటంటే ఒక్క ఎంపీటీసీ సీటు కూడా ఇవ్వనివ్వడు జీవన్ రెడ్డి. సంజయ్తో అయ్యేది లేదు.. పొయ్యేది లేదు. కాంగ్రెస్ పార్టీలో సంజయ్కు భవిష్యత్ లేదు. రాజకీయాల్లో హత్యలు ఉండవు.. ఆత్మహత్యలు ఉంటాయి. జగిత్యాల ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకుండు. లోకల్ బాడీ ఎన్నికల్లో అండగా ఉంటాం. గల్లీ గల్లీ తిరుగతా.. కవితక్క కూడా వస్తది.. తప్పకుండా తిరుగుతది.. మీకు అండగా ఉంటాం. డాక్టర్ సంజయ్ను ఓడించడమే లక్ష్యంగా పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## తెలంగాణలో ఎనిమిది మంది
# ఐపీఎస్ అధికారుల బదిలీ

● ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణలో ఎనిమిది మంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం సోమవారం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాచలం కొత్తగూడెం ఓఎస్డీగా పరితోష్ పంకజ్, సిరిశెట్టి సంక్రీత్ గవర్నర్ ఏడీసీగా, ములుగు ఓఎస్డీగా గీతే మహేశ్ బాబాసాహెబ్ను నియమించింది. సౌత్ ఈస్టోన్ డీసీపీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, భద్రచాలం ఏఎస్పీగా అంకిత్ కుమార్ శంఖవార్, భైంసా ఏఎస్పీగా అవినాశు కుమార్, వేములవాడ ఏఎస్పీగా శేషాద్రినిరెడ్డి, ఏటూరు నాగారం ఏఎస్పీగా శివం ఉపాధ్యాయను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గత నెలలో ప్రభుత్వం పెద్ద ఎత్తున బదిలీలు చేసిన విషయం తెలిసిందే. పలు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించింది. పలుజోన్ల డీసీపీలను సైతం బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నది.

# నల్గొండ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

● మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



తెలంగాణ బ్యూరోప్రతినిధిః నల్గొండ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తానని... పేదవాడికి అండగా ఉంటానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బీట్ మార్కెట్ వద్ద రూ.3 కోట్లతో నిర్మించనున్న 33/11 కెవీ సబ్ స్టేషన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నల్గొండ టౌన్ను మోడల్గా తీర్చిదిద్దుతామన్నారు. రూ.700 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నామని.. ఎవరికీ నష్టం చేయమని తెలిపారు. తనకు ఐదు గజాల భూమి లేదని... ఇంకా అద్దె ఇంట్లోనే ఉంటున్నానని చెప్పారు. మార్కెట్ ధర కన్నా ఎక్కువ నష్టపరిహారం ఇస్తామన్నారు. ఎస్ఎల్బీసీ సెంటర్ వద్ద అన్ని వసతులతో మల్టీపర్పస్ హాస్టల్ కట్టనున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ప్రభుత్వాధికారులకు ఆదేశించామని.. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన తీసివేయాలని ఆదేశించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు.

# పదవులు ఎవరికి శాశ్వతం కాదు

● చేసిన పనులే గెలిపిస్తాయి
● మాజీ మంత్రి హరీశ్ రావు



తెలంగాణ బ్యూరోప్రతినిధి : సర్పంచులు, ఎంపీటీసీల హయాంలోనే సాగు నీటి కల సాకారమైంది. చరిత్రలో నిలిచే ఎన్నో పనులు చేసిన ఘనత మీకే దక్కుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సోమవా రం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల పరిషత్ చివరి సర్వ సభ్య సమావేశంలో పాల్గొని ఆయన మాట్లా డారు. పదవులు శాశ్వతం కాదు. ప్రజా సేవే ఎల్లప్పుడూ ఉంటుం దన్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఐదు సంవత్సరాలుగా కష్టపడి ప్రజలకు సేవలందించారని ప్రశంసిం చారు. సర్పంచులు, ఎంపీటీసీలు కలిసి చాలా గ్రామాల్లో సమన్వయంతో పని చేశారు. కాళేశ్వరం నీళ్లను రైతులకు రెండు పంటలకు అందించిన గొప్ప అవకాశం మీ హయాంలో మీకు దొరికిందన్నారు. ఎన్నో అభివృద్ధి పనులు చేస్తుంటాం. కానీ, జీవన గతిని, పల్లెల ముఖ చిత్రాన్ని మార్చేది సాగు నీరు మాత్రమేనని చెప్పారు.

అలాంటి సాగునీరు మీ ఈ అయిదేళ్ల కాలంలో రైతులకు అందడం మీ అదృష్టమని చెప్పారు. గ్రామాల్లో మన ఊరు %-% మన బడి కార్యక్రమంలో భాగంగా కొన్ని పాఠశాలలు బాగుచేసుకున్నాం. అదేవిధంగా సీసీ రోడ్లు, ఓపెన్ జిమ్ లు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు ఇలా అనేక అభివృద్ధి పనులు మీ హయాంలో చేసుకున్నామని తెలిపారు. పదవుల్లో ఉన్నపుడు ఎన్ని మంచి పనులు చేశామనేదే శాశ్వతంగా నిలిచిపోతుంది. కావున మీకు మళ్లీ ఇంకా మంచి అవకాశాలు రావాలని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలవాలని ఆకాంక్షించారు. పదవులు ఎవరికీ శాశ్వతం కాదు, ఎవరైనా మాజీలు కావాల్సిందే. అధికారంలో ఉన్నా లేకపోయినా నా సహకారం ఎప్పుడికి మీకు ఉంటుందని భరోసానిచ్చారు.

# ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సత్కారం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు 90 వ పుట్టినరోజు సందర్భంగా ఆయనను జనసేన నాయకులు ఘనంగా సత్కరించారు. జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ నాదెండ్ల భాస్కర్ రావు కు పూల బొకే అందజేసి శాలువ తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాదెడ్ల భాస్కర్ రావు తనయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఘనంగా సత్కరించారు. శాలువ తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన జనసేన పార్టీ నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, కొల్లా శంకర్, అడబాల షణ్ముఖ, విజయ్, కామేశ్వరరావు, పులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.



# పీసీసీ అంటే పెద్ద క్రెడిట్ చోర్

కాంగ్రెస్‌పై మండిపడ్డ మన్నె క్రిశాంక్

తెలంగాణ బ్యూరోప్రతినిదిః పీసీసీ అంటే పెద్ద క్రెడిట్ చోర్ అంటూ కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రేవంత్ రెడ్డి క్రెడిట్ కోసం ఆరాట పడుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్లో మన్నె క్రిశాంక్ మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ లోక్సభలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఎన్నిక కావడానికి కారణం రేవంత్ రెడ్డి అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఫాక్స్కాన్ సంస్థను తెలంగాణకు తీసుకువచ్చింది కేటీఆర్.. దీన్ని కాంగ్రెస్ ఘనతగా గొప్పలు చేసుకుంటున్నారు. సీతారామ ప్రాజెక్టును మొత్తం పూర్తి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం. కంటోన్మెంట్ను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకుంది. దేశవ్యాప్తంగా అన్ని కంటోన్మెంట్ బోర్డులను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ అనేక సార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి కంటోన్మెంట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. కంటోన్మెంట్ భూముల విషయంలో స్పెషల్ మీటింగ్కు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడిగా రేవంత్ రెడ్డి హాజరు కాలేదు అని క్రిశాంక్ గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడుగా ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు. రాహుల్ గాంధీ అశోక్ నగర్ వద్దకు వచ్చి మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ ఏమైంది..? కాంగ్రెస్ మెగా డీఎస్సీ ఏమైంది..? మోతీలాల్ నాయక్కు ఏమైనా జరిగితే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే. గ్రూప్-1 మెయిన్స్కు 1:100 అవకాశం కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ గ్యారెంటీలు వెనక్కి వెళ్లి స్కాంలు ముందుకు వచ్చాయని మన్నె క్రిశాంక్ పేర్కొన్నారు.

# తప్పు చేసి హైకోర్టు మెట్లు ఎక్కిన కేసీఆర్

● కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ ఆరోపణ



తెలంగాణ బ్యూరోప్రతినిధిః జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ని రద్దుచేయమంటూ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ హైకోర్టు మెట్లు ఎక్కాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. దాన్ని తిరస్కరిస్తూ హైకోర్ట్ తీర్మానం ఇచ్చిందని చెప్పారు. కేసీఆర్, నర్సింహారెడ్డి కమిషన్కి హాజరు కావాలని ఖచ్చితంగా నిజాలు బయటకు రావాలని అన్నారు. కేసీఆర్ ఈ విచారణ జరపమని సవాల్ విసిరి ఇప్పుడు పారిపోయే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బహిరంగంగా తక్కువ ధరకు దొరుకుతున్నా, ఛత్తీస్గఢ్ నుంచి ఎక్కువ ధర పెట్టి విద్యుత్ కొనుగోలు చేయాల్సిన అవసరం ఏముంది? అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ పైన కూడా ప్రస్తుతం విచారణ జరుగుతుందని ఆది శ్రీనివాస్ తెలిపారు. అలాగే తెలంగాణలో 2014 తీవ్ర విద్యుత్ కొరత ఏర్పడిందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

ఎన్నో ప్రైవేట్ కంపెనీలు తక్కువ ధరకు విద్యుత్ ఇస్తామన్న మాజీ సీఎం కేసీఆర్ ఒప్పుకోకుండా ఛత్తీస్గఢ్ నుంచి ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు ఎందుకు చేశారని ప్రశ్నించారు. యాదాద్రి పవర్ ప్లాంట్లో కూడా అవినీతి జరిగిందని అన్నారు. ఈ నిజలన్నీ జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్లో బయటపడతాయనే కేసీఆర్ భయపుడుతన్నారని విమర్శించారు. తెలంగాణ ఓటర్లకు తెలివి లేదని, ఆంధ్ర ఓటర్లకు తెలివి ఉందని కేసీఆర్ అనలేదా అని ప్రశ్నించారు. తెలంగాణ ఓటర్లకు, ఆంధ్ర ఓటర్లకు తెలివి ఉంది కాబట్టే రెండు రాష్ట్రాల్లో రజాకార్ల పాలనను తొలగించి ప్రజా పాలనను ఎంచుకున్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీని రద్దు చేయాలని త్వరలో అన్ని సాక్ష్యాలతో ఎలక్షన్ కమిషన్ ముందుకి వెళ్తామని యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.



## ఆగస్టు 15న ఖైదీల విడుదలకు
# గవర్నర్ గ్రీన్ సిగ్నల్

తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఆగస్టు 15న ఖైదీల విడుదలకు గవర్నర్ రాధాకృష్ణన్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఖైదీల విడుదలకు సంబంధించి ప్రభుత్వ ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్తో సీఎం రేవంత్రెడ్డి సమావేశం అయ్యారు. దాదాపు రెండుగంటల పాటు ఇరువురి మధ్య భేటీ సాగింది. ఈ సందర్భంగా గవర్నర్తో సీఎం లంచ్ మీటింగ్లో పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, అసెంబ్లీ సమావేశాలు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై చర్చ, యూనివర్సిటీల్లో వీసీల నియామకం, ఆగస్టు 15న ఖైదీల విడుదల, రాష్ట్ర విభజన అంశాలపై చర్చించినట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా.. సుదీర్ఘంగా జైలులో శిక్ష అనుభవిస్తున్న సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను విడుదల చేయాలని నిర్ణయించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 161 ప్రకారం గవర్నర్ ఖైదీలకు క్షమాభిక్ష కల్పించడం, శిక్షల నుంచి ఉపశమనం కల్పించే అధికారం ఉన్నది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, అక్టోబర్ 2 గాంధీ జయంతి, జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేస్తుంటారు.

# మంత్రి సీతక్కపై ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఫైర్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః మంత్రి సీతక్కపై ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఫైర్ అయ్యారు. మంత్రి అధికారిక కార్యక్రమాలకు ప్రోటోకాల్ పాటించలేదని ఆరోపించారు. ప్రోటోకాల్ తెలియకుండా సీతక్క మంత్రి ఎలా అయిందోనని ఎద్దేవా చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్కు ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..రాజకీయంలో గెలుపు, ఓటములు సహజం. అధికారంలో శాశ్వతం కాదన్నారు.

ఈరోజు ఉన్నట్టు రేపు ఉండదన్నారు. రాజకీయ పదవులు ఇచ్చేది ప్రజలు. ప్రజల కోసం పని చేయాలి. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో పార్టీ అనే తేడా లేకుండా ప్రోటోకాల్ ఉన్న నాయకులను స్వాగతించడం అనేది రాజకీయ నాయకుల కనీస లక్షణం అన్నారు. ఇవేవి తెలియకుండా మంత్రి రాజకీయంలో ఉండడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రోటోకాల్ లేని పోలీస్ అధికారి విశ్వప్రసాద్, శ్యామ్ నాయక్తో అధికారిక కార్యక్రమంలో రిబ్బెన్ కట్ చేయించడం సిగ్గు చేటన్నారు. అధికారం ఉందని విర్రవీగితే చూస్తూ ఊరుకోమన్నారు. నిబంధనలు ఉల్లంఘించే అధికారుల భరతం పడుతామన్నారు.

## తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా
# మాజీ ఐఏఎస్ కేఎస్ శ్రీనివాసరాజు



తెలంగాణ బ్యూరోప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా మాజీ ఐఏఎస్ అధికారి కేఎస్ శ్రీనివాసరాజు నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారుగా శ్రీనివాసరాజు నియామకం అయ్యారు. తిరుమల తిరుపతి దేవస్థానం జేఈవోగా సుదీర్ఘకాలంగా పనిచేసిన కేఎస్ శ్రీనివాసరాజు వీఆర్ఎస్ తీసుకున్న సంగతి తెలిసిందే. ఏపీ ఐఏఎస్ క్యాడర్లో 2001 బ్యాచ్కు చెందిన ఆయన 2011లో వైజాగ్ డిప్యూటీ కమిషనర్గా ఉన్న సమయంలో టీటీడీ జేఈవోగా నియమితులయ్యారు. ఏప్రిల్ 20వ తేదీన జేఈవోగా బాధ్యతలు తీసుకుని 2019 జూన్ వరకు ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ఎనిమిదేళ్ల రెండు నెలలపాటు పనిచేశారు. నల్లారి కిరణ్కుమార్రెడ్డి, చంద్రబాబు నాయుడు ప్రభుత్వాల్లో జేఈవోగా విధులు నిర్వహించి, టీటీడీలో తనదైన ముద్ర వేశారు. అయితే జగన్ ప్రభుత్వం వచ్చాక ఆయన ఇంటర్ కేడర్పై తెలంగాణ రాష్ట్రానికి వచ్చారు. తెలంగాణ నాలుగేండ్ల పాటు రహదారులు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. మార్చి నెలతో డిప్యుటేషన్ గడువు ముగియడంతో పొడిగింపునకు క్యాట్ను ఆశ్రయించారు.

అనుమతి రాకపోవడంతో ఏపీకి రాక తప్పలేదు. గత మే నెలలో ఏపీ సీఎస్కు రిపోర్టు చేశారు. టీటీడీ ఈవోగా వచ్చేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేసినా కూటమి ప్రభుత్వం శ్యామలరావును ఈవోగా నియమించింది. దీంతో ఈనెల 19వ తేదీన శ్రీనివాసరాజు వీఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో గత వారం ఆమోదం తెలుపుతూ ఏపీ ప్రభుత్వ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులను గుర్తించడం లేదు

బిజెపి గిరిజన మోర్చ నాయకులు అమర్ సింగ్ పవార్



తెలంగాణ బ్యూరో ప్రతినిధిః తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ప్రజా ప్రతినిధులను గుర్తించడం లేదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర గిరిజన మోర్చా నాయకులు అమర్ సింగ్ పవార్ ఆరోపించారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమర్ సింగ్ పవర్ మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో జరిగిన విధంగానే రాష్ట్రంలో రేవంత్ రెడ్డి (కాంగ్రెస్) ప్రభుత్వం కూడా ఎస్సీ ఎస్టీ ప్రజా ప్రతినిధులను అగౌరవ పరుస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్‌కు అధికార లాంచనాలతో అంత్యక్రియలు చేయకపోవడం ఎందుకు నిదర్శనం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధమైన చర్యలకు పాల్పడుతుందని ప్రశ్నించారు. రాజకీయాల్లో అన్ని వర్గాలను సమానంగా చూడాలని లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు సరైన విధంగా బుద్ధి చెబుతారని ఈ సందర్భంగా తెలిపారు. ఎస్సీ ఎస్టీల పట్ల పక్షపాత ధోరణిని భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు అమర్ సింగ్ పవర్ తెలిపారు.

# రాజ్‌భవన్ ముట్టడికి విద్యార్థి సంఘాల యత్నం

## తీవ్ర ఉద్రిక్తత.. అడ్డుకున్న పోలీసులు

తెలంగాణ బ్యూరోప్రతినిధిః విద్యార్థి, యువజన సంఘాల నేతల రాజ్భవన్ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, ఎన్టీఏను రద్దు చేయాలని కోరుతూ విద్యార్థి, యువజన ఐక్య కమిటీ ఆధ్వర్యంలో గవర్నర్ అపాయింట్మెంట్ కోరారు. అయితే అపాయింట్మెంట్ ఇచ్చేందుకు గవర్నర్ నిరాకరించడంతో రాజ్భవన్ ముట్టడికి నేతలు బయలు దేరారు. పీపుల్స్ ప్లాజా నుంచి రాజభవన్ వరకు ర్యాలీగా బయలుదేరిన విద్యార్థి సంఘాల నేతలను ఐమ్యాక్స్ సర్కిల్ వద్ద ఉన్న ఇందిరా గాంధీ విగ్రహం వద్ద పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. వెంటనే వారిని గోషామహల్ పోలీస్ గ్రౌండ్కు తరలించారు. రాజ్భవన్ ముట్టడి కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ సహా ఎన్ఎస్యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్యూ, వీజేఎస్, ఏఐపీఎస్యూ, పీవైసీ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, వైజేఎస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని రుజువైనా కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏ పరీక్షలు రద్దు చేయకుండా మౌనంగా ఉండడం దుర్మార్గమని మండిపడ్డారు. గత 20 రోజుల నుంచి నీట్ విద్యార్థుల పక్షాన అన్ని సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా 70 వేలకు పైగా విద్యార్థులు నీట్ పరీక్ష రాశారన్నారు.

అపాయింట్మెంట్ అడిగినా కిషన్ రెడి స్పందించకపోవడంతో ఆయన ఇంటిని ముట్టడించామని తెలిపారు. స్టూడెంట్ మార్చ్ నిర్వహించామని.. సిగ్నేచర్ కాంపెయిన్ చేశామ నిన్న ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడి చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేశామని చెప్పారు. గవర్నర్కు నీట్ విద్యార్థుల పక్షాన రిప్రెసెంటేషన్ ఇవ్వడానికి అపాయింట్మెంట్ కోరితే ఇవ్వలేదని.. అందుకే రాజ్భవన్ ముట్టడికి బయలుదేరమని వెల్లడించారు. ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద మహా దీక్ష చేస్తామని హెచ్చరించారు. అప్పటికీ స్పందించకపోతే నీట్ కౌన్సిలింగ్ రోజు రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలకు బంద్ పిలుపునిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా ఎన్టీఏను, నీట్ పరీక్షలు రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని బల్మూర్ వెంకట్ స్పష్టం చేశారు.

## నిరుద్యోగులతో
# చెలగాటం ఆడుతున్న రేవంత్ సర్కార్

● బిజెఎల్‌పి లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఎన్నికల సమయంలో దొంగ డిక్లరేషన్ల పేరుతో...అభయ హస్తం హామీల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం మరోసారి తన వక్రబుద్దిని చూపించిందని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. నిరుద్యోగులకు ఇచ్చిన జాబ్ క్యాలండర్ హామీ, జాబ్ నోటిఫికేషన్లు, ప్రోత్సహకాలు ఇలా ఎన్నో హామీలు చెప్పిన ప్రభుత్వం...ఇప్పుడు హామీలు చేయాలని నిరుద్యోగులు అడిగితే...దాడులు చేయించడం సరికాదన్నారు. దీక్ష చేస్తున్న నిరుద్యోగులను కలిసేందుకు ఎవరు వెళ్లకుండా గాంధీ ఆసుపత్రి వద్ద మీడియాకు ఆంక్షలు విధించడమేనా మీరు చెప్పిన ప్రజాపాలనా ? అని ప్రశ్నించారు. నిరుద్యోగ యువతపై కనికరం లేకుండా లాఠీఛార్జ్ చేయించడం అమానుషమన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పటి వరకు భర్తీ చేస్తారో చెప్పాలని మహేశ్వర రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. **రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసిన ముఖ్యమంత్రి :** రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసి రేవంత్ రెడ్డి, ఢిల్లీకి పర్యటనలు చేస్తున్నారని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాసమస్యలు వదిలేసి, ప్రైవేట్ కార్యక్రమాలకు ప్రియారిటీ ఇస్తున్నారన్నారు. ఆ అంటే..ఊ అంటే ఢిల్లీకి వెళ్తూ...తెలంగాణ ఆత్మగౌరవాన్నిఢిల్లీ విధుల్లో తాకట్టుపెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన ఆరు అవినీతి ఆరోపణల మీద ఆధారాలు ఇచ్చామని... ఇందులో ఏ ఒక్క దాని మీద కూడా చర్యలు తీసుకోలేదని మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. సివిల్ సప్లై మంత్రి మీద చేసిన ఆరోపణలకు స్పందించని అసమర్థత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిది అన్నారు. పీడీఎస్ బియ్యాన్ని రీసైకిల్ చేస్తూ, వందల కోట్లు అవినీతి జరుగుతున్నా.. మంత్రికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. ఇదే మంత్రి మరో శాఖను కూడా నిర్వహిస్తున్నారు. ఇరిగేషన్ డిపార్ట్మెంట్ లో జరిగే అవినీతి పై అన్ని ఆధారాలు బయట పెడతానన్నారు. రిటైర్డ్ జడ్జి తో కమిటీ వేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికలకు ముందు వైద్యానికి పెద్దపీట వేస్తామన్న రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి అయిన తర్వాత కార్పొరేట్ ఆసుపత్రులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు.

సూర్య
features@suryaa.com
కలర్స్ LIFE IS A RAINBOW
సూర్య
విజయవాడ
మంగళవారం
2 జూలై 2024




# ప్రజలకు రక్షణ కల్పించేలా మూడు చట్టాలు




## ఎస్ఎంఎస్‌ల ద్వారా సమన్లు జారీ.. ఇంటి వద్ద నుంచే ఆన్లైన్‌లో కంప్లైంట్
## ఎక్కడున్నా జీరో ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసే అవకాశం
## క్రూరమైన నేరాలకు వీడియోగ్రఫీ తప్పనిసరి

**భారతదేశ న్యాయ చరిత్రలో కొత్త అధ్యాయం సోమవారం నుంచి మొదలయ్యాయి. కొత్త నేర న్యాయ చట్టాలు తక్షణం అమల్లోకి రానున్నాయి. దీంతో దాదాపు 150 ఏళ్ల క్రితం బ్రిటీషర్లు అమల్లోకి తెచ్చిన చట్టాలు చరిత్ర పుటల్లో కలిసిపోనున్నాయి. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ) స్థానంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ) అమల్లోకి వస్తాయి. ఇకపై ఈ కొత్త చట్టాల ప్రకారమే తీర్పులు, నేర విచారణ, కేసుల నమోదు, ఫిర్యాదుల నమోదు వంటివన్నీ జరుగుతాయి.**

ఈ కొత్త నేర, న్యాయచట్టాలను జులై 1 నుంచి అమలు చేసేందుకు ఇప్పటికే చాలా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు నోటిఫికేషన్లు విడుదల చేశాయి. అయితే కొన్ని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఇంకా వేచిచూసే ధోరణిలో ఉన్నాయి. కొత్త చట్టాలను అమలు చేయాలంటూ సుప్రీంకోర్టు అన్ని హైకోర్టులకు ఆదేశాలు జారీ చేసింది. భారతీయ న్యాయసంహితలోని సెక్షన్ 106 సబ్ సెక్షన్ 2 అమలును తాత్కాలికంగా నిలిపివేశారు. రాజద్రోహం స్థానంలో దేశద్రోహం అనే కొత్త పదాన్ని చేర్చారు.

### కొత్త చట్టాలపై మూడు కోర్సులు..

కొత్త చట్టాలపై కోర్సులు తీసుకునేలా పోలీసు, జైళ్లు, న్యాయవ్యవస్థ, ఫోరెన్సిక్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మొదలైన అధికారులందరినీ ప్రోత్సహించాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి అన్ని రాష్ట్రాలు, యూటీల ప్రధాన కార్యదర్శులకు జూన్ 6నే లేఖ రాశారు. దీంతో వెంటనే ఆయా విభాగాల అధికారులు కేంద్ర ప్రభుత్వం సూచించిన 'ఐగాట్ కర్మయోగి' పోర్టల్ ద్వారా శిక్షణా కోర్సుల్లో చేరారు. ఇందులో కొత్త నేర, న్యాయ చట్టాలపై మొత్తం 3 కోర్సులు ఉన్నాయి. మొత్తం 3 కోర్సుల్లో 2,17,985 మంది అధికారులు నమోదు చేసుకున్నారు. 3 కోర్సులు ఇప్పటికే పూర్తి చేసిన అధికారుల సంఖ్య 1,53,037. కనీసం 1 కోర్సు పూర్తి చేసిన అధికారుల సంఖ్య 1,87,046.

### మహిళా భద్రతకు పెద్దపీట

కొత్త నేర, న్యాయ చట్టాల ప్రకారం.. క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తయిన 45 రోజుల్లోగా తీర్పు ఇవ్వాలి. మొదటి విచారణ నుంచి 60 రోజులలోపే అభియోగాలను నమోదు చేయాలి. 3 నుంచి 7 ఏళ్లలోపు శిక్ష పడే కేసుల్లో ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. 14 రోజుల్లోనే ఈ కేసును కొలిక్కి తేవాలి. అత్యాచార బాధితుల వాంగ్మూలాన్ని సంరక్షకుల సమక్షంలో మహిళా పోలీసు అధికారి నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ బాధితురాలి వైద్య నివేదికలు ఏడు రోజుల్లోనే సిద్ధం చేయాలి. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో దర్యాప్తును రెండు నెలల్లోనే పూర్తి చేయాలి. బాధితుల వాంగ్మూలాన్ని మహిళా మెజిస్ట్రేట్ ముందు నమోదు చేయాలి. వాళ్లు లేకుంటే మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చాలి. అత్యాచార కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియోల ద్వారా సేకరించి పోలీసులు కేసు నమోదు చేయాలి. అయితే పోక్సో కేసుల్లో బాధితురాళ్ల వాంగ్మూలాలు పోలీసులే కాకుండా మహిళా ప్రభుత్వ అధికారి ఎవరైనా నమోదు చేయొచ్చు. క్రిమినల్ కేసుల విచారణలో ఆలస్యాన్ని నివారించడానికి న్యాయస్థానాలు గరిష్ఠంగా కేవలం రెండు వాయిదాలు మాత్రమే మంజూరు చేయాల్సి ఉంటుంది. సాక్షుల వాంగ్మూలాలు,




ఆడియో, వీడియో సాక్ష్యాలను జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన డిజీ లాకర్లో భద్రపరుస్తారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి తప్పుడు వాగ్దానాలతో సంబంధాలు పెట్టుకునే వారిపై కొత్త చట్టాల్లో కఠిన శిక్షలు ఉన్నాయి.

### పేర్లు మార్చి.. పలు సంస్కరణలు

బ్రిటీష్ కాలం నాటి చట్టాలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు న్యాయం జరగడం లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అభిప్రాయపడ్డారు. కేంద్రం తెచ్చిన 3 కొత్త చట్టాలతో న్యాయం దొరుకుతుందని తెలిపారు. ప్రజల కోసం.. పార్లమెంట్ వీటికి రూపకల్పన చేసిందన్నారు. వలసవాద నేర సామాజిక చట్టాల ముగింపును సూచిస్తాయని తెలిపారు. చట్టాల పేర్లు మాత్రమే మార్చలేదని, వాటిలో ఎన్నో సంస్కరణలు చేశామని చెప్పారు. జస్టిస్ అనేది అంబ్రెల్లా టర్మ్ అని, ఇది.. బాధితుడు, దోషిని ఇద్దరినీ కలుపుతుందని తెలిపారు.

### భారతీయ న్యాయ సంహిత


భారతీయ న్యాయ సంహిత చట్టంలో 358 విభాగాలున్నాయి. దేశంలోని కొత్త క్రిమినల్ కోడ్. దీనిలో 511 సెక్షన్లు ఉన్నాయి. 163 ఏండ్ల పాత ఐపీసీని ఈ కొత్త చట్టం భర్తీ చేయనుంది. అత్యాచారం, ఆర్గనైజేషనల్ క్రైమ్స్, సైబర్ క్రైమ్స్ వంటివి పరిష్కరించేందుకు తీసుకొచ్చిన కొత్త చట్టం.

## ఎవరేమన్నారంటే

"నిజమైన సంస్కరణలు రూపొందించడానికి ఓ మంచి అవకాశం వచ్చింది. దురదృష్టవశాత్తు, పైపై మార్పులతో ఈ కొత్త చట్టాలను తీసుకువచ్చారు. నంబర్లు, కొన్ని పదాలు మినహా 90శాతం ఒకేవిధంగా ఉన్నాయి. న్యాయస్థానాల్లో భారీ స్థాయిలో పెండింగులో ఉన్న కేసుల అంశాన్ని విస్మరించారు" అని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ పేర్కొన్నారు. కింది కోర్టుల్లో మూడున్నర కోట్ల కేసులు, హై కోర్టుల్లో 60లక్షలకు పైగా, సుప్రీం కోర్టులో 75 నుంచి 80వేల కేసులు మరుగునపడిపోయి ఉన్నాయన్నారు.
నేర న్యాయ వ్యవస్థను నవీకరించడంతోపాటు, నిర్ణీత సమయంలో న్యాయం అందించడంలో ఇదో ముందడుగు అని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది అదీశ్ సీ అగర్వాల్ అన్నారు. వాదనలు పూర్తైన 30రోజుల్లోపు, గరిష్ఠంగా 45రోజుల్లో న్యాయమూర్తి తీర్పు ఇవ్వాలని చట్టం చెబుతోందన్నారు.
సీనియర్ అడ్వకేట్, భాజపా ఎంపీ మహేశ్ జెఠ్మలానీ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ చట్టాలు ప్రతి ఒక్కరికోసమనే విషయాన్ని విపక్షాలు అర్థం చేసుకోవడం లేదన్నారు.
కొత్త చట్టాలు దారుణమైనవని కాంగ్రెస్ ఎంపీ, న్యాయవాది మనీశ్ తివారీ పేర్కొన్నారు. నేటి నుంచి రెండు సమాంతర వ్యవస్థలు నడుస్తాయని, జూన్ 30, 2024 అర్ధరాత్రి ముందు నమోదైన కేసులు పాత చట్టం ప్రకారం, ఆ తర్వాత నమోదైనవి కొత్త చట్టాల ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే కోట్ల సంఖ్యలో కేసులు పెండింగులో ఉన్న దృష్ట్యా వీటిపై పూర్తి గందరగోళం ఏర్పడుతుందన్నారు.
సాధారణ పౌరులు, లాయర్లు, దర్యాప్తు సంస్థల్లో వీటితో ఎవరికి ప్రయోజనం ఉంటుందో అర్థం కావడం లేదని మరో న్యాయవాది కామినీ జైశ్వాల్ అన్నారు. వీటిని వైఫల్యంగా అభివర్ణించిన ఆమె.. ప్రభుత్వం వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలన్నారు.
ఈ మూడు చట్టాలు దేశవ్యాప్తంగా కొత్త వివాదానికి దారితీశాయని న్యాయశాఖ మాజీ మంత్రి, సీనియర్ న్యాయవాది అశ్వినీ కుమార్ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నా గణనీయమార్పు రాలేదని ఎంతో మంది అభిప్రాయపడుతున్నారని అన్నారు.తాజా చట్టాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మద్దతు తెలిపింది. అంతేకాకుండా వీటి అమలును వ్యతిరేకిస్తూ ఎటువంటి నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేయవద్దని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిల్స్కు ఇటీవల విజ్ఞప్తి చేసింది.

### ఈ క్రింది పేర్కొనబడినIPC సెక్షన్ల BNS సెక్షన్లగా మార్చడం జరిగింది

1. 302 %IPC R 103 BNS
2. 304(A) IPC R 106 BNS
3. 304(B) IPC R 80 BNS
4. 306 IPC R 108 BNS
5. 307 IPC R 109 BNS
6. 309 IPC R 226 BNS
7. 286 IPC R 287 BNS
8. 294 IPC R 296 BNS
9. 509 IPC R 79 BNS
10. 323 IPC R 115 BNS
11. R/W 34 IPC R 3(5) BNS
12. R/W 149 R R/W 190 BNS
13. 324 IPC R 118(1) BNS
14. 325 IPC R 118(2) BNS15. 326 IPC R 118(3) BNS16. 353 IPC R 121 BNS17. 336 IPC R 125 BNS
18. 337 IPC R 125 BNS(A)
19. 338 IPC R 125 BNS(B)
20. 341 IPC R 126 BNS
21. 353 IPC R 132 BNS
22. 354 IPC R 74 BNS
23. 354(A) IPC R 75 BNS 24. 354(B) IPC R 76 BNS
25. 354(C) IPC R 77 BNS
26. 354(D) IPC R 78 BNS
27. 363 IPC R 139 BNS
28. 376 IPC R 64 BNS
29. 284 IPC R 286 BNS
30. 286 IPC R 288 BNS ( Fine - 5000/-)
31. 290 IPC R 292 BNS Fine -1000/-
32. 294 IPC R 296 BNS
33. 447 IPC R 329 (3) BNS
34. 448 IPC R 329 (4) BNS
35. 392 IPC R 309 BNS
36. 411 IPC R 317 BNS
37. 420 IPC R 318 BNS
38. 382 IPC R 304 BNS
39. 442 IPC R 330 BNS
40. 445 IPC R 330 BNS
41. 447 IPC R 330 BNS
42. 448 IPC R 331 BNS
43. 494 IPC R 82 BNS
44. 498 (A) IPC R 85 BNS
45. 506 IPC R 351 BNS



## కొత్త చట్టాల్లోని కీలక నిబంధనలు ఇవే..

- మైనర్పై సామూహిక లైంగిక దాడికి పాల్పడితే మరణ శిక్ష లేదా జీవిత ఖైదు నిబంధన. పిల్లలను అమ్మడం లేదా కొనడం క్రూరమైన నేరం.
- జీరో ఎఫ్ఐఆర్ విధానంతో ఒక వ్యక్తి పోలీసుస్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఏ స్టేషన్లో అయినా ఫిర్యాదు చేయవచ్చు. దీని ద్వారా ఏదైనా ఘటనను రిపోర్టు చేయడంలో లేదా చట్టపరమైన చర్యలు ప్రారంభించడంలో ఆలస్యాన్ని నివారించొచ్చు.
- ఏదైనా ఘటనను ఒక వ్యక్తి ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు వీలుంది. పోలీసుస్టేషన్కు వ్యక్తిగతంగా వెళ్లాల్సిన అవసరం లేదు. దీని ద్వారా వేగవంతమైన ఫిర్యాదు ద్వారా అదే వేగంతో పోలీసులు తగిన చర్యలు తీసుకొనే వెసులుబాటు ఉంటుంది.
- ఎలక్ట్రానిక్ రూపంలో సమన్లు జారీ చేయవచ్చు. దీని ద్వారా చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు పేపర్ వర్క్ను తగ్గిస్తుంది.
- లైంగిక దాడి బాధితురాలి స్టేట్మెంట్ను ఆమె సంరక్షకురాలు లేదా బంధువు సమక్షంలోనే ఒక మహిళా పోలీసు అధికారి రికార్డు చేయాలి. వారం రోజుల్లోగా వైద్య నివేదిక రావాలి.
- మహిళలపై కొన్ని నేరాలకు సంబంధించి.. బాధితురాలి వాంగ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్ ముందు నమోదు చేయాల్సి ఉంటుంది. వారు లేనిపక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచాలి.

## తెలంగాణలో మొదటి కేసు నమోదు




తెలంగాణ పోలీసులు భారతీయ న్యాయ సంహిత కింద డిజిటల్ సిగ్నేచర్తో మొదటి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్లోని చార్మినార్ పోలీస్ స్టేషన్లో బిఎన్ఎస్ కింద ఎఫ్ఐఆర్ నమోదు కాగా.. తెలంగాణలో నమోదైన మొట్ట మొదటి కేసు ఇదే కావటం గమనార్హం. ఈ విషయాన్ని తెలంగాణ డీజీపీ రవిగుప్తా.. అధికారికంగా వెల్లడించారు. ఈ మేరకు.. బిఎన్ఎస్కింద తెలంగాణ నుంచి మొదటి ఎఫ్ఐఆర్ జారీ చేయబడిందని తెలియజేసేందుకు సంతోషిస్తున్నానంటూ పోలీస్ బాస్ రవిగుప్తా తెలిపారు. నెంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వ్యక్తి పై చార్మినార్ పోలీసులు కేస్ నమోదు చేశారు. కొత్త చట్టాల ప్రకారం ఎఫ్ఐఆర్ను డిజిటల్గా నమోదు చేశారు. ఇదే కాకుండా.. గంటలో వివిధ పోలీస్ స్టేషన్లలో 3 ఎఫ్ఐఆర్లు నమోదైనట్టు సమాచారం.



# జస్‌ప్రీత్ బుమ్రా ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ బౌలర్

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపై ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ ప్రశంసల జల్లు కురిపించాడు. జస్‌ప్రీత్ బుమ్రానే ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ ఫాస్ట్ బౌలరని కొనియాడాడు. బుమ్రా ముందు పాకిస్థాన్ దిగ్గజ పేసర్ వసీం అక్రమ్ కూడా తక్కువేనని అభిప్రాయపడ్డాడు. టీ20 ప్రపంచకప్ 2024లో జస్‌ప్రీత్ బుమ్రా సంచలన బౌలింగ్‌తో టీమిండియాను విజేతగా నిలబెట్టిన విషయం తెలిసిందే. సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్లో పొదుపుగా బౌలింగ్ చేయడంతో పాటు కీలక వికెట్లు తీసిన బుమ్రా.. ఈ టోర్నీ అసాంతం అద్భుత ప్రదర్శన కనబర్చాడు. 8 మ్యాచ్లో 8.26 సగటు, 4.17 ఎకానమీతో 15 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అవార్డు అందుకున్నాడు. భారత విజయానంతరం ప్రముఖ క్రికెట్ వెబ్‌సైట్‌తో మాట్లాడిన మైకేల్ వాన్.. బుమ్రాను ఆకాశానికెత్తాడు. 'సౌతాఫ్రికాతో ఫైనల్లో బుమ్రా తీసిన తొలి వికెట్ అద్భుతం. స్టన్నింగ్ డెలివరీతో రీజా హెండ్రిక్స్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. లెగ్ స్టంప్‌పై పడిన బంతి బ్యాటర్‌ను అయోమయానికి గురి చేసి ఆఫ్ స్టంప్‌ను లేపేసింది. మార్కో జాన్సెన్‌ను కూడా తెలివిగా బోల్తా కొట్టించాడు. బుమ్రా బౌలింగ్‌లో దూకుడుగా ఆడేందుకు బ్యాటర్లు భయపడుతారు. బ్యాటర్ల అప్రోచ్ తగ్గట్లు బుమ్రా తన బౌలింగ్‌లో వేరియేషన్స్ మారుస్తాడు. నాకు తెలిసి వైట్ బాల్ క్రికెట్‌లో బుమ్రాకు మించిన బౌలర్ లేడు. బెస్ట్ సీమ్ బౌలర్‌గా వసీం అక్రమ్ పేరు చెబుతారు. కానీ బుమ్రా అతని కంటే గొప్ప బౌలర్. వినూత్నమైన బౌలింగ్ యాక్షన్ బుమ్రా సొంతం. అతని బౌలింగ్‌లో పేస్‌తో పాటు వేరియేషన్స్ ఉన్నాయి. ముఖ్యంగా తీవ్ర ఒత్తిడిలోనూ ఎలాంటి తడబాటు లేకుండా సమర్థవంతంగా బౌలింగ్ చేసే నైపుణ్యం బుమ్రా సొంతం. ప్రపంచకప్‌లోనే కాదు. ప్రతీ మ్యాచ్‌లోనూ బుమ్రా ఇదే తరహా బౌలింగ్‌తో సత్తా చాటుతాడు.'అని మైకేల్ వాన్ చెప్పుకొచ్చాడు.

## మళ్లీ భారత్ చేతిలో

# సౌతాఫ్రికా ఓటమి





టీమిండియా టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన శుభ సందర్భమో ఏమో కానీ భారత మహిళా క్రికెటర్లు సైతం అద్భుత విజయం సాధించారు. భారత పురుషుల టీమ్ టీ20 ప్రపంచకప్ ఫైనల్లో సౌతాఫ్రికాను మట్టికరిపించి రెండోసారి టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడిది. అదే సౌతాఫ్రికాతోనే జరిగిన ఏకైక టెస్ట్‌లో భారత మహిళలు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. రెండు రోజుల వ్యవధిలో భారత అభిమానులకు డబుల్ ధమాకా దక్కగా.. సఫారీలకు మాత్రం కోలుకోలేని దెబ్బ తగిలింది. చెన్నై వేదికగా సోమవారం ముగిసిన ఏకైక టెస్టో 37 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆడిన టీమిండియా 9.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా లక్ష్యాన్ని చేధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత మహిళల టీమ్.. తొలి ఇన్నింగ్స్‌లో 603/6 పరుగుల భారీ స్కోర్ వద్ద డిక్లెర్ చేసింది.

ఓపెనర్ షెఫాలీ వర్మ(197 బంతుల్లో 23 ఫోర్లు, 8 సిక్స్‌లతో 205) డబుల్ సెంచరీతో చెలరేగగా.. స్మృతి మంధాన(161 బంతుల్లో 27 ఫోర్లు, సిక్స్‌తో 149) శతక్కొట్టింది. హర్మన్ ప్రీత్ కౌర్(69), జెమీమా రోడ్రిగ్స్(55), రిచా ఘోష్(86) హాఫ్ సెంచరీలతో రాణించారు.

అనంతరం సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 266 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా(8/77) సఫారీ పతనాన్ని శాసించింది. దీప్తి శర్మకు రెండు వికెట్లు దక్కాయి.

337 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌతాఫ్రికా 373 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ లౌరా వాల్వార్డ్(122), సునె లుస్(109) సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా, దీప్తి శర్మ, రాజశ్వేరి గైక్వాడ్ రెండేసి వికెట్లు తీయగా.. పూజా వస్త్రాకర్, షెఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్ తలో వికెట్ తీసారు.

## ప్రపంచ కప్‌తో నా ఇద్దరు కొడుకులు

### రోహిత్ శర్మ తల్లి పోస్ట్ వైరల్!



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తల్లి పూర్ణిమ సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన ఓ పోస్ట్ వైరల్‌గా మారింది. టీమిండియా టీ20 ప్రపంచకప్ 2024 విజయాన్ని ఉద్దేశిస్తూ ఆమె ఈ పోస్ట్ షేర్ చేసింది. ఈ పోస్ట్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ప్రపంచకప్‌తో ఉన్న ఫొటోను జత చేసింది. విరాట్ కోహ్లీని తన రెండో కొడుకుగా అభివర్ణించిన రోహిత్ శర్మ తల్లి.. ఈ ఇద్దరిని టీ20 దిగ్గజాలుగా పేర్కొంది. శనివారం సౌతాఫ్రికాతో ఉత్కంఠగా సాగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా 7 వికెట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ గెలుపుతో 11 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత టీమిండియా ఐసీసీ టైటిల్ గెలిచింది. ముఖ్యంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ సంయుక్తంగా గెలిచిన మొదటి ఐసీసీ టైటిల్ ఇదే. ఈ విజయానంతరం విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇండియన్ ఫ్లాగ్‌ను భుజాలపై వేసుకొని టీ20 ప్రపంచకప్ ఫొటోకు ఫోజిచ్చారు. ఈ ఫొటోలో రోహిత్ శర్మ భుజాలపై అతని కూతురు సమైరా కూడా ఉంది. ఈ ఫొటోనే పంచుకున్న రోహిత్ శర్మ తల్లి పూర్ణిమా.. తనదైన శైలిలో క్యాప్షన్ ఇచ్చింది. 'ప్రపంచకప్ ట్రోఫీతో టీ20 క్రికెట్ దిగ్గజాలు. రోహిత్ భుజాలపై అతని కూతురు.. వెనుకాల జాతీయ పతాకం, పక్కన అతని సోదరుడు'అని క్యాప్షన్ ఇచ్చింది. ఈ పోస్ట్‌కు అటు రోహిత్.. ఇటు కోహ్లీ ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. అమ్మ చెప్పినట్లు ఈ ఇద్దరూ సోదరులేనని కామెంట్ చేస్తున్నారు. మరికొందరు టీమిండియాకు ప్రపంచకప్ అందించిన బ్రదర్స్ అంటూ ఈ ఫొటోకు క్యాప్షన్ ఇస్తున్నారు. సౌతాఫ్రికాతో ఫైనల్లో రోహిత్ శర్మ విఫలమవ్వగా.. విరాట్ కోహ్లీ(76) తన క్లాస్ ఇన్నింగ్స్‌తో జట్టుకు భారీ స్కోర్ అందించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. ఈ ప్రపంచకప్ విజయం నేపథ్యంలో ఈ ఇద్దరు దిగ్గజాలు అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికారు. ఇంతకు మించిన మంచి సమయం లేదని స్పష్టం చేశారు.

## భారత జట్టు నుంచి ఆ అయిదుగురిని తప్పించే యోచనలో బీసీసీఐ



టీ20 వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా జింబాబ్వే పర్యటనకు సిద్ధమైంది. జులై 6వ తేదీ నుంచి జింబాబ్వేతో భారత్ అయిదు టీ20ల సిరీస్ ఆడనుంది. భవిష్యత్ స్టార్లను సిద్ధం చేయాలనే ఉద్దేశంతో ఈ పర్యటనకు సీనియర్ ఆటగాళ్లకు సెలక్టర్లు విశ్రాంతిని ఇచ్చారు. టీ20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేయడంతో పాటు బెంచ్ బలాన్ని మరింత పెంచుకోవాలనే ఉద్దేశంతో యువ ఆటగాళ్లను జింబాబ్వే పర్యటనకు ఎంపిక చేశారు. ఈ యువ టీమ్‌ను శుభ్‌మన్ గిల్ నడిపించనున్నాడు. హరారే వేదికగా శనివారం తొలి టీ20 మ్యాచ్ జరనుంది. ఆదివారం రెండో మ్యాచ్, జులై 10, జులై 13, జులై 14వ తేదీల్లో చివరి మూడు టీ20లు జరగనున్నాయి. అయితే జింబాబ్వే పర్యటనకు ఎంపిక చేసిన జట్టు నుంచి యశస్వీ జైస్వాల్, సంజు శాంసన్, శివమ్ దూబె, ఖలీల్ అహ్మద్,రింకూ సింగ్ ఆటగాళ్లను తప్పించే యోచనలో బీసీసీఐ ఉంది. ఈ అయిదుగురు ఆటగాళ్లు ప్రస్తుతం వెస్టిండీస్‌లోనే ఉన్నారు. దూబె, సంజు శాంసన్, జైస్వాల్ ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుతో ఉండగా, రింకూ, ఖలీల్ రిజర్వ్ ప్లేయర్లుగా టీమిండియాతోనే ఉన్నారు. కాగా, ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇచ్చిన వెస్టిండీస్‌లో తుఫాను పంజా విసురుతోంది. ఫైనల్ జరిగిన బార్బడోస్‌తో పాటు సెయింట్ లూసియా, గ్రెనడా, సెయింట్ విన్సెంట్ దీవులపై హరికేన్ ప్రతాపం చూపుతోంది. ఈ నేపథ్యంలో అక్కడ విమాన రాకపోకలు స్థంభించాయి. దీంతో భారత జట్టుతో ఉన్న ఈ అయిదుగురు ఆటగాళ్లు స్వదేశానికి రావడానికి మరింత ఆలస్యమయ్యేలా ఉంది. అంతేగాక వరుస ప్రయాణాలతో ఆటగాళ్లు అలసిపోతారని బీసీసీఐ భావిస్తోంది. దీంతో జైస్వాల్, శాంసన్, దూబె, ఖలీల్,రింకూలను జింబాబ్వే పర్యటన నుంచి తప్పించి ఇతర ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని యోచిస్తోంది.

జింబాబ్వే పర్యటనకు ఎంపికైన భారత జట్టు:
శుభ్మన్ గిల్(కెప్టెన్), యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, రింకూ సింగ్, సంజూ శాంసన్(కీపర్), ధ్రువ్ జురెల్, శివమ్ దూబే, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, ఆవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముఖేష్ కుమార్, తుషార్ దేశ్పాండే.

## కంగ్రాట్స్.. ద్రవిడ్ మొత్తానికి సాధించావ్: గ్రేగ్ ఛాపెల్




టీ20 ప్రపంచకప్ 2024లో టీమిండియా విజేతగా నిలవడంపై ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం గ్రేగ్ ఛాపెల్ సంతోషం వ్యక్తం చేశాడు. టీమిండియా హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ ప్రపంచకప్ అందుకోవడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని చెప్పాడు. 17 ఏళ్ల క్రితం ఇదే వెస్టిండీస్ గడ్డపై జరిగిన వన్డే ప్రపంచకప్ 2007లో రాహుల్ ద్రవిడ్ సారథ్యంలోని టీమిండియా గ్రూప్ దశలోనే ఇంటిదారి పట్టింది. పసికూన బంగ్లాదేశ్ చేతిలో ద్రవిడ్ సేన ఓటమిపాలైంది. ఆ జట్టుకు గ్రేగ్ ఛాపెల్ కోచ్గా వ్యవహరించాడు. ఈ ఓటమితోనే అతని వివాదాస్పద కోచింగ్ కెరీర్ ముగిసింది. భారత క్రికెట్ చరిత్రలోనే గ్రేగ్ ఛాపెల్ అత్యంత వివాదాస్పదమైన కోచ్గా నిలిచిపోయాడు. భారత జట్టును నాశనం చేయడానికే గ్రేగ్ ఛాపెల్ టీమిండియా హెడ్ కోచ్ బాధ్యతలు చేపట్టాడని అప్పట్లో అతనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే జట్టులోని రాజకీయాలను ప్రశ్నించడంతో పాటు సీనియర్ ఆటగాళ్లను తప్పించి అపార నైపుణ్యం కలిగిన రాహుల్ ద్రవిడ్‌ను కెప్టెన్ చేయడాన్ని సహించలేకపోయారని కొందరు క్రికెట్ అభిమానులు ఇప్పటికీ చెప్పే మాట.రాహుల్ ద్రవిడ్‌కు సారథ్య బాధ్యతలు ఇవ్వడం నచ్చక కొందరు సీనియర్ ఆటగాళ్లు అతనికి సహకరించలేదని, దాంతో టీమిండియాకు ఘోర పరాజయాలు ఎదురయ్యాయని ఛాపెల్‌ను వెనకేసుకొచ్చేవారున్నారు. 2007 వన్డే ప్రపంచకప్‌తో పాటు అంతకుముందు భారత్ వేదికగా జరిగిన 2006 ఛాంపియన్స్ ట్రోఫీలోనూ రాహుల్ ద్రవిడ్ సారథ్యంలోనే టీమిండియా గ్రూప్ దశలోనే వెనుదిరిగింది. ఈ పరాజయాలతో గ్రేగ్ ఛాపెల్‌పై బీసీసీఐ వేటు వేసింది. ఆ తర్వాత కొన్నేళ్లకే రాహుల్ ద్రవిడ్ జట్టుకు దూరమయ్యాడు. 2011 వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్టులోనూ రాహుల్ ద్రవిడ్ లేడు.

దాంతో ఐసీసీ టైటిల్ లేకుండానే రాహుల్ ద్రవిడ్ కెరీర్ ముగిసింది. అనంతరం టీమిండియా హెడ్ కోచ్‌గా కెరీర్ ప్రారంభించిన రాహుల్ ద్రవిడ్ ఎట్టకేలకు ప్రపంచకప్‌ను ముద్దాడాడు. 2023 ఛాంపియన్స్ ట్రోఫీ, వన్డే ప్రపంచకప్ 2023 టైటిళ్లు తృటిలో చేజారినా.. ప్రపంచకప్ గెలిచి తన ముచ్చట తీర్చుకున్నాడు. ఈ క్రమంలోనే రాహుల్ ద్రవిడ్‌కు గ్రేగ్ ఛాపెల్ అభినందనలు తెలిపాడు. 'టీ20 ప్రపంచకప్ గెలిచిన టీమిండియా అభినందనలు. మరీ ముఖ్యంగా ఈ విజయంలో రాహుల్ ద్రవిడ్ భాగమవ్వడం నాకు సంతోషాన్నిచ్చింది.

జట్టుతో తన ప్రయాణాన్ని రాహుల్ ద్రవిడ్ అద్భుతంగా ముగించాడు. కొన్నేళ్ల క్రితం మేం ఇద్దరం కలిసి ఈ విజయాన్ని అందుకోవాలని భావించాం. కానీ కుదరలేదు. మొత్తానికి రాహుల్ ద్రవిడ్ తన ముచ్చట తీర్చుకున్నాడు.'అని గ్రేగ్ ఛాపెల్ ఆసీస్ మీడియాతో అన్నాడు. గ్రేగ్ ఛాపెల్ సౌరవ్ గంగూలీని కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించడం అత్యంత వివాదాస్పదమైంది.

### రిటైర్మెంట్ ప్రకటించడానికి ఇంతకు మించిన

# మంచి సమయం లేదనిపించింది



టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికాడు. ముందుగా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన నిర్ణయాన్ని వెల్లడించగా.. అతన్ని అనుసరిస్తూ రోహిత్ శర్మ కూడా టీ20ల నుంచి తప్పుకుంటున్నట్లు మీడియా సమావేశంలో ప్రకటించాడు. వాస్తవానికి తాను టీ20 క్రికెట్ నుంచి తప్పుకోవాలనే ఆలోచనే చేయలేదని రోహిత్ శర్మ తెలిపాడు. పరిస్థితులు డిమాండ్ చేయడంతోనే అప్పటికప్పుడు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని స్పష్టం చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్గా మారింది.సౌతాఫ్రికాతో శనివారం ఉత్కంఠగా సాగిన టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్లో టీమిండియా 7 వికెట్ల తేడాతో గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ విజయంతో 11 ఏళ్ల తర్వాత టీమిండియా ఐసీసీ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయానంతరం రోహిత్ శర్మ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశాడు. ఈ సందర్భంగా తన రిటైర్మెంట్‌కు గల కారణాన్ని వెల్లడించాడు. టీ20 ప్రపంచకప్ గెలిచినా.. పొట్టి ఫార్మాట్‌లో కొనసాగాలనుకున్నానని, కానీ రిటైర్మెంట్ ప్రకటించడానికి ఇంతకు మించిన మంచి సమయం లేదనిపించిందన్నాడు. 'అంతర్జాతీయ టీ20ల నుంచి తప్పుకోవాలనే ఆలోచనే నాకు లేదు. కానీ పరిస్థితులు ఆ నిర్ణయం తీసుకునేలా చేశాయి. రిటైర్మెంట్ ప్రకటించడానికి ఇదే మంచి సమయమనిపించింది. ప్రపంచకప్ గెలిచిన సందర్భం కంటే గొప్ప సమయం ఏం ఉంటుంది. అందుకే టీ20లకు వీడ్కోలు పలికాను.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు. అంతర్జాతీయ టీ20లకు దూరమైనా.. ఐపీఎల్‌లో కొనసాగుతానని హిట్ మ్యాన్ స్పష్టం చేశాడు.

**ఈ ఫార్మాట్‌ను ఆస్వాదించాను..** ఇక అంతకుముందు మీడియా సమావేశంలో రోహిత్ శర్మ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. 'భారత్ తరఫున ఇదే నా చివరి టీ20 మ్యాచ్. నిజాయితీగా చెబుతున్నా ఈ ఫార్మాట్ ఆడుతున్నప్పటి నుంచి ఆటను చాలా ఆస్వాదించాను.

ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికేందుకు ఇంతకు మించిన మంచి సమయం లేదు. నా టీ20 కెరీర్‌లో ప్రతీ మూమెంట్‌ను ఆస్వాదించాను. ఈ ఫార్మాట్‌తోనే టీమిండియా తరఫున నా అంతర్జాతీయ కెరీర్ మొదలైంది. ప్రపంచకప్ గెలవాలనుకున్నాను. గెలిచాను కాబట్టి గుడ్ బై చెబుతున్నాను.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

# ఆ అవార్డుకు కోహ్లీ అనర్హుడు

### ఓడితే విలన్ అయ్యేవాడు: సంజయ్ మంజ్రేకర్

టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి ఇవ్వడాన్ని మాజీ క్రికెటర్, కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ తప్పుబట్టాడు. ఈ అవార్డుకు కోహ్లీ అనర్హుడని అభిప్రాయపడ్డాడు. అసలు ఈ మ్యాచ్ ఉత్కంఠగా మారడానికి కోహ్లీ జిడ్డు బ్యాటింగే కారణమని అభిప్రాయపడ్డాడు. అతని స్లో బ్యాటింగ్తోనే హార్దిక్ పాండ్యా వంటి బిగ్ హిట్టర్కు బ్యాటింగ్ చేసే అవకాశం దక్కలేదన్నాడు. ఈ మ్యాచ్లో విరాట్ కోహ్లీని బౌలర్లే కాపాడారని తెలిపాడు. ఫైనల్లో టీమిండియా ఓడిపోయి ఉంటే విరాట్ కోహ్లీ తీవ్ర విమర్శలు ఎదుర్కొనేవాడని, విలన్లా చూసేవారని చెప్పుకొచ్చాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ కోహ్లీకి బదులు బౌలర్లకు ఇవ్వాల్సిందని సంజయ్ మంజ్రేకర్ అభిప్రాయపడ్డాడు. సౌతాఫ్రికాతో గత శనివారం(జూన్ 29) ఉత్కంఠగా సాగిన ఫైనల్లో టీమిండియా 7 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాప్-3 బ్యాటర్లు విఫలమైన వేళ అక్షర్ పటేల్‌తో కలిసి విరాట్ కోహ్లీ జట్టును ఆదుకున్నాడు. కాస్త నెమ్మదిగా ఆడిన కోహ్లీ 76 పరుగులతో జట్టుకు పోరాడే లక్ష్యాన్ని అందించాడు. క్రీజులో చివరి వరకు ఉండాలని టీమ్‌మేనేజ్‌మెంట్ ఆదేశించడంతోనే కోహ్లీ అలా స్లోగా బ్యాటింగ్ చేశాడని మ్యాచ్ అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. హాఫ్ సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన విరాట్ కోహ్లీకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది.బౌలర్లే గెలిపించారు..అయితే ఈ నిర్ణయాన్ని సంజయ్ మంజ్రేకర్ తప్పుబట్టాడు. 'టీమిండియా బ్యాటింగ్ బాగుంది. కానీ కోహ్లీ నెమ్మదైన బ్యాటింగ్ వల్లే టీమిండియా ఉత్కంఠ పరిస్థితులను ఎదుర్కొంది. బౌలర్లే అతన్ని కాపాడారు. నా అభిప్రాయం ప్రకారం ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ బౌలర్కు ఇవ్వాల్సింది. ఎందుకంటే వాళ్లే టీమిండియాను గెలిపించారు. కోహ్లీ స్లో బ్యాటింగ్ కారణంగా బిగ్ హిట్టర్ అయిన హార్దిక్ పాండ్యాకు రెండు బంతులు మాత్రమే ఆడాల్సి వచ్చింది. ఈ మ్యాచ్లో టీమిండియా ఓడిపోతే విరాట్ కోహ్లీ తీవ్ర విమర్శలు ఎదుర్కొనేవాడు'అని జడేజా చెప్పుకొచ్చాడు. అయితే ఈ వ్యాఖ్యలను జింబాబ్వే మాజీ క్రికెటర్ ఆండీ ఫ్లవర్ తప్పుబట్టాడు. టీమిండియా నమోదు చేసిన 176 పరుగుల లక్ష్యం చాలా పెద్దదని చెప్పుకొచ్చాడు. కోహ్లీ రాణించకుంటే టీమిండియా ఆ స్కోర్ చేసేది కాదన్నాడు.

## రుతురాజ్ గైక్వాడ్,

# నితీష్ కుమార్ రెడ్డికి నిరాశే

### జింబాబ్వేతో తొలి టీ20 ఆడే భారత తుది జట్టు ఇదే!





టీ20 ప్రపంచకప్ 2024లో విజేతగా నిలిచిన టీమిండియా జింబాబ్వే పర్యటనకు సిద్ధమైంది. ఈ టూర్‌తోనే టీ20ల్లో టీమిండియా కొత్త శకం ప్రారంభం కానుంది. 11 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ టీమిండియాకు ఐసీసీ టైటిల్ అందించిన కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో పాటు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ధనాధన్ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పటికే జింబాబ్వే పర్యటనకు బీసీసీఐ 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. ఈ పర్యటన నుంచి ప్రపంచకప్ ఆడిన సీనియర్ ఆటగాళ్లందరికి విశ్రాంతినిచ్చింది. ఈ పర్యటనకు శుభ్మన్ గిల్ను సారథిగా ఎంపిక చేసిన టీమిండియా.. ప్రపంచకప్ జట్టులో ఉన్న సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్, శివమ్ దూబేలతో పాటు రిజర్వ్ ప్లేయర్గా ఉన్న రింకూ సింగ్ను కూడా జట్టులోకి తీసుకుంది.

ఐపీఎల్‌లో సత్తాచాటిన రియాన్ పరాగ్, రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మలకు కూడా ఈ జట్టులో చోటు దక్కింది. తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి కూడా ఎంపికయ్యాడు. కానీ చివరి నిమిషంలో గాయంతో తప్పుకోగా.. శివమ్ దూబేతో అతని స్థానాన్ని భర్తీ చేశారు. ఈ ఐదు టీ20ల సిరీస్‌లో తొలి మ్యాచ్ శనివారం(జూలై 6) జరగనుంది. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగే తుది జట్టుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎన్‌సీఏ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ పర్యటనలో టీమిండియాకు హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్‌లు ఓపెనింగ్ చేసే అవకాశం ఉంది. ఐపీఎల్‌లో సంచలన ప్రదర్శన కనబర్చిన అభిషేక్ శర్మ ఫస్ట్‌డౌన్‌లో ఆడవచ్చు. రుతురాజ్ గైక్వాడ్ బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశాలు ఉన్నాయి. వికెట్ కీపర్‌గా సంజూ శాంసన్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయవచ్చు. పేస్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే ఐదో స్థానంలో ఆడనుండగా.. రింకూ సింగ్ ఆరో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. స్పిన్ ఆల్‌రౌండర్లుగా వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్‌లు బరిలోకి దిగనుండగా.. ఆవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముఖేష్ కుమార్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. ఐపీఎల్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన రియాన్ పరాగ్‌తో పాటు ధ్రువ్ జురెల్, తుషార్ దేశ్‌పాండేలు కూడా బెంచ్‌కు పరిమితం కానున్నారు.

**జింబాబ్వేతో తొలి టీ20కి భారత తుది జట్టు(అంచనా)**

యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్(కెప్టెన్), సంజూ శాంసన్(కీపర్), రియాన్ పరాగ్, శివమ్ దూబే, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, ఆవేష్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముఖేష్ కుమార్.

జింబాబ్వే పర్యటనకు ఎంపికైన భారత జట్టు:
శుభ్‌మన్ గిల్(కెప్టెన్), యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, రింకూ సింగ్, సంజూ శాంసన్(కీపర్), ధ్రువ్ జురెల్, శివమ్ దూబే, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, ఆవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముఖేష్ కుమార్, తుషార్ దేశ్‌పాండే.

# సూర్య సినిమా

## బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నూతన చిత్రం ప్రారంభం



షైన్ స్క్రీన్స్ 8వ చిత్రం, 'చావు కబురు చల్లగా' ఫేమ్ కౌశిక్ పెగళ్లపాటి డైరెక్టర్‌గా అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఘనంగా పూజా కార్యక్రమాలతో అఫీషియల్‌గా ప్రారంభమైయింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత నవీన్ యెర్నేని క్లాప్ కొట్టగా, నిర్మాత దిల్ రాజు కెమెరా స్విచాన్ చేశారు. సతీష్ కిలారు, అన్మోల్ శర్మ స్క్రిప్ట్ హ్యాండోవర్ చేశారు. డిఫరెంట్ వరల్డ్, యూనిక్ ప్రిమైజ్‌లో సెట్ చేయబడిన ఈ హారర్-మిస్టరీ మూవీ ఇప్పటికే ఆసక్తికరమైన ఫస్ట్ లుక్‌తో సంచలనం సృష్టించింది. ఈ మూవీలో యాక్షన్-హల్క్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్, ఎవర్ ఛార్మింగ్ అనుపమ పరమేశ్వరన్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు, ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ గ్రిప్పింగ్ నెరేటివ్ అందించబోతున్నారు. ఇద్దరు యాక్టర్స్ తమ కెరీర్‌లో ఇంతకు ముందెన్నడూ పోషించని పాత్రలతో సినిమాపై ఎక్సయిట్మెంట్ ని పెంచుతున్నారు. రెగ్యులర్ షూటింగ్ జూలై 11న ప్రారంభమై శరవేగంగా సాగనుంది.

## ఘనంగా ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్




విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, పద్మశ్రీ డాక్టర్. నందమూరి . తారకరామారావు గారి పేరిట సినిమా రంగంలో అన్ని విభాగాలలో ప్రఖ్యాతి గాంచిన సినీ నటి నటులకు "కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్" 2023, హైదరాబాద్‌లోని హొటల్ "దసపల్లా"లో నందు అవార్డుల ప్రధానోత్సవం అతి రధమహారథుల సమక్షంలో జరిగింది. "కళావేదిక" ఆర్.వి..రమణ మూర్తి గారు, " రాఘవి మీడియా" ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహింపబడింది. ముందుగా ఈ కార్యక్రమాన్ని విఘ్నేశ్వరుడికి పూజ చేసి దీపం వెలిగించి ఎన్టీఆర్‌గారి పాటలతో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందమూరి మోహన్ కృష్ణ గారు, నందమూరి మోహన రూపగారు, మురళి మోహన్‌గారు, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షులు శ్రీ కే. ఎల్. దామోదర్ ప్రసాద్‌గారు, కార్యదర్శి శ్రీ టి. ప్రసన్నకుమార్‌గారు, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ మాదాలరవిగారు మరియు కొంతమంది ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీమోహన్ గారు మాట్లాడుతూ : ఎన్టీఆర్‌గారి పేరు పైన అవార్డ్స్ పెట్టడం చాలా ఆనందకర విషయం. ప్రజలకు సేవ చేయడం కోసం పార్టీ పెట్టి 9 నెలల్లో ఘనవిజయాన్ని అందుకున్న నాయకుడు కూడా ఎన్టీఆర్. రెండు రూపాయలకే కిలో బియ్యం అదేవిధంగా పేదలకు ఉత్తమ చికిత్స అందించడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఇందిరాగాంధీని ఎదుర్కొన్న ఏకైక మగాడు మన తెలుగోడు ఎన్టీఆర్ గారు అన్నారు.

### బెస్ట్ ప్రొడ్యూసర్ అవార్డు అందుకున్న నిర్మాత గౌరీ కృష్ణ



విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారకరామారావు పేరిట సినిమా రంగంలో అన్ని విభాగాలలో ప్రఖ్యాతి గాంచిన సినీ నటీ నటులకు "కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్" కార్యక్రమం హైదరాబాద్‌లోని ఘనంగా జరిగింది. ఆర్వీ రమణ మూర్తి, రాఘవి మీడియా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నందమూరి మోహన్ కృష్ణ, నందమూరి మోహన రూప, మురళి మోహన్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షులు దామోదర్ ప్రసాద్, ప్రసన్నకుమార్, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి విజేతలకు అవార్డులను అందజేశారు. అవార్డు అందుకున్న వారిలో 'మా ఊరి పొలిమేర2' చిత్రానికిగాను బెస్ట్ ప్రొడ్యూసర్‌గా స్పెషల్ జ్యూరీ అవార్డును నిర్మాత గౌరీ కృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్మాత గౌరీ కృష్ణ మాట్లాడుతూ 'బెస్ట్ ప్రొడ్యూసర్‌గా ఇంతటీ ప్రెస్టీజీయస్ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది.

## ది బర్త్‌డే బాయ్ టీజర్



ప్రస్తుతం ప్రేక్షకుల అభిరుచి మారింది. కొత్తదనంతో కూడిన న్యూ ఏజ్ సినిమాలకు వాళ్లు పట్టం కడుతున్నారు. అందుకే దర్శకులు కూడా వారి పల్స్‌ను పట్టుకుని విభిన్నమైన కథలతో, వైవిధ్యమైన సినిమాలను తెరకెక్కిస్తున్నారు. తాజాగా అదే కోవలో మరో విభిన్నమైన ఎంటర్‌టైనర్ రాబోతుంది. రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్ కనకాల ముఖ్యపాత్రల్లో నటిస్తున్న చిత్రం ది బర్త్‌డే బాయ్. బొమ్మ బొరుసా పతాకంపై నిర్మాణం జరుపుకుం టున్న ఈ చిత్రానికి విస్కి దర్శకుడు. జూలై 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం టీజర్‌ను ప్రముఖ దర్శకుడు మోహర్ రమేష్ విడుదల చేశారు. టీవీలో స్నేహితులు బాలుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఓపెన్ అయిన టీజర్, ఆ తరువాత పలు ఎంటర్‌టైనింగ్ సన్నివేశాలతో కొనసాగుతుంది. టీజర్ చూస్తుంటే కొత్తదనంతో కూడిన సినిమాలా అనిపిస్తుంది. టీజర్ చూసిన ప్రతి ఒక్కరూ సినిమా చూడాలనే ఉత్సుకతను కలిగించేలా టీజర్ కట్ వుంది. ఈ సందర్భంగాదర్శకుడు చిత్ర విశేషాలను తెలియజేస్తూ ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతి పాత్ర ఎంటర్‌టైన్ చేస్తుంది. ప్రతి పాత్ర, ప్రతి సన్నివేశం కొత్తగా వుంటుంది.

## "మిస్టర్ ఎక్స్" షూటింగ్ పూర్తి

స్టార్ హీరోలు ఆర్య గౌతమ్ కార్తీక్ లీడ్ రోల్స్ లో మను ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియన్ మూవీ "మిస్టర్ ఎక్స్. స్టార్ యాక్టర్ శరత్ కుమార్, నటి మంజు వారియర్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్.లక్ష్మణ్ కుమార్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హై ఆక్టేన్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. షూటింగ్ లాస్ట్ డేని టీం అంతా కలిసి సెలబ్రేట్ చేసుకుంది. ఈ మేరకు స్టిల్స్ ని రిలీజ్ చేశారు మేకర్స్. "మిస్టర్ ఎక్స్" లోని యాక్షన్ సన్నివేశాల్ని భారతదేశం, ఉగాండా, అజర్‌బైజాన్, జార్జియా దేశాల్లో చిత్రీకరించారు. స్టంట్ సిల్వా యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ధిబు నినాన్ థామస్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తుండగా, తన్వీర్ మీర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ప్రసన్న జీకే ఎడిటర్.



## 'డబుల్ ఇస్మార్ట్' సాంగ్




ఉస్తాద్ రామ్ పోతినేనిన్, డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాధ్ 'డబుల్ ఇస్మార్ట్' హైలీ యాంటిసిపేటెడ్ పాన్-ఇండియన్ ప్రాజెక్ట్, మచ్ ఎవైటెడ్ ఇస్మార్ట్ శంకర్ కి సీక్వెల్. పూరి కనెక్ట్స్ బ్యానర్‌లో పూరి జగన్నాధ్, ఛార్మి నిర్మించారు. ఈ సినిమా ఆగస్ట్ 15న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. దేశవ్యాప్తంగా ఈ చిత్రాన్ని దూకుడుగా ప్రమోట్ చేయాలని మేకర్స్ చూస్తున్నారు, టీజర్‌కు సెన్సేషనల్ రెస్పాన్స్ వచ్చిన తర్వాత టీం ఇప్పుడు ఫస్ట్ సింగిల్ స్టెప్పా మార్‌తో మ్యూజిక్ ప్రమోషన్‌లను ప్రారంభించింది. స్టెప్పా మార్ ట్రూలీ మాస్ డ్యాన్స్, రిథమ్, హై ఎనర్జీని సెలబ్రేట్ చేసుకునే సాంగ్. ఉస్తాద్ రామ్ పోతినేని అద్భుతమైన పెర్ఫార్మెన్స్, పూరి జగన్నాధ్ స్టైలిష్ టేక్ విజువల్ మాస్ ఫీస్ట్ లా వుంది. వోకల్స్, లిరిక్స్ లిజినర్స్ కి గొప్ప ఉత్సాహాన్ని ఇచ్చాయి. ఇన్ఫెక్షియస్ బీట్‌లు, ఆకట్టుకునే లిరిక్స్ దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులతో ప్రతిధ్వనిస్తూ స్టెప్పామార్ మాస్ సాంగ్ ఆఫ్ ది ఇయర్ గా నిలిచింది. మణిశర్మ కంపోజ్ చేసిన స్టెప్ప మార్ ఇన్స్టంట్ చార్ట్‌బస్టర్, ఇది మ్యూజిక్ ప్రమోషన్‌లను అద్భుతంగా ప్రారంభించింది.

## అల్లరి నరేష్‌తో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్

కామెడీ మరియు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న అల్లరి నరేష్, విభిన్న చిత్రాలు, పాత్రలతో గొప్ప నటుడిగానూ పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు నరేష్ మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడానికి సిద్ధమవుతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించ నుంది. అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా జూన్ 30న "మీరు అతని కంటి నుండి తప్పించుకోలేరు" అంటూ విలక్షణమైన కాన్సెప్ట్ పోస్టర్‌తో నిర్మాణ సంస్థ ఈ చిత్ర ప్రకటన చేసింది. సంకేత భాషతో రూపొందించిన ఈ పోస్టర్ ఎంతో సృజనాత్మకంగా ఉంది. ఒక్క పోస్టర్‌తోనే విభిన్న కాన్సెప్ట్‌తో ఈ సినిమా రానుందనే విషయాన్ని స్పష్టం చేశారు. ఈ సృజనాత్మక పోస్టర్ సినీ ప్రేమికులలో మరియు అల్లరి నరేష్ అభిమానులలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సంకేత భాషలో దాచిన సందేశాన్ని డీకోడ్ చేయడానికి అందరూ ప్రయత్నిస్తున్నారు. అల్లరి నరేష్ ఇటీవలి కాలంలో వైవిధ్యమైన, కొత్త కాన్సెప్ట్ ఓరియెంటెడ్ చిత్రాలలో నటిస్తున్నారు. ఇక ఇప్పుడు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమా కేవలం ప్రకటనతోనే అందరిలో ఆసక్తిని కలిగిస్తోంది. "ఫ్యామిలీ డ్రామా" చిత్రంతో ప్రశంసలు పొందిన రచయిత-దర్శకుడు మెహర్ తేజ్ ఈ చిత్రానికి రచన మరియు దర్శకత్వం వహిస్తున్నారు. నూతన కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించి, ఘన విజయం సాధిస్తుందని నిర్మాతలు నమ్మకం వ్యక్తం చేశారు.



## ఘనంగా "కోడి బుర్ర"



ఒకరికి ఒకరు, రోజాపూలు, స్నేహితులు, రాగల 24 గంటల్లో వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన హీరో శ్రీరామ్ కొత్త మూవీ "కోడి బుర్ర" ఈ రోజు హైదరాబాద్ ఫిలింనగర్ దైవసన్నిధానంలో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని వీ4 క్రియేషన్స్ బ్యానర్ లో కంచర్ల సత్యనారాయణరెడ్డి, గట్టు విజయ్ గౌడ్, చిన్ని చందు, వట్టం రాఘవేంద్ర, సముద్రాల మహేశ్ గౌడ్ నిర్మిస్తున్నారు. చంద్రశేఖర్ కానూరి దర్శకత్వం వహిస్తున్నారు. శృతి మీనన్, ఆరుషి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. మహావీర్ మరో కీ రోల్ పోషిస్తున్నారు. కోడి బుర్ర సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కెమెరా స్విచ్చాన్ చేశారు. నిర్మాత బెక్కెం వేణుగోపాల్ క్లాప్ నివ్వగా దర్శకుడు భరత్ కమ్మ స్క్రిప్ట్ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ - కోడి బుర్ర చిత్రాన్ని మా మిత్రులు నిర్మిస్తున్నారు. మంచి కథను ఈ సినిమా కోసం ఎంచుకున్నారు. ప్రేక్షకుల్ని ఈ మూవీ ఆకట్టుకుని ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాం. హీరో శ్రీరామ్, హీరోయిన్ శృతి మీనన్, నిర్మాతలైన నా మిత్రులు, ఇతర టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా అన్నారు.

## 'విడాముయర్చి' ఫస్ట్ లుక్

అగ్ర కథానాయకుడు అజిత్‌కుమార్, లైకా ప్రొడక్షన్స్ కలయికలో మగిళ్ తిరుమేని దర్శకత్వంలో రూపొందుతోన్న ప్రెస్టీజియస్ మూవీ 'విడాముయర్చి'. ఈ క్రేజీ కాంబోలో సినిమా అనగానే అభిమానులు సహా అందరిలో సినిమాపై భారీ అంచనాలు మొదలయ్యాయి. అసలు సినిమాలో అజిత్ లుక్ ఎలా ఉంటుంది.. మూవీ ఎలా ఆకట్టుకోనుందంటూ అందరూ ఆసక్తిగా ఎదురు చూడసాగారు. ఆ సమయం వచ్చేసింది.. అందరి అంచనాలను మించేలా 'విడాముయర్చి' సినిమా నుంచి ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేవారు. 'విడాముయర్చి' సినిమా ప్రారంభం నుంచి కోలీవుడ్ సహా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. టాప్ స్టార్స్, టెక్నీషియన్స్ అందరూ ఈ సినిమాలో భాగమయ్యారు. ఇండియన్ సినీ ఇండస్ట్రీలో స్టార్స్‌తో భారీ బడ్జెట్ చిత్రాలు, డిఫరెంట్ కంటెంట్ బేస్డ్ సినిమాలను నిర్మిస్తోన్న టాప్ ప్రొడక్షన్ హౌస్ లైకా ప్రొడక్షన్స్. ఈ సంస్థ అధినేత సుభాస్కరన్..'విడాముయర్చి' సినిమాను నిర్మిస్తున్నారు. ఆద్యంతం ఆకట్టుకునే ఎంటర్‌టైన్మెంట్ చిత్రాలతో పాటు విలక్షణమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడిగా పేరున్న మగిళ్ తిరుమేని అజిత్‌తో భారీ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.



## 'సుధీర్ బాబు' హీరోగా మిస్టరీ థ్రిల్లర్

వైవిధ్యమైన చిత్రాలతో అందరి దృష్టిని ఆకర్షిస్తోన్న కథానాయకుడు సుధీర్‌బాబు. నవ దళపతిగా అభిమానుల మన్ననలు అందుకుంటున్న ఈయన ఓ సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్‌లో నటించబోతున్నారు. ఇది భారీ బడ్జెట్ చిత్రంగా



రూపొందనుంది. ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను ఆడియెన్స్‌కి అందించేలా, లార్జర్ దేన్ లైఫ్ స్టోరీ లైన్‌తో ఇంతకు ముందెన్నడూ చూడని డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కబోతున్నఈ సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్‌కి ఎంతో ప్రాధ్యానత ఉంది. వెంట్ కళ్యాణ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. జూన్ 14న విడుదలైన హరోంహర చిత్రంతో సుధీర్ బాబు రీసెంట్‌గా సక్సెస్ సాధించిన సంగతి తెలిసిందే. అందులో యాక్షన్ సన్నివేశాలు, గ్రిప్పింగ్ కథనంకు ప్రేక్షకుల నుంచి చాలా మంచి స్పందన వచ్చింది.రుస్తుం, టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్ కథ, ప్యాడ్ మ్యాన్, పరి వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ప్రేరణ అరోరా సమర్పణలో ఇప్పుడు సుధీర్ బాబు చేయబోతున్ పాన్ ఇండియా సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్ చిత్రం రూపొందనుంది. త్వరలోనే చిత్ర యూనిట్‌తో బాలీవుడ్ హీరోయిన్ జాయిన్ కానుంది. త్వరలోనే మేకర్స్ ఆ వివరాలను తెలియజేస్తారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది శివరాత్రి సందర్భంగా మార్చిలో విడుదల చేయనున్నారు.

## డివోషనల్ థ్రిల్లర్ షణ్ముఖ

వైవిధ్యమైన చిత్రాలకు, విభిన్నమైన కథలకు తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తుంటారు. ఆ కోవలోనే రూపొందుతున్న డివోషనల్ థ్రిల్లర్ చిత్రం షణ్ముఖ. పవర్‌ఫుల్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆది సాయికుమార్ కథానాయకుడు. అవికాగోర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. శాసనసభ అనే పాన్ ఇండియా చిత్రంతో అందరికి సుపరిచితమైన సంస్థ సాప్‌బ్రో ప్రొడక్షన్స్ సంస్థ తమ ద్వితీయ చిత్రంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల జరిగిన చివరి షెడ్యూల్‌తో ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తిచేసుకుంది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న అవికాగోర్ పుట్టిన రోజు సందర్భంగా చిత్రంలో ఆమె లుక్‌ను రివీల్ చేస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మట్లాడుతూ ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో రూపొందుతున్న డివోష నల్ థ్రిల్లర్ ఇది. విజువల్ వండర్‌లా, అద్భుతమైన గ్రాఫిక్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఈ చిత్రంలో కథానాయిక అవికాగోర్ సర పాత్రలో సాహ సోపేతమైన పనులు చేసే శక్తివంతమైన అమ్మాయి పాత్రలో కనిపించనుంది. లక్ష్య సాధనలో ఆది పాత్రకు సపోర్ట్ చేస్తూ ఆయనకు తోడుగా నిలిచే పాత్ర. తప్పకుండా ఆమె కెరీర్‌లో ఈ పాత్ర, సినిమా మరిచిపోలేని చిత్రంగా నిలిచిపోతుంది.





## సికిందర్ సొగసులు

బాలీవుడ్‌లో అడుగు పెట్టి రెండు దశాబ్దాలకు పైగా పూర్తి అయినా కూడా ఇంకా ఏమాత్రం అందం తగ్గకుండా పాతికేళ్ల పడుచు అమ్మాయిలతో అందం విషయంలో పోటీ పడుతున్న సీనియర్ ముద్దు గుమ్మ షామా సికిందర్. సినిమా మరియు బుల్లి తెరపై ఈ అమ్మడు తన దైన ముద్ర వేసింది. నాలుగు పదుల వయసులో కూడా అందాల ఆరబోత విషయంలో కొత్త హీరోయిన్స్‌కి పోటీ అన్నట్లుగా నిలుస్తున్న ముద్దుగుమ్మ షామా సికిందర్ తాజాగా బ్యాంకాక్‌లో సందడి చేస్తుంది. అక్కడ బీచ్‌ల్లో, పరిసర ప్రాంతాల్లో చక్కర్లు కొడుతూ ఆ ఫోటోలను ఇన్‌స్టా ద్వారా తన ఫాలోవర్స్‌తో షేర్ చేసుకుంటూ ఉంది. తాజా ఫోటో షూట్‌లో అందాల షామా సికిందర్ పింక్ స్కిన్ టైట్ టాప్ లో అందాలను చూపిస్తూ కన్నుల విందు చేస్తుంది. ఈ వయసులో ఇంతటి అందం కేవలం షామా కే సాధ్యం కావచ్చు అన్నట్లుగా ఆమె ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044